
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం fb.com/vaartha

PUBLISHED FROM KHAMMAM, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

19-10-2023 గురువారం సంపుటి : 29 సంచిక : 260 పేజీలు : 8+16 వెల : 6.50




త్రిపుర గవర్నర్‌గా బిజెపి అగ్రనేత ఇంద్రసేనారెడ్డి 2లో

## మీ భవిత కోసం

# 6 గ్యారెంటీలు

కాంగ్రెస్‌తోనే తెలంగాణ, దేశాభివృద్ధి

బిఆర్ఎస్, బిజెపిని తరిమి కొట్టండి

కారుకు ఓటేస్తే కమలానికి వేసినట్లే

సీతక్క, గండ్ర సత్యనారాయణను భారీ మెజారిటీతో గెలిపించండి

కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక



ములుగు జిల్లాలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభలో రాహుల్, ప్రియాంక, రేవంత్‌రెడ్డి తదితరులు



ములుగు జిల్లాలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభకు హాజరైన జనం

**ములుగు / వెంకటాపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ రాష్ట్రం, భారతదేశం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ములుగు జిల్లాలోని రామంజపూర్ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ విజయ భేరి యాత్ర సందర్భంగా ములుగు, భూపాలపల్లి యోజకవర్గాల మహిళలతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయనతో పాటు కాంగ్రెస్‌పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీతో కలిసి మహిళా డిక్లరేషన్ పై ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడిందని, బంగారు తెలంగాణ పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం కేసిఆర్ ≫2



బుధవారం జడ్చర్ల ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం. సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్

# మూడా? 24 గంటలా!

ఎంత విద్యుత్ కావాలో రైతులే ఆలోచించాలి..

కాంగ్రెస్ వస్తే మళ్లీ అంధకారం, రైతు బంధుకు రాం.. రాం

జడ్చర్లను అద్భుతంగా మార్చే బాధ్యత నాది

'ప్రజా ఆశీర్వాద సభ'లో సిఎం కెసిఆర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** 'కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే 20గంటల కరెంట్ ఇస్తామని చెప్పి నేడు 5గంటలే ఇస్తమంటున్నరు.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కూడా కేసీఆర్ రైతులకు 24గంటలు వేస్టుగా ఇస్తుండు..మూడు గంటలైతే సరిపోతది అని అంటున్నాడు..మరి మూడు గంటల కరెంట్ కావాలా 24గంటల కరెంట్ కావాలా రైతులే ఆలోచించుకోవాలి.. దేశం మొత్తంలో 24గంటల కరెంట్ ఇచ్చేది తెలంగాణ ఒక్కటే.. ప్రధాన మంత్రి మోడీకి కూడా 24గంటల కరెంట్ ఇవ్వడానికి చేతకావట్లేదు. గుజరాత్‌లో కరెంట్ కోసం రైతులు రోడ్లమీదకొస్తున్నారు. పొరపాటునా కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాంరాం..దళితబంధుకు జై భీం..మళ్లీ కథ మొదటికి వస్తది ఆగం కావొద్దు..ఆలోచించాలి " అని బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ≫2



## ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత బిఆర్ఎస్‌దే

మేడ్చల్ బహిరంగ సభలో సిఎం కెసిఆర్

**మేడ్చల్,అక్టోబర్18 (ప్రభాతవార్త) :** తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటిని వంద శాతం నెరవేర్చి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ ≫2

## ఖరగ్‌పూర్ ఐఐటిలో తెలంగాణ విద్యార్థి ఆత్మహత్య 3లో



## పోల్ పోరు



## క్యూ కడుతున్న కేంద్ర నేతలు

20న స్మృతి ఇరానీ, తర్వాత అమిత్‌షా, హిమంత, ఆదిత్యనాథ్

వచ్చే మొదటి వారంలో ప్రధాని

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంటుంది. రాష్ట్రానికి జాతీయ స్థాయి నేతలు క్యూలు కడుతున్నారు. బిజెపికి సంబందించిన పలువురు జాతీయ నేతలు రాష్ట్రానికి రానున్నారు. కేంద్రమంత్రులతో ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం తెలంగాణలో ప్రచారం చేయనున్నారు. తెలంగాణలో గెలుపే లక్ష్యంగా బిజెపి తన ≫2

బ్రిజేష్ ట్రిబ్యునల్ విచారణ

## నవంబర్ 22కు వాయిదా

కొత్త విధివిధానాలను 'సుప్రీం'లో సవాల్ చేసిన ఎపి

**హైదరాబాద్, అక్టోబర్ 18,ప్రభాతవార్త:** కృష్ణా జలాల వివాదం పరిష్కారం కోసం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ బుధవారం చేపట్టిన విచారణ నవంబర్ 22,23 తేదిలకు వాయిదా వేశారు. కృష్ణా జలాల పంపిణీ వివాదం నవంబర్15లోపు అభిప్రాయం చెప్పాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఆదేశాలను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్ పై అధ్యయనం చేయాల్సి ఉందని దానిని అధ్యయనం కోసం సమయం కావాలని ఎపి ప్రభుత్వం కోరింది. అదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం నీటి పంపకాలను త్వరగా చేపట్టాలని విచారణ జరుపాలని కోరింది. ఏపి విజ్ఞప్తి మేరకు విచారణ వాయిదా వేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీ వివాదం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి 2014 నుంచి మొదలైంది. పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల పథకం నిర్మాణంతో మరింత తారాస్థాయికి చేరింది. తెలంగాణ ప్రభుత్వం కృష్ణాజలాలలో నది పరివాహక లభ్యతకు అనుగుణంగా నీటి వాటాను కోరుతున్నది. రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలకు సంబందించిన విషయంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన ఆదేశాలు ఇవ్వాలని ఈనెల 6న కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రల మధ్య కృష్ణానది జలాల పంపకాలపై విచారణ అధికారాలను కేంద్రం నోటిఫై చేసింది. కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్‌పై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి వుంది. అందుకు అవకాశం ఇవ్వాలని ఏపి ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను కోరింది. అయితే ఏపి తెలంగాణ అభ్యర్థనను తెలంగాణ ప్రభుత్వం తోసిపుచ్చింది. నీటి పంపకాలను వెంటనే విచారణ చేపట్టాలని ట్రిబ్యునల్‌ను తెలంగాణ కోరింది. కానీ ఎపి ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను వాయిదా వేసింది. నవంబర్ 15లోగా కేంద్రప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌పై అభిప్రాయం చెప్పాలని ఏపి ప్రభుత్వంకు నిర్ధేశించింది. ఇది ఇలా వుంటే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌పై ఎపి ప్రభుత్వం సుప్రీమ్ కోర్టును ఆశ్రయించింది. ట్రిబ్యునల్‌కు కేంద్ర ప్రభుత్వం కొత్త విధివిధానాలు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్‌ను మంగళవారం సుప్రింకోర్టు విచారణకు తీసుకొంది. కేంద్రప్రభుత్వం కొత్త విదివిధానలు ఇవ్వడం సరికాదని న్యాయపోరాటం చేయడానికి ఆంధ్రప్రదేశ్ అధికారులను సిఎం జగన్మోహన్‌రెడ్డి అన్ని హంగులు సమకూర్చుకోవాలని కోరారు. ఉమ్మడి ఎపికి కృష్ణాజలలు 811 టిఎంసిలు కేటాయించగా అందులో తెలంగాణ కు 299టిఎంసిలు 512 టిఎంసిలు కేటాయించుకుంటూ 2015లోనే నిర్ణయం తీసుకొన్నాయి. కేంద్రం కూడా గెజిట్ ప్రకటన చేసింది. కేంద్రం అప్పుడు మధ్యవర్థిత్వం వహించింది. తెలంగాణ ఏపి ఏకాభిప్రాయంతో ఈ పంపకాలు చేసుకున్నాయి అని ఆంధ్రప్రదేశ్ వాదిస్తుంది. బ్రిజేష్ కుమార్ 65% డిపెండెబుల్‌తో నీటిజలాలు పంపిణీ చేయడంపై గత 15 ఏళ్ళక్రితమే అన్యాయం చేసిందని ఆనాటి ఉమ్మడి ఎపి 'సుప్రీం'లో వాజ్యానికి వెళ్ళింది. ఇంకా అక్కడ స్టేలోవుంది. బచావత్‌అవార్డు ఇప్పటికిఆచరణలో వుంది.



ఎం. లక్ష్మణ్



జి. అనుపమ



మానవేంద్రనాథ్



వెంకటరమణ

తెలంగాణ, ఎపి నుంచి

## నలుగురు జడ్జిల బదలీ

దేశవ్యాప్తంగా 16 మంది బదలీ

ఎపి సహా కొన్ని చోట్ల అదనపు జడ్జిల నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబర్18:** దేశ వ్యాప్తంగా పలు హైకోర్టులకు న్యాయమూర్తు నియామకం,బదిలీలపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఏపీ హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జిలను నియమించారు. ఏపీ హైకోర్టు అదనపు జడ్జిలుగా నూనెపల్లి హరినాథ్, మండవ కిరణ్మయి, జగడం సుమతి,న్యాపతి విజయ్ ≫7

# ప్రవళిక సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం

హామీ ఇచ్చిన మంత్రి కెటిఆర్

ప్రగతిభవన్‌లో మంత్రిని కలిసిన బాధితులు



మంత్రి కెటిఆర్‌ను కలిసిన ప్రవళిక కుటుంబ సభ్యులు

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** యువతా ప్రతిపక్షాల చిల్ల రాజకీల ఉచ్చులో పడవద్దని, ప్రవళిక కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని, అన్ని విధులుగా అండగా ఉంటామని మంత్రి కెటిఆర్ హామి ఇచ్చారు. బుధవారం ప్రగతిభవన్‌లో మంత్రి కెటిఆర్‌ను ప్రవళిక కుటుంబ సభ్యులు కలిసారు. ఈ సందర్భంగా ప్రవళిక కుటుంబ సభ్యులకు మంత్రి కెటిఆర్ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ ప్రవళిక కుటుంబానికి జరిగిన నష్టాన్ని పూడ్చలేమని అన్నారు. నిందితుడిని పట్టుకుని చట్టపరంగా శిక్షణ పడేలా చూస్తామన్నారు. ప్రవళిక కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామి ఇచ్చారు. ప్రవళిక మరణానికి శివరామ్ అనే వ్యక్తి కారణం అన్నారు. అతన్ని కఠినంగా శిక్షించాలని, ఆమె కుటుంబ సభ్యులు మంత్రిని కోరారు. శివరాంకు శిక్ష పడేలా చూడాలన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి భరోసా ఇచ్చిన మంత్రి కెటిఆర్ ప్రవళిక మరణం చాలా దురదృష్టకరం అన్నారు. కుటుంబ సభ్యులు ఈ బాధకర సమయంలో ధైర్యంగా ఉండానల్నారు. ఈ సంఘటనకు సంబంధించి అన్ని వివరాలు డిజిపితో మాట్లాడిన కెటిఆర్ విచారణను మరింత వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రవళిక సోదరుడు ప్రణయ్ మాట్లాడుతూ కేసు పురోగతిపై డిజిపితో మాట్లాడినట్లు కెటిఆర్ చెప్పారన్నారు. తమ కుటుంబానికి అండగా ఉంటామని కెటిఆర్ హామి ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కెటిఆర్‌ను ప్రవళిక తల్లిదండ్రులు, తమ్ముడు ప్రణయ్ కలిశారు.

## పోలీసుల అదుపులో శివరామ్ రాథోడ్? 7లో



బుధవారం హైదరాబాద్‌లో పవన్‌తో భేటీ అయిన కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

## తెలంగాణలో జనసేన, బిజెపి పొత్తు!

పవన్‌తో కిషన్, లక్ష్మణ్ భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జనసేనతో కలిసి పోటీ చేసేందుకు బిజెపి నేతలు చర్చలు జరిపారు. బుధవారం హైదరాబాద్‌లోని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నివాసానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డా. కె. లక్ష్మణ్‌లు వెళ్లారు. దాదాపు ≫2



టెల్‌అవీవ్‌లో బుధవారం నెతన్యాహుతో బైడెన్

## ఇజ్రాయెల్‌కు అండగా ఉంటాం

గాజా ఆస్పత్రిపై దాడి మిలిటెంట్ల పనే: బైడెన్.. నెతన్యాహుతో భేటీ

**టెల్‌అవీవ్, అక్టోబర్ 18:** సెంట్రల్ గాజాలోని ఆసుపత్రిపై జరిగిన దాడి ఇజ్రాయెల్ చేయలేదని, అది మిలిటెంట్ల పనేనని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఇదే విషయాన్ని చెప్పానని అన్నారు. ఆసుపత్రిపై దాడి ఘటన తనకెంతో ఆగ్రహం కలిగించిందన్న బైడెన్ హమాస్ మిలిటెంట్లపై పోరాడుతున్న ఇజ్రాయెల్‌కు అమెరికా తరఫున పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. అయితే బైడెన్ చేసిన ప్రకటనపై స్పందించిన హమాస్ అమెరికా గుడ్డిగా ఇజ్రాయెల్ వైపు మొగ్గుచూపుతోందని పేర్కొంది. గాజాలోని ఆసుపత్రిపై జరిగిన ఘటన నన్నెంతో కలచివేసింది. నా దగ్గర ఉన్న సమాచారం ఆధారంగా ఆ దారుణం వేరే బృందం చేసినట్లుగా కనిపిస్తోంది. అది ఇజ్రాయెల్ పని కాదు. ఆ దాడికి కారణం ఏమిటనే విషయం ఖచ్చితంగా తెలియదు. హమాస్ మిలిటెంట్లు ≫2

# కేంద్ర ఉద్యోగులకు 4% డిఏ పెంపు

దసరా కానుకలు ప్రకటించిన మోడీ సర్కార్

6 పంటలకు మద్దతు ధర హెచ్చింపు

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్



ఢిల్లీలో కేబినెట్ వివరాలు మీడియాకు వెల్లడిస్తున్న కేంద్ర మంత్రి అనురాగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబర్18:** పండగ వేళ కేంద్ర ప్రభుత్వ,రైల్వే ఉద్యోగులతో పాటు రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుకుల డిఏను 4 శాతం, రైల్వే ఉద్యోగాలను బోనస్ చెల్లింపులకు ప్రధాని మోడీ నేతృత్వంలో బుధవారం జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ మేరకు ఆమోదం తెలిపింది. గోధుమలకు కనీస మద్దుతు ధరను క్వింటాకు రూ.150 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కేబినెట్ సమావేశం అనంతరం నిర్ణయాలను కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్‌ను (డిఏ) 4 శాతం పెంచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో కేంద్ర ఉద్యోగులకు ప్రస్తుతం ఇస్తున్న డీఏ 42శాతం నుంచి 46 శాతానికి పెరగనుంది. జూలై 1 నుంచి పెరిగిన డిఏ వర్తించనుంది. 7వ వేతన సంఘం ఉద్యోగులకు, 67.95 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. రైల్వే ఉద్యోగులకు ఏటా ఇచ్చే ఉత్పాదకత అధారిత బోనస్‌కు సైతం కేంద్ర కేబినెట్ ఈ సందర్భంగా ఆమోదం తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను 78 రోజులకు సమానమైన వేతనాన్ని బోనస్‌గా చెల్లించనున్నారు. ఆర్‌పిఎఫ్ సిబ్బంది మినహా ట్రాక్ మెయింటెనర్లు, లోకో పైలెట్లు, ట్రెయిన్ మేనేజర్లు, స్టేషన్‌మాస్టర్లు, ≫2

# క్యూ కడుతున్న కేంద్ర నేతలు

ప్రచారాన్ని ముమ్మరం చేయనుంది. ఇప్పటికే ప్రధాని నరేంద్రమోడితో పాటు కేంద్రహోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలో పలు సార్లు పర్యటించారు. అంతేకాకుండా గత వారం రోజులుంగా పలువురు కేంద్ర మంత్రులు సైతం రాష్ట్రంలో పర్యటనలు, ప్రచారం కొనసాగిస్తున్నారు. వీరితో పాటు ఈనెల 20వ తేది బతుకమ్మ పండగ సందర్భంగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తెలంగాణాకు వస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె బతుకమ్మ పండగ ఉత్సవాలలో పాల్గొనున్నారు. అనంతరం ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. మహిళా బిల్లు బిజెపి చేసిన కృషి, తెలంగాణ ఏర్పాటు కోసం బిజెపి మద్దతుతో పాటు అంశాలపై దుబ్బాలో జరిగే బహిరగ సభలో ప్రజలకు వివరించనున్నారు. అదేవిధంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన మరోసారి ఖరారు అయింది. ఈనెల 27వ తేదిన పర్యటన ఉంటుందని బిజెపి నేతలు పేర్కొంటున్నారు. వీరితో పాటు అసోం, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు సైతం తెలంగాణలో పర్యటించనున్నారు. అసోం సిఎం హిమంత బిశ్వశర్మ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లు రాష్ట్రంలో పర్యటించనున్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అయితే ఎలా అభివృద్ధి చెందుతుందనే వీరు వివరించనున్నారు. తమ రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంస్కరణలు వివరించనున్నారు. ఈనెల 28న అసోంసిఎం, 31న ఉత్తరప్రదేశ్ సిఎం పర్యటనలు ఖరారు అయ్యాయి. కాగా వచ్చే నెల మొదటి వారంలో ప్రధాని మోడి బహిరంగ సభ ఉండనుంది.


బుధవారం రామప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రాహుల్, ప్రియాంక


బుధవారం ములుగు జిల్లాలో రాహుల్, ప్రియాంకకు బతుకమ్మను అందజేస్తున్న సీతక్క

# మీ భవిత కోసం 6 గ్యారెంటీలు

దోపిడికి పాల్పడిందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటెస్తే బిజెపికి ఓటేసినట్లేనని, బిఆర్ఎస్, బిజెపిలను తరిమి కొట్టండని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆలోచనా విధానం బిజెపి, బిఆర్ఎస్ పార్టీల విధానాలకు వ్యతిరేకమని, తమది పేద ప్రజల సంక్షేమ ఆలోచనా విధానమని అన్నారు. వచ్చే ఎన్నికలు తెలంగాణ దొరల పాలనకు, తెలంగాణ ప్రజలకు పోటీ అని, తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు, కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసి కూడా సోనియా గాంధీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కోసం వందలాది మంది ప్రాణాలను త్యాగం చేశారని, ఈ సందర్భంగా శ్రీకాంతాచారిని మనం తలుచుకోవాలని తెలిపారు. రాష్ట్ర ంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి వారిని ఆదుకుంటామని పేర్కొన్నారు. ఎన్నికల ము ందు కేసిఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక మోసం చేశారని, ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయలేదని, ధరణి పేరుతో ప్రజలు భూములను లాక్కున్నారని, దళితులకు 3 ఎకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు ఏమైందని, పోడు రైతులకు అన్యాయం చేశారని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఏమైందని వారుప్రశ్నించారు. బిఆర్ఎస్ ఇంటికో ఉద్యోగం ఇస్తామని మరిచారని తెలిపారు. తెలంగాణలో రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారిందని పండించిన ధాన్యంతో పాటు రైతులు పండించిన పంటకు కనీస మద్ధతు ధర చెల్లిస్తామని వివరించార. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్ష కోట్ల రూపాయలు కేసిఆర్ జేబుల్లోకి వెళ్లాయని, ఈ దోపిడి పాలనను అంతం చెయ్యాలంటే ప్రజలు ఐక్యంగా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని వారు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలు చరమ గీతం పాడాలని లేకుంటే రానున్న రోజుల్లో మరింత నష్టపోతామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్, ఎస్టీలకు 12% రిజర్వేషన్ అమలు చేస్తామని, ఓబీసీలకు న్యాయం చేస్తామని వారు తెలిపారు. విభజన సమయంలో కేంద్రం ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ఇంత వరకు ఏర్పాటు చేయక బిజెపి మీద కాంగ్రెస్, కాంగ్రెస్ మీద బిజెపిలు ఆరోపణలు చేసుకుంటూ గిరిజనులకు అన్యాయంచేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, ఈకుట్రలు తిప్పికొట్టాలంటే ప్రజలు కాంగ్రెస్ కు మద్ధతుగా నిలవాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణప్రజల కోసం ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీ స్కీములను అమలుచేసి ప్రజలను ఆదుకుంటామని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వివరించారు. మహాలక్ష్మీ పథకంలో మహిళలకు ప్రతి నెల రూ. 2500లు, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసాలో ప్రతి ఏటా రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ. 15 వేలు పెట్టుబడి సాయం, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు, సంవత్సరానికి రూ. 500లు వరి పంటకు పంట బోనస్, గృహజ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్‌లు ఉచితమని, ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్లు లేని ప్రతి పేదవారికి ఇంటి స్థలం, రూ. 5 లక్షలు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, యువ వికాసం పథకం కింద విద్యార్థులకు 5 లక్షల రూపాయల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్, చేయూత పథకం కింద రూ.4 వేలు వృద్ధులకు నెలవారి పెన్షన్‌లు, రూ. 10 లక్షలు రాజీవ్ ఆరోగ్య బీమా, ప్రజలకు అందుబాటులోకి తెస్తామని, ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓటువేయాలన్నారు. ములుగు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సీతక్కను, భూపాలపల్లి కాం గ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావులతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉత్తం కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, గండ్ర సత్యనారాయణ రావు వేలాది మంది కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కాగా ములుగు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో పోలీసులు భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లు నిర్వహించారు.

## తెలంగాణలో జనసేన, బిజెపి పొత్తు

గంటకుపైగా పవన్‌కళ్యాణ్ సమావేశం అయ్యారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అంశాలు, సీట్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ సారి తెలంగాణలో 30 స్థానాల్లో జనసేన పోటీ చేయాలని భావిస్తున్నట్లు బిజెపి నేతలకు పవన్ కళ్యాణ్ వివరించారు.
2014 ఎన్నికల్లో పోటీ చేయకుండా తెలుగుదేశం, బిజెపికి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అదేవిధంగా జిహెచ్ఎంసి ఎన్నికల్లో కూడా పోటీ చేయకుండా బిజెపి గెలుపుకు కృషి చేసినట్లు తెలిపారు. ఈ సారి ఎన్నికల్లో కనీసం 30 స్థానాల్లో పోటీ చేయకపోతే కార్యకర్తల మనోధైర్యం దెబ్బతింటుందని, అందుకే కనీసం 30 స్థానాల్లోలో పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

## చంద్రబాబుపై ఫైబర్‌నెట్ కేసులో నిర్ణయాన్ని రేపటికి వాయిదా వేసిన ఎసిబి కోర్టు

**విజయవాడ,అక్టోబరు18,ప్రభాతవార్తప్రతినిధి:**చంద్రబాబుపై ఫైబర్‌నెట్ కేసులో సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌పై నిర్ణయాన్ని ఈ నెల20న వెల్లడిస్తామని విజయవాడ ఏసీబీ కోర్టు తెలిపింది.చంద్రబాబును ఏసీబీ కోర్టులో హాజరు పర్చాల్సి ఉంది.దాంతో సీఐడీ మెమో దాఖలు చేసింది.ఇదే కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్ శుక్రవారం విచారణ చేపడతామని సుప్రీం కోర్టు ఇటీవల ప్రకటించింది.అంతవరకు ఆయనను అరెస్ట్ చేయొద్దని సీఐడీ తరపు న్యాయవాదులకు సూచించింది.దీంతో పీటీ వారెంట్ నిర్ణయం ఈ నెల 20వ తేదికి వాయిదా వేస్తూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

SINGAM KUIL RED WEDNESDAY
DrawDate on:18/10/23

DAY - SINGAM SERIES Dr No:209
1st Prize Rs.100000/- 294187
2nd Prize Rs.7000/- 73651
3rd Prize Rs.3500/-
31036 46382 56431 57521 79997
83497 86014 86766 92573 93909
4th Prize Rs.200/-
0897 1240 2988 3474 3802 4765 5027
5618 9558 9829
5th Prize Rs.100/-
0728 0773 1666 2528 3501 3587 4336
6245 7140 8903
6th Prize Rs.50/-
0025 1353 3098 4492 6067 7112 8704
0042 1539 3137 4565 6068 7121 9102
0214 1622 3373 4574 6074 7133 9286
0245 1717 3410 4687 6102 7198 9336
0401 1830 3479 5066 6126 7235 9544
0458 1876 3515 5088 6176 7330 9646
0488 2045 3801 5165 6325 7352 9907
0501 2053 3862 5266 6358 7722 9928
0536 2294 3868 5352 6391 7812 9959
0590 2397 4020 5665 6478 7870 9975
0979 2514 4045 5792 6553 7879
1017 2520 4203 5826 6572 8090
1075 2576 4206 5932 6645 8204
1147 2663 4221 6003 6753 8461
1342 2702 4340 6004 6834 8491

DAY - KUIL SERIES Dr No:209
1st Prize Rs.100000/- 987750
2nd Prize Rs.7000/- 34673
3rd Prize Rs.3500/-
02080 11330 61659 62304 65360
81672 85619 92856 98525 98931
4th Prize Rs.200/-
2209 2485 2670 3546 4749 6871 6916
6958 7144 8748
5th Prize Rs.100/-
0607 1104 1240 2480 4271 4501 5449
6109 6250 8657
6th Prize Rs.50/-
0112 1299 2793 4113 6041 7376 9222
0317 1376 2810 4148 6316 7589 9373
0335 1444 2911 4221 6361 7847 9431
0584 1547 2971 4233 6421 7960 9501
0599 1845 3022 4469 6422 8047 9534
0656 1930 3199 4646 6560 8052 9543
0727 2055 3207 4795 6598 8136 9562
0835 2091 3267 5282 6615 8295 9720
1032 2147 3357 5544 6739 8501 9726
1044 2179 3545 5658 6786 8750 9987
1079 2308 3639 5750 6814 8963
1120 2470 3696 5780 6906 8979
1125 2678 3941 5793 6971 9076
1234 2710 3998 5980 7252 9163
1250 2767 4002 6039 7265 9183

ROSA DEAR PEARL WEDNESDAY
DrawDate on:18/10/23

DAY - ROSA SERIES Dr No:209
1st Prize Rs.100000/- 755932
2nd Prize Rs.7000/- 49259
3rd Prize Rs.3500/-
11169 26137 26367 31579 41382
62039 67337 74992 77467 77535
4th Prize Rs.200/-
0473 0799 1249 1874 2916 3889 4296
4466 4661 9131
5th Prize Rs.100/-
0166 1638 1696 3155 4615 5302 6074
7723 8874 9741
6th Prize Rs.50/-
0065 1620 2524 4196 5496 7361 8560
0092 1646 2592 4303 5549 7508 8584
0124 1655 2596 4310 5559 7521 8643
0202 1665 2686 4350 5572 7628 8843
0219 1672 2743 4388 5666 7674 9258
0222 1896 2785 4407 5702 7772 9320
0272 1915 3009 4639 5809 7812 9363
0360 1943 3083 4778 5817 7852 9725
0470 1987 3273 4863 6047 7973 9746
0943 2031 3686 4881 6076 7988 9831
1053 2202 3816 4890 6117 8060
1056 2222 3897 5071 6299 8129
1176 2228 4088 5103 6474 8280
1531 2291 4096 5159 6707 8426
1606 2472 4125 5198 6766 8531

DAY - DEAR SERIES Dr No:209
1st Prize Rs.100000/- 719699
2nd Prize Rs.7000/- 32375
3rd Prize Rs.3500/-
09909 29193 32232 50044 56142
68920 71757 77162 78773 94806
4th Prize Rs.200/-
0498 1718 3811 4818 5476 5727 6331
8330 8353 8886
5th Prize Rs.100/-
2510 3849 4955 5064 5459 6567 8306
8525 8704 9967
6th Prize Rs.50/-
0103 1700 2720 4021 5566 6917 8839
0121 1703 2822 4307 5726 6937 8864
0343 1715 3002 4378 5929 7067 8969
0356 1716 3141 4399 6099 7129 9399
0477 1871 3210 4501 6125 7462 9538
0502 1898 3313 4572 6170 7468 9644
0849 1903 3331 4580 6210 7596 9680
0998 1922 3353 4680 6246 7672 9765
1126 2051 3357 4859 6363 8074 9785
1163 2277 3494 4960 6414 8408 9829
1286 2321 3724 5037 6422 8587
1501 2483 3729 5254 6782 8650
1550 2572 3809 5287 6794 8713
1645 2594 3812 5306 6854 8725
1659 2652 3914 5447 6893 8794

THANGAM VAIRAM FORTUNE WEDNESDAY
DrawDate on:18/10/23

DAY - THANGAM SERIES Dr No:209
1st Prize Rs.100000/- 257230
2nd Prize Rs.7000/- 96785
3rd Prize Rs.3500/-
05156 06323 11275 20955 39066
68973 77853 77980 79611 83278
4th Prize Rs.200/-
0343 0405 1249 1536 3525 3561 3640
4414 5343 7333
5th Prize Rs.100/-
0316 1483 1710 1845 3307 4568 5505
6401 7290 9761
6th Prize Rs.50/-
0169 1846 3610 4946 6789 8055 8963
0370 1859 3621 5233 7004 8083 9050
0386 1863 3906 5342 7092 8309 9055
0484 2349 3907 5445 7309 8356 9104
0635 2486 3918 5611 7404 8371 9253
0888 2504 3939 5870 7433 8565 9386
0960 2729 3945 6142 7473 8633 9636
1056 2984 4157 6207 7546 8651 9758
1077 3086 4271 6263 7552 8694 9813
1150 3146 4301 6494 7674 8719 9996
1289 3157 4378 6555 7884 8776
1487 3272 4556 6594 7935 8790
1531 3348 4591 6622 7937 8805
1760 3429 4878 6634 7992 8865
1765 3564 4936 6639 8010 8940

DAY - VAIRAM SERIES Dr No:68
1st Prize Rs.50000/- 863986
2nd Prize Rs.7000/- 82422
3rd Prize Rs.3500/-
04318 09513 09906 10923 13563
14457 15622 19073 23784 60182
4th Prize Rs.200/-
0343 3055 3092 3391 3840 4033 6098
6574 6929 8104
5th Prize Rs.100/-
1081 1880 2009 3101 3862 3936 3978
5920 7803 8726
6th Prize Rs.50/-
0051 1627 3032 4355 5700 7212 8653
0058 1740 3109 4448 5799 7245 8731
0145 1760 3140 4621 5898 7382 8791
0321 2159 3156 4731 6054 7422 8843
0417 2184 3198 4747 6072 7525 8847
0418 2194 3324 4860 6078 7582 8954
0509 2425 3401 4861 6363 7670 9159
0617 2479 3572 4924 6436 7775 9378
0870 2525 3734 5057 6505 7917 9769
1171 2588 3929 5222 6560 8192 9933
1186 2788 4114 5280 6616 8244
1191 2810 4143 5289 6718 8352
1218 2859 4226 5300 6743 8427
1404 2882 4278 5559 7011 8438
1622 2940 4301 5630 7107 8550

NALLANERAM MANI FORTUNE WEDNESDAY
DrawDate on:18/10/23

DAY - NALLANERAM SERIES Dr No:209
1st Prize Rs.50000/- 574998
2nd Prize Rs.7000/- 87722
3rd Prize Rs.3500/-
04311 06076 15876 32308 33851
66392 79147 79566 86188 93706
4th Prize Rs.200/-
0435 3352 6117 7404 7514 8039 8242
8961 9136 9499
5th Prize Rs.100/-
2867 3137 3722 3951 3963 4055 4669
5596 6083 6914
6th Prize Rs.50/-
0034 1271 2847 4244 6052 7081 8204
0055 1476 2916 4280 6137 7175 8460
0102 1503 3299 4390 6264 7241 8813
0115 1598 3492 4463 6285 7396 8852
0223 2073 3637 4543 6339 7413 8858
0348 2186 3681 4600 6360 7433 8939
0368 2197 3726 4707 6463 7549 9591
0502 2257 3749 4779 6544 7700 9610
0558 2303 3766 5083 6614 7714 9734
0583 2390 3834 5538 6684 7835 9927
0820 2446 3863 5750 6692 7836
0824 2587 3911 5771 6799 7866
0880 2625 3916 5906 6897 7883
0973 2641 3936 5924 6949 8085
1149 2761 3980 5952 7062 8182

DAY - MANI SERIES Dr No:68
1st Prize Rs.50000/- 863525
2nd Prize Rs.7000/- 72930
3rd Prize Rs.3500/-
16442 17790 29593 40070 46695
60595 75481 82339 82386 91106
4th Prize Rs.200/-
0229 1030 4490 6676 6807 7380 7959
8604 9430 9881
5th Prize Rs.100/-
0509 1137 1347 1417 1880 3362 7208
7941 8087 8398
6th Prize Rs.50/-
0019 1235 3017 3683 5205 6573 8272
0251 1369 3018 3695 5269 6585 8336
0316 1387 3068 3769 5390 6979 8358
0350 1398 3099 3833 5475 6982 8377
0408 1568 3106 3915 5559 7313 8395
0461 1577 3125 4073 5563 7417 9046
0677 1692 3144 4200 5730 7453 9109
0740 1809 3151 4341 5742 7526 9598
0784 1899 3276 4499 5813 7669 9732
0808 1952 3340 4693 5859 7673 9997
0836 2019 3386 4715 5972 8034
0850 2044 3444 4854 5998 8040
0852 2414 3472 4947 6126 8076
0868 2665 3512 4987 6517 8237
0871 2884 3538 5132 6558 8238

KUMARAN VISHNU STAR WEDNESDAY
DrawDate on:18/10/23

DAY - KUMARAN SERIES Dr No:209
1st Prize Rs.50000/- 625341
2nd Prize Rs.7000/- 43691
3rd Prize Rs.3500/-
02421 05779 13443 22884 27295
37481 55391 90620 93517 96093
4th Prize Rs.200/-
1029 2200 3625 4185 4924 5730 7622
8513 8644 8963
5th Prize Rs.100/-
0536 3069 3345 5857 6407 7695 7827
8401 9286 9591
6th Prize Rs.50/-
0024 1878 3310 5095 6383 7655 9047
0376 1926 3338 5296 6450 7671 9106
0414 2053 3431 5393 6666 7893 9188
0499 2081 3480 5394 6714 8062 9246
0897 2406 3489 5689 6764 8100 9314
1114 2554 3846 5796 6815 8123 9510
1171 2666 3873 5828 6958 8166 9530
1258 2757 4038 5891 6959 8255 9586
1293 2786 4102 5976 6969 8394 9754
1320 2816 4190 6100 6990 8463 9995
1391 2867 4232 6120 7009 8730
1440 2915 4279 6210 7129 8799
1627 2952 4453 6266 7171 8818
1638 3079 4455 6316 7244 8824
1650 3213 4900 6352 7576 8890

DAY - VISHNU SERIES Dr No:209
1st Prize Rs.50000/- 132820
2nd Prize Rs.7000/- 56442
3rd Prize Rs.3500/-
06392 20554 41974 42275 47860
57774 60719 63807 72913 97609
4th Prize Rs.200/-
0905 0987 1147 1796 2045 6631 6683
7853 8568 8895
5th Prize Rs.100/-
0917 3116 3330 3511 4522 4715 4996
5125 5582 7772
6th Prize Rs.50/-
0087 1738 3318 4312 5919 7361 8790
0325 1901 3397 4329 5952 7583 8835
0369 1907 3405 4405 6030 7655 9224
0381 1943 3513 4494 6116 7683 9253
0717 2009 3553 4544 6453 7710 9271
0775 2218 3575 4566 6502 7779 9503
0868 2383 3620 4757 6580 7953 9542
0922 2467 3653 4759 6614 7981 9582
0943 2740 3754 4947 6815 7984 9669
0944 2833 3909 5132 6844 8015 9785
1110 2837 3935 5205 6906 8241
1144 2843 4101 5438 7020 8349
1244 2874 4197 5495 7194 8495
1470 3027 4229 5529 7203 8612
1730 3222 4304 5909 7329 8704

SWARNALAXMI LION EMERALD WEDNESDAY
DrawDate on:18/10/23

SWARNALAXMI SERIES Dr No:209
1st Prize Rs.50000/- 218841
2nd Prize Rs.7000/- 64643
3rd Prize Rs.3500/-
29499 31102 31526 42680 53825
64343 75435 75654 86221 97415
4th Prize Rs.200/-
0515 2254 2703 3684 3690 6112 7409
8507 9088 9770
5th Prize Rs.100/-
0578 2278 2897 5834 6581 6986 7951
9101 9219 9407
6th Prize Rs.50/-
0092 1789 3452 5014 6381 7473 9149
0099 2020 3487 5052 6401 7558 9194
0132 2118 3634 5131 6474 7585 9199
0280 2129 3669 5149 6480 7691 9321
0347 2549 4022 5230 6545 7796 9482
0439 2618 4063 5282 6594 7824 9546
0801 2859 4113 5355 6600 7940 9747
1064 2937 4169 5371 6971 8026 9793
1186 2950 4425 5603 6995 8475 9919
1220 2998 4451 5617 7113 8549 9965
1505 3147 4536 5736 7147 8561
1547 3148 4545 5752 7276 8597
1557 3291 4774 5897 7324 8646
1615 3310 4891 6030 7346 8712
1654 3336 5010 6360 7456 8981

DAY - LION SERIES Dr No:68
1st Prize Rs.50000/- 685222
2nd Prize Rs.7000/- 41709
3rd Prize Rs.3500/-
17570 28236 39110 39895 52818
63399 74290 85893 96387 96868
4th Prize Rs.200/-
0039 1920 2341 3983 4244 4867 5605
6223 6979 7436
5th Prize Rs.100/-
0471 1005 1856 2190 3092 3827 5587
5897 7473 8148
6th Prize Rs.50/-
0234 1648 3174 4042 6287 7186 9004
0261 1889 3182 4074 6443 7434 9123
0574 1985 3196 4298 6491 7528 9148
0759 2052 3199 4305 6499 7553 9158
0822 2178 3215 4346 6554 7668 9217
0995 2224 3220 4421 6693 7677 9261
1024 2327 3302 4428 6753 7693 9409
1127 2437 3379 4608 6798 8282 9423
1244 2514 3568 4733 6821 8307 9425
1258 2600 3613 4851 6839 8349 9620
1321 2715 3642 5280 6876 8577
1340 2860 3658 5529 7080 8670
1523 2929 3719 5556 7083 8694
1582 3003 3890 5580 7138 8876
1597 3142 3894 6277 7167 9001

# మూడా? 24 గంటలా!

ప్రసంగించారు. పెండింగ్ ప్రాజెక్టులుగా ఉన్న నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఎంజీకేఎల్ పథకాలను పూర్తి చేసి సాగునీరందించామని, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 90శాతం పూర్తయిందని మిగతా పనులు కూడా త్వరగా పూర్తి చేసుకుని సాగునీరందితే పాలమూరు పాలుగారేలా మారుతుందని, బంగారు తునకగా తయారవుతుందని బీఆర్ఎస్ అధినేత , సీఎం కేసీఆర్ అన్నారు. తాను ఉద్యమ సమయంలో ఉమ్మడి జిల్లాలో పర్యటించినప్పుడు దుంఖం కలిగిందన్నారు. నడిగడ్డకు వెళ్తే ఒక ఊరిలో ఏడ్చామన్నారు. జయశంకర్ సార్ తాను నారాయణపేట వెళ్లి తిరుగు ప్రయాణంలో మహబూబ్‌నగర్ చేరుకుంటున్న సమయంలో ఫతేపూర్ వద్ద చెట్లను చూస్తే అడవి సైతం బక్క పడ్డదని బాధ పడ్డామని గుర్తు చేశారు. పాలమూరులో గంజి కేంద్రాలు పెడితే గుండెలు పగిలేలా ఆవేదన కలిగిందన్నారు. ముఖ్యమంత్రి దత్తత తీసుకున్నా పాలమూరులో కరువు పోలేదన్నారు. ఆ్పడు తానే పాట రాసానని చెప్పారు. అప్పుడే జయశంకర్ సార్ చెప్పారని పాలమూరు ఎంపీగా పోటీ చేస్తే జిల్లా మారుతుందని, ఇక్కడి సమస్యలు తీరుతాయని చెప్పారు. అప్పుడు తనను గెలిపించే బాధ్యత లక్ష్మారెడ్డి తన భుజాల మీద వేసుకున్నాడన్నారు. అన్నీ తానై ముందుకు నడిచి గెలిపించారి ప్రశంసించారు.
ప్రాజెక్టులోని నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉదండాపూర్ పూర్తయ్యాయన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్‌కు మూడునాలుగు నెలల్లో పూర్తి చేసి ఉదండాపూర్ నుంచి లక్షా యాభై వేల ఎకరాలకు నీళ్లందిస్తామన్నారు. జడ్చర్లకు హైదరాబాద్ దగ్గరలో ఉన్నదని, శంషాబాద్ 60 నిమిషాల బాటే..గంటలో చేరుకుంటామని, ఐటీ, పరిశ్రమల హబ్‌గా మార్చేందుకు అన్ని రకాలుగా వీలుందన్నానరు. లక్ష్మారెడ్డి సెజ్ ఏర్పాటు చేసి ఇప్పటికే వేలాది మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. లక్ష్మారెడ్డి పట్టుదల గల నాయకుడని, ఉద్యమంలో తన వెంటే ఉన్నాడని గుర్తుచేశారు..తాను రాజీనామా చేసినరోజే లక్ష్మారెడ్డి కూడా రాజీనామా చేసిండని భయపడలేదన్నారు. ఉద్యమం మొత్తం నడిపించిన నిఖార్సయిన నాయకుడు లక్ష్మారెడ్డిని మరొక్క సారి బ్రహ్మాండమైన మెజార్టీతో తెలిపించాలన్నారు.

**14సీట్లు గెలిచి చూపిస్తాం: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

జడ్చర్ల ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ ఎత్తున తరలివచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. వెనకబడ్డ పాలమూరు జిల్లాను రాష్ట్ర సాధకుడు అద్భుతంగా అభివృద్ధి బాటలో పయనించేలా చేశారన్నారు. ప్రజలు పనిచేసే వారికే పట్టం కండుతారని కారు గుర్తును మరో సారి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి లక్షా యాభైవేల ఎకరాలకు నీళ్లు అందించి సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమన్నారు. జడ్చర్లతోపాటు, ఉమ్మడి పాలమూరు జిల్లాని 14సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు చల్లావెంకట్రామిరెడ్డి, మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చిన ఘనత బిఆర్ఎస్‌దే

రావు అన్నారు. ఎన్నికల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాఆశీర్వాద సభ కార్యక్రమంలో భాగంగా బుధవారం మేడ్చల్ నియోజకవర్గంలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటిపరిధిలో 44వ జాతీయ రహదారి ప్రక్కన ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని అశేష జనవాహినిఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చే దిశలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసుకుని పది సంవత్సరాల కాలంలో అనూహ్యమైన అభివృద్ధి సాధించామని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కేంద్రానికి తలొగ్గి గంగిరెద్దుల్లా తలూపి 58 ఏళ్ల గోసతో రాష్ట్రాన్ని వెనుకబాటుతనానికి గురిచేశారని అన్నారు. నగరానికి ఆనుకుని ఉన్న మేడ్చల్ నియోజకవర్గంలోని ఓటర్లు, కార్యకర్తలు ఎంతో చైతన్యవంతులని అనునిత్యం రాజకీయాలను గమనిస్తూ ఉంటారని అన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఇక్కడి ప్రాంతంను ఫెరిఫెరల్ ప్రాంతం అని అంటారు. ఇక్కడి ప్రాంతానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని పలుమార్లు మంత్రి మల్లారెడ్డి కోరారని జనాభ పెరుగుదలకు అనుగుణంగా ప్రత్యేక బడ్జెట్‌తో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి గొప్ప నగరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఇటీవల విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలోనూతనంగా పలు వినూత్న పథకాలను ప్రవేశపెట్టామని అందులో విడుతల వారిగా వృద్ధప్య పెన్షన్‌ను రూ.5016 ఎన్షన్‌ను పెంచుతామని 99 లక్షల కుటుంబాలకు కేసీఆర్ ధీమా ఆరోగ్యభీమా కింద రూ.15 లక్షల వరకు అందిస్తామని అన్నారు. హైదరాబాద్ నగర పరిసరాల్లో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మిస్తామని మేడ్చల్ నియోజకవర్గంలో 26 వేల ఇండ్లు నిర్మిస్తామని తెలిపారు. మల్లారెడ్డి చాలా మంచి వ్యక్తి అని ఆయనకు ఏది అనుకుంటే అది జరుగుతుందని గతంలో కూడ మొక్కి సమ్మక్క సారక్క దేవాలయంలో మొక్కి మంత్రిని అవుతానని చెప్పి అనుకున్న విధంగానే మంత్రి అయ్యాడని ఇప్పుడుకూడ ఆయన కోరిన విధంగానే మేడ్చల్ నియోజకవర్గం నుంచి గెలుపొంది అనూహ్యమైన అభివృద్ధిని సాధించేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని అన్నారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ నేడు తెలంగాణ అన్నపూర్ణగా మారిందంటే కేసీఆర్ చలవే అని అన్నారు. ప్రతి ఇంటి గడప గడపకు కేసీఆర్ సంక్షేమ పథకాలు ఒదుతున్నాయని అన్నారు. రేవంత్ రెడ్డిఎంపీగా గెలిచి రూపాయి పని చేయలేదని డబ్బులు పెట్టి పీసీసీ పదవి కొన్నాడని ఇప్పుడు డబ్బులకు సీట్లు అమ్ముకుంటున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేక్, ఎమ్మెల్సీ మదుసుదన చారినవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఉద్యోగులకు 4% డిఎ పెంపు

సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు.. ఇలా అర్హులైన 11 లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం రూ.1968.87 కోట్లు వెచ్చించనున్నారు. రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రానున్న రబీ సీజనుకు సంబంధించి ఆరు పంటలకు కనీస మద్దతు ధరను పెంచుతున్నట్లు ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర మంత్రివర్గ సమావేశంలో వివిధ పంటలకు మద్దతు ధరను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2024-25 సంవత్సరానికి గాను సన్‌ఫ్లవర్, కందులు, శెనగ, ఆవాలు, గోధుమ, బార్లీ పంటలకు కనీస మద్దతు ధర పెంపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం 2024-25 సంవత్సరానికి సంబంధించి రబీ సీజనులో గోధుమల కనీస మద్దతు ధరను 150 రూపాయలు పెంచడంతో క్వింటా ధర 2,275 రూపాయలకు చేరింది. అలాగే బార్లీ ధరను 115 రూపాయలకు పెంపుదల చేయడంతో క్వింటాల్ ధర 1,850 రూపాయలకు చేరింది. ఇక శెనగ కనీస మద్దతు ధరను 105 రూపాయలకు పెంచింది. ఈ పెంపుతో క్వింటా శనగ ధర 5,440 రూపాయలకు పెరిగింది. మసూర్ పంట మద్దతు ధర 425 రూపాయలకు పెంపుదల కారణంగా క్వింటాల్ ధర 6,425 రూపాయలకు, ఆవాల మద్దతు ధర 200 రూపాయలు పెంచడం వల్ల క్వింటాల్ ధర 5,650 రూపాయలు, కుసుమ పంట మద్దతు ధర 150 రూపాయలకు పెంచడం వల్ల క్వింటాల్ ధర 5,800 రూపాయలుకు చేరింది.

## వారం - వర్జ్యం

తేది : 19-10-2023, గురువారం
శ్రీశోభకృత్‌నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయనం,
శరదృతువు, శుక్ల పక్షం
పంచమి రా.11.18, జ్యేష్ఠ రా.9.21,
వర్జ్యం లేదు.
దుఃఖ.9.55-10.42,
2) మ.2.36-3.22, చిత్త కార్తె
శుభసమయం ఉ.8.00-8.40
రాహుకాలం మ.1.30-3.00 వరకు

## వార్తాఫలం

**మేషం :** రుణాలు కొంతవరకు తీరుస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

**వృషభం :** బాధ్యతలు పెరిగినా సమర్థ వంతంగా నిర్వహిస్తారు. ఆర్థికాభివృద్ధి సాధిస్తారు.

**మిథునం :** ఆరోగ్య సమస్యల నుండి బయటపడతారు. శుభవార్తలు అందుకొంటారు.

**కర్కాటకం :** సోదరులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభిస్తాయి.

**సింహం :** ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. రుణాలు తీరి ఊరట చెందుతారు.

**కన్య :** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకొంటారు. వాహనయోగం.

**తుల :** ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. ఆరోగ్య సమస్యల నుండి బయటపడతారు.

**వృశ్చికం :** ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**ధనుస్సు :** చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. స్వల్ప ధనలాభం.

**మకరం :** అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆర్థికపరిస్థితి అనుకూలంగా వుండును.

**కుంభం :** సంఘ సేవకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**మీనం :** చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుతాయి. యోగా, మెడిటేషన్ లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబర్18:** బిజెపి సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులయ్యారు. ఇదే సమయంలో ఒడిశా గవర్నర్‌గా బిజెపికి చెందిన మరో సీనియర్ నేత రఘుబర్ దాస్ నియమితులయ్యారు. నూతన గవర్నర్ల నియామకానికి సంబంధించి బుధవారం రాత్రి రాష్ట్రపతి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం నల్లు ఇంద్రసేనారెడ్డి బిజెపి జాతీయ కమిటీకి ప్రత్యేక ఆహ్వానితుడుగా ఉన్నారు. ఇంతకు ముందు 2014లో బిజెపి జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా పనిచేశారు. 1999లో అసెంబ్లీలో బిజెఎల్పీ నేతగా పనిచేశారు. 1983లో, 1985లో 1999లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. నల్లు ఇంద్రసేనా రెడ్డి తెలంగాణలోని సూర్యపేట జిల్లాకు చెందిన వారు. ఆయన గతంలో మలక్‌పేట్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2022లో రాష్ట్రంలో బిజెపి చేరికలు,సమన్వయ కమిటీ చైర్మన్‌గా ఆయన నియమితులయ్యారు.ఒడిశానూతన గవర్నర్‌గా నియమితులైన రఘుబర్‌దాస్ 2014నుంచి 2019 వరకు జార్కండ్ సిఎంగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన బిజెపిజాతీయఉపాధ్యక్షుడిగా ఉన్నారు.

# అండగా ఉంటాం

1300 మందిని చంపారు. వారిలో 31 మంది అమెరికన్లు కూడా ఉన్నారు. హమాస్ మిలిటెంట్లు కొందరిని బందీలుగా చేసుకున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ దారుణాలపై అమెరికన్ పౌరులు దుఃస్తున్నారు. ఈ పరిణామాలపై వారెంతో ఆందోళన చెందుతున్నారు అని అమెరికా అధ్యక్షుడు బైడెన్ పేర్కొన్నారు. గాజాలోని ఆసుపత్రిపై దాడికి ఇజ్రాయెల్ బాధ్యత కాదని అమెరికా చెప్పడాన్ని హమాస్ తోసిపుచ్చింది. అది అవాస్తవమని, కేవలం ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకే అలా చెప్పిందని పేర్కొంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. గాజా ఆసుపత్రిపై దాడి భయంకరమైన విపత్తు అని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. చైనా పర్యటనలో ఉన్న ఆయన అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చలు జరిపిన అనంతరం మాట్లాడారు. ఆసుపత్రి పేలుళ్లలో వందలాది మంది చనిపోవడం, తీవ్ర గాయాలపాలవడం ఓ విపత్తుగా పేర్కొన్నారు.



బుధవారం బేగంపేట విమానాశ్రయంలో రాహుల్, ప్రియాంకలకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

## రాహుల్, ప్రియాంకలకు హైదరాబాద్‌లో ఘనస్వాగతం

**హైదరాబాద్, అక్టోబర్18,ప్రభాతవార్త:** అఖిల భారత కాంగ్రెస్ నాయకులు రాహుల్,ప్రియాంక తొలివిడత బస్సు యాత్రలో పాల్గొనడానికి న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ బేగంపేట విమానశ్రయంకు బుధవారం మధ్యాహ్నం చేరుకోగా వారికి స్థానిక నాయకత్వం ఘనంగా స్వాగతం పలికంది. కాంగ్రెస్ నేతలు అంజన్‌కుమార్‌యాదవ్, టి.సుబ్బిరామిరెడ్డి, రేణుకాచౌదరి, షబ్బీర్‌అలీ, కోదండరెడ్డి, నిరంజన్, అనిల్‌యాదవ్, హర్కర వేణుగోపాల్, సమీరుల్లా, ఫేహెం ఖురేషీ ఫెహీం , మెట్టుసాయికుమార్ పుష్పగుచ్చాలు అందిచారు. గురువవారం చార్మినార్ వద్ద జరుపతలపెట్టిన రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక దినం కార్యక్రమ బ్రోచర్‌ను ఆవి ష్కరించారు. టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ రాజీవ్‌స ద్భావన యాత్రకు 2018లో రాహుల్ గాంధీహాజరైన విషయం గుర్తుచేశారు. బ్రోచర్‌ను చాలా ఆస క్తిగా ఇరువురు యువనేతలు పరిశీ లించి నిరంజన్‌ను ఇలా కార్యక్ర మాలు చేపట్టాలని కోరారు. అనం తరం హెలికాప్టర్‌లో ములుగుజిల్లా రామప్ప ఆలయంకు వెళ్ళారు. అక్కడ టిపిసిసి అధ్యక్షుడు రేవం త్‌రెడ్డి, సిఎల్‌పి నేత భట్టి విక్ర మార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగు లేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కొమ టిరెడ్డి వెంకటరెడ్డి స్వాగతం పలికారు.

# కాంగ్రెస్‌లో చేరిన సుధీర్‌రెడ్డి

## మాజీ ఎమ్మెల్యే ఇంటికి వచ్చి పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 18, ప్రభాత వార్త:** ఎన్నికలు సమీపి స్తున్న సమయంలో మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ శాసన సభ్యుడు మలిపెద్ది సుధీర్ రెడ్డితో పాటు ఆయన తనయుడు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డిలు బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గంలో పట్టున్న నేత ఉన్నట్టుండి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో ఆపార్టీలో జోష్ తీవ్రస్థాయిలో పెరిగింది. ఓ వైపు నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ మేడ్చల్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేసిన రోజే ఆపార్టీ నుండి బడా నేత అయినటువంటి మలిపెద్ది సుధీర్‌రెడ్డి వర్గీయులు కాంగ్రెస్‌లో చేరడం బీఆర్ ఎస్‌కు పెద్ద దెబ్బ పడినట్లయ్యింది. దీంతో మంత్రి మల్లారెడ్డికి పెద్ద షాక్ తగిలింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి స్వ యంగా ఘట్‌కేసర్ మండలంలోని ప్రతాప సింగారంలో నివా సం ఉంటున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇంటికి వచ్చి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో టీపీసీసీ నేత మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు మేడ్చల్ జడ్పీ చైర్‌పర్సన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, సోదరుడు అయిన స్థానిక ఎంపీటీసీ మలిపెద్ది వెంకట్రామిరెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోని



మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న దృశ్యం

ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మాట్లా డుతూ రాజకీయంగా దాదాపు 45 సంవత్సరాల అనుభవం ఉన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు వారి కుమారుడు, సోదరుడు, అనుచరులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం పట్ల హర్షించదగ్గ విషయమని అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సుధీర్‌రెడ్డిని అన్ని విధాలుగా పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, వారి అనుభవాన్ని ఈ ఎన్నికల్లో ఉపయోగించు కుంటామని అన్నారు. స్థానికంగా ప్రజల్లో మంచిపట్టున నాయకుడు సుధీర్‌రెడ్డియని తన సేవలను మేడ్చల్ నియోజ కవర్గమే కాకుండా ఉప్పల్, ఎల్‌బినగర్, కుతుబ్బుల్లాపూర్ నియోజకవర్గల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు బాధ్యతలు అప్పగి స్తున్నట్లు తెలిపారు.

**రాజకీయాన్ని వ్యాపారంగా మార్చిన ఘనత మంత్రి మల్లారెడ్డిదే: మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి:** ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి రాజకీయాన్ని వ్యాపారం చేశాడని ఆరోపించారు. పాలమ్మిన, పూలమ్మిన చెప్పినట్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు అమ్ముకుని వ్యాపారం చేశాడని అన్నారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ముఖ్యుల్లో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, ప్రతాప సింగారం ఎంపీటీసీ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ నాయకుడు బొక్కా ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మేడబోయిన వెంకటేశ్ ముదిరాజ్, బీఆర్ఎస్ మండల నాయకుడు కందుల కుమార్ ముదిరాజ్, ఉప సర్పంచ్ అబేదా బేగం, అవుశాపూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు డొంకెని శంకర్ గౌడ్, సిద్దగోని నర్సింహా గౌడ్, నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు.

## రాష్ట్రంలో ఎన్నికల వేళ పట్టుబడుతున్న నగదు, నగలు, వస్తువులు

## ఇప్పటి వరకు పట్టుబడ్డ మొత్తం సొత్తు విలువ రూ. 165.81 కోట్లు

**హైదరాబాద్, అక్టోబర్ 18, ప్రభాత వార్త:** రాష్ట్రంలో ఎన్నికల వేళ పోలీసులు వరుసగా జరుపుతున్న దాడుల్లో పలుచోట్ల భారీగా నగదుతో పాటు నగలు, మాదకద్రవ్యా లు, అక్రమ మద్యం, ఇతర వస్తువులు పట్టుబడుతూనే వున్నాయి. బుధవారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 165.81 కోట్ల రూపాయల సొత్తును జప్తు చేశారు. ఇందులో 77.87 కోట్ల రూపాయల నగదు, 62.73 కోట్ల రూపాయల బంగారు, వెండి నగలు, 8.99 కోట్ల రూపాయల అక్రమ మద్యం, 7.55 కోట్ల రూపాయల మాదకద్రవ్యా లు వున్నాయి. బుధ వారం నాడు రాచకొండ పరిధిలోని ఆదిబట్ల లో భారీగా చీరలు పట్టుబడ డడం కలకలం రేపింది. ఎన్నికల్లో ఒక పార్టీ వీటిని పంపిణీ చేసేందుకు తెచ్చిందని అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు.

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ స్కాంలో ఒకరు మినహా మిగతా వారికి హైకోర్టులో విముక్తి

**హైదరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపిహయాంలో 2003లో హైదరాబాద్ కేంద్రం గా వెలుగు చూసిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కుంభకోణంలో ఒక్కరు మినహా మిగతా నిందితులకు హైకోర్టులో విముక్తి లభిం చింది. మొత్తం 22 కోట్ల రూపాయల ఈ స్కాంలో 20 మందికి పైగా నిందితులు వుండ డం అప్పట్లో సంచలనం రేపింది. ఇంటర్మీడి యట్ విద్యార్థుల కు సర్కారు అందజేసే స్కాలర్ షిప్‌ను ప్రైవేటు కాలేజిలకు చెందిన కొందరు నిర్వాహకులతో పా టు ఇంకొందరు అధికారులు కాజేయడం 2003 లో రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపింది. దీనిపై సిసిఎస్ పోలీసులు విచారణ చేబట్టి ప్రైవేటు కాలేజిల నిర్వాహకులతో పాటు ఈ గోల్‌మాల్‌లో పాలుపంచుకున్న అధికారులను అరెస్టుచేసి జైళ్ల కు తరలించారు. దీనిపై మొదట నాంపల్లి కోర్టు అందరు దోషులకు శిక్షలు విధించ గా దీనిని నిందితులు హైకోర్టులో సవాల్ చేశారు. పదేళ్లకు పైగా హైకోర్టులో ఈ స్కాంపై విచారణ సాగు తోంది.దీనిపై జస్టిస్ సురేందర్ తీర్పు ఇస్తూ అనేక అంశాలను వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కెవిఎల్ జయ సింహ ఒక్కడే దోషిగా జస్టిస్ సురేందర్ నిర్ధారించారు. ఇందుకు గానూ జయసింహకు రెండు వేరువేరు సెక్షన్లలో మూడేళ్ల కారాగారాశిక్షను విధించారు. ఇదే సమ యంలో ఇతర నిందితులు మోత్యానాయక్, సం తోష్‌కుమార్, వెంకటేశ్వర రావు సహ ఇతర నిందితులను నిర్దోషులుగా న్యాయమూర్తి పేర్కొ న్నారు. ఈ స్కాంలోపోలీసులు అనేక అంశాలను పరిగణలోకి తీసుకోలేదని,ఇదేసమయంలో వీటిని సర్కారీ విభాగాల అధికారులు సైతం పట్టించు కోలేదని ఆయన తెలిపారు. లేని కాలేజిలు వున్నట్లుగా చూపడంతో పాటు లేని విద్యార్థులు వున్నట్లుగా చూపడం వల్ల వీరికి సంబంధించిన 22కోట్ల రూపాయలస్కాలర్‌షిప్‌నునిందితులు కాజేసినట్లు పోలీసులు చెప్పారు.



## కల్పవృక్షంపై రాజమన్నార్ అలంకారం

### నాల్గవరోజు ఉదయం కనువిందుచేసిన మలయప్ప

**తిరుమల, అక్టోబరు 18ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీదేవిభూదేవితో కలసి చేతిలో బంగారు చర్నాకోలు... మరోచేతిలో దండం ధరించి రాజమన్నార్ అలంకారంలో మలయప్పస్వామి కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. కలియుగవైకుంఠం తిరుమలలో కన్నులపండువగా ఏడుకొండలవానికి జరుగుతున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాల్గవరోజు బుధవారం ఉదయం వాహనమండపం వద్ద వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్పవృక్షవాహనంపై అర్చకులు అధిరోహింపజేసి, కర్పూరహారతులిచ్చారు. స్వామివారి వాహనముందు భక్తులు గోవిందా...వేంకటరమణ గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. భూలోకంలో వృక్షాలు తాము కాసిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. కల్ప వృక్షం వాంఛిత ఫలాలన్నిటినీ ప్రసాదిస్తుంది. అంతటి ప్రత్యేకత వున్న కల్పవృక్షవాహనాన్ని అధిరో హించి తిరుమాఢవీధుల్లో వైకుంఠవాసుడు కరుణించాడు. ఉదయం వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి దంపతులు, బోర్డుసభ్యులు, టిటిడి జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ నరసింహకిశోర్, సిఇ నాగేశ్వరరావు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ శ్రీహరి, అర్చకులు పాల్గొన్నారు.

## సర్వభూపాలునిపై సర్వాంతర్యామి



**తిరుమల,అక్టోబరు 18 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలవేంకటేశ్వరునికి అంగరంగవైభవంగా జరుగుతున్న నవరాత్రిబ్రహ్మోత్స వాలలో నాల్గవరోజు బుధవారం రాత్రి ఉభయదేవేరులతో కలసి సర్వ భూపాలవాహనంపై మలయప్పస్వామి భక్తులను కటాక్షించాడు. రాత్రి 7గంటలకు మొదలైన వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా భక్తజనబృందాలు కోలాటలు, భజనలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తించారు. వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్న జీయర్‌స్వామి, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి దంపతులు, టిటిడి జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ నరసింహకిశోర్, అర్చకులు పాల్గొన్నారు.

## ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది కృషి చేయాలి

### హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** ఎన్నికలకు సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. బుధవారం బంజరాహిల్స్‌లోని సేవాలాల్ బంజరాభవన్‌లో ఎన్నికల నిర్వ హణపై రిటర్నింగ్ అధికారులు, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనీలకు, ఏఎల్ఎంటిఎస్ మాస్టర్ ట్రైనీలకు, స్పెషల్ అధికారులకు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారంగా తగిన జాగ్రత్తలు త్వరంలో ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌లో ఓటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో మహిళా పోలింగ్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 128ను అనుసరించి సీక్రసీ ఆఫ్ ఓటింగ్‌లో భాగంగా ఎవరికి ఓటు వేశారో చెప్పకూడదని, ఉల్లంఘించిన వారికి మూడు నెలల జైలు శిక్ష విదించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రా లవద్ద ఎటు వంటి ఉల్లంగనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రిసైడింగ్ అధికారుల వద్ద ఎలక్ట్రోరల్, ఏఎస్‌డి జాబితా తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఈవిఎంలను భద్రంగా రిటర్నింగ్ అధికారికి



బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవరాలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది సుమారు 34 వేల మందిని నియమించడం జరిగిందన్నారు. పోలింగ్‌కు ముందు రోజు పోలింగ్ రోజున పిఒ తీసుకో వాల్సి న జాగ్రత్తలు, ఎన్నికల నియమావళి ప్రకారం అనుసరించాల్సి న అంశాల గురించి క్షుణ్ణంగా వివరించారు. తప్పని సరిగా తీసుకోవాల్సి న మెటీరియల్‌ను డిస్ట్రిబ్యూసన్ సెంటర్ ద్వారా తీసుకున్నవాటి పరిశీలన చేసుకునే పద్దతులపై పలు అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. తీసుకున్న ఎన్నికల పరికరాలు నేరుగా పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లాలని తెలిపారు. పోలింగ్ రోజు ముందుగామాక్‌పోలింగ్‌ను పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో నిర్వహించి అనంతరం మాక్‌పోల్‌ను సర్టిపై చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ మహిళా అధికారులకు పోలింగ్ ముందు రోజు అక్కడ ఉండకుండా ఇంటికి వెళ్లేందుకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. అయితే ఉదయం 5గంటలకు నేరుగా పోలింగ్ స్టేషన్‌కు, ఉదయం 5గంటలలోపు సంబంధిత పోలింగ్ స్టేషన్‌లో ఉండాలన్నారు. ఉదయం 5.30గంటలకు మాక్ పోలింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. మాక్‌పోలింగ్ కనీసం ఇద్దరు వేర్వేరు పార్టీలకు చెందిన ఏజెంట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఒకే పార్టీకి చెందిన ఇద్దరు ఏజెంట్లు మాక్ పోలింగ్‌లో ఉండకూడదని అధికారులకు సూచించారు. ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ రోజున నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. సమర్పించాలన్నారు. పోలింగ్ రోజు ఈవిఎంలలో బ్యాలెట్ యూనిట్ ద్వారా ఓటు వేసిన తరువాత ఏడు సెక్షన్లలో వివి ప్యాట్‌లో బీప్ సౌండ్ ద్వారా ఓటు నమోదు గుర్తించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం కొత్త 80 సంవత్సరాలకుపైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. ఈ పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకుంటే పోలింగ్ సిబ్బంది వారికి ఇంటికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటను స్వీకరిస్తామన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపు ఎవరూ ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బిఎల్‌ఓ ద్వారో ఓటరు హెల్ప్‌లైన్ కౌంటర్లను ఏర్పాటు చేయలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కంపార్ట్ మెంట్‌లో సరైన లైటింగ్ ఉండాలన్నారు. పోలింగ్ ఆఫీసర్ 1,2,3 ద్వారా ఓటరు లిస్టు చదవడం, ఇంక్‌వేయడం, ఓటరు పేరు నమోదు చేయడం లాంటి విదులు, ప్రిసైడింగ్ అధికారులు కేటాయించలన్నారు. ఓటింగ్ పూర్తయిన తరువాత ఓట్ల నమోదుపై ఈవిఎం ద్వారా పరిశీలన చేసుకోవా లన్నారు. పోలింగ్ సిబ్బంది ఓటు నమోదు చేసిన మొత్తం కంట్రోల్ యూనిట్ ద్వారా పోలైన ఓట్లను సరిచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఈఓ అనుదీప్ దురిశెట్టి, అదనపు కమిషనర్లు శంకరయ్య, ఖైతరాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్, కంట్రోన్మెంట్ సిఈఓ మధకర్ నాయక్, జాయింట్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, సునందలు పాల్గొన్నారు.

## మొల్లరామాయణం, విష్ణుపురాణం గ్రంథాలు ఆవిష్కరణ

**తిరుమల,అక్టోబరు 18ప్రభాత వార్తప్రతినిధి:** రామాయణంలో ధర్మస్వరూపుడైన శ్రీరామ చంద్రుడు ఈ సమాజంలో ఎలాజీవించాలో తను స్వయంగా ఆచరించి చూపి ఆదర్శప్రాయుడైనాడు. వాల్మీకి మహర్షి విరజిత శ్రీమద్రామా యణాన్ని భారతీయ భాషల్లో అనేకమంది అనువదించుకు న్నారు. తమతమ ప్రాంతాలకు ప్రాతినిధ్యాన్ని కల్పిస్తూ చాలామంది రామకథను తయారు యాస, భాషలలో రాసుకున్నారు. మొల్లరామాయణాన్ని ఆచార్య కె.మలయవాసిని పరిమళ వ్యాఖ్యానంతో టిటిడి భక్తులకు అందుబాటులోకి తెచ్చింది. అలాగే వేదవ్యాసమహర్షి విరదసి అష్టాదశపురాణాల్లో ఒక టైన విష్ణుపురాణం. శ్రీహరి తనకు ప్రధానంగా మూడు గురుతల బాధ్యతలు ఉన్నట్లు గీతలో తెలియజేశాడు. త్రిమూర్తాత్యాత్మక స్వరూపుడు శ్రీహరి అని అతడే సర్వోత్తముడని తెలియజేస్తోంది. ఈ రెండు గ్రంథాలను బుధవారం ఉదయం కల్ప వృక్ష వాహనసేవలో టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, టిటిడి ఇఒ ఏవి ధర్మా రెడ్డి దంపతులు, జెఇఒలు సదాభార్గవి, వీర బ్రహ్మం, ఢిల్లీ స్థానిక సలహామండలి చైర్మన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవిష్కరించారు.

## మహిళా సంక్షేమం, భద్రతను గాలికొదిలేసిన ఎపి ప్రభుత్వం

### మీడియాతో టిడిపి ఎమ్మెల్సీ అనురాధ

**అమరావతి, అక్టోబరు18, ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళా సంక్షేమం, భద్రతను గాలికొదిలేసి సమీక్షలతో సిఎం జగన్ కాలక్షేపం వల్ల ఒనగూరే ప్రయోజనమేంటి అనేది సిఎం జగన్‌కే తెలియాలని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు.. తమపార్టీ అధినేత చంద్రబాబు మహిళా సంక్షేమం, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా, నేటి సిఎం జగన్ వాటిని గాలికొదిలేశారని దుయ్యబట్టారు. నా అక్కచెల్లెమ్మలు, నా ఆడబిడ్డలు అంటూ సిఎంచెప్పే తియ్యటి మాటలకు, వాస్తవానికి ఎంత తేడా ఉందో రాష్ట్రంలో మహిళలపై అతా ్యచారాలు, అకృత్యాలే సాక్ష్యమన్నారు.. వైఎస్సార్సీ పాలనలో మహిళలపై లక్ష22 వేలకు పైగా జరిగిన నేరాలపై సమాధానం చెప్పే దమ్ము సిఎంకు ఉందా? అని నిలదీశారు.. నాలుగేళ్లలో జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అ త్యా చా రాం ధ్ర ప్రదేశ్‌గామార్చేశారన్నారు. రాష్ట్రంలో ప్రతి 8 గంట లకు ఒక అత్యాచారం, 8ఏళ్లలోపు చిన్నారులపై ప్రతి 12 గంటలకు ఒక రేప్, వారానికి సగటున నలుగురు ఎస్సీ, ఎస్టీ మహిళలపై అత్యాచారం, ప్రతి గంటకు ఇద్దరు మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయంటే అందకు జగన్ రెడ్డి పాలనా వైఫల్యమే కారణమని అన్నారు. దేశవ్యాప్తంగా మహిళలపై జరిగే నేరాల్లో 3వ వంతు ఆంధ్రప్రదేశ్ లోనే జరుగుతున్నాయంటే రాష్ట్రంలో శాంతిభద్ర తలు ఎక్కడున్నట్టు అని ప్రశ్నించారు. నాలుగేళ్ల వైఎస్సార్సీ పాలనలో 30,196 మంది మహిళలు, చిన్నారులు అదృశ్యమయ్యారంటే జగన్ రెడ్డి ఏం సమాధానం చెప్తారని నిలదీశారు.. దిశా చట్టం, దిశా యాప్ ఎక్కడా? అనిప్రశ్నించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే లెక్కల ప్రకారం రాష్ట్రంలో 15నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న 12.6 శాతం బాలికలు గర్భందాల్చుతున్నారని, ఈ దారు ణాల్లో దేశంలోనే ఎపి మూడవ స్థానంలో ఉంద న్నారు. ఇండియా టుడే సర్వే ప్రకారం ఎపిలో 1,33,447 మంది వ్యభిచారకూపంలో చిక్కుకు న్నారని తెలిపారు. ఈ అమానుషాల్లో ఎపి దేశంలోనే రెండోస్థానంలో ఉందన్నారు. నాలు గేళ్లలో 30,196 మంది మహిళలు, చిన్నారులు అదృశ్యమయ్యారని పార్లమెంట్ సాక్షిగా వెల్లడి కావటం సగ్గుచేటన్నారు.. పాలనను గాలికొదిలేసి రాజకీయ లబ్దికోసం ప్రత్యర్థుల గొంతునొక్కే పనిలో జగన్‌రెడ్డి బిజీగా ఉండటం వల్లే రాష్ట్రంలో భయా నక పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆడబిడ్డకు కష్టమొస్తే గన్‌కంటేముందు జగన్‌వస్తారన్న మహిళా మంత్రులు అత్యాచారాలు, మిస్సింగ్ ఘటనలపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిం చారు.. ఎపిలో 1,33,447 మంది వ్యభిచార కూపంలో చిక్కుకోవటం జగన్‌రెడ్డి శాంతి భద్రతల వైఫల్యం కాదా? అని ప్రశ్నించారు..

## నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ కళాకారుల ప్రదర్శనలు అద్భుతం



**తిరుమల,అక్టోబరు 18ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్వామివారి వాహనసేవల్లో పాల్గొని తమవంతుగా అద్భుత నృత్యాలు చేయడం తమ పూర్వజన్మ సుకృతమని తెలంగాణ రాష్ట్ర కళాకారులు తెలిపారు. స్వామివారి చెంత మాఢవీధుల్లో పలు రకాలూగా కళాకారులు గత నాలుగురోజులుగా స్వామివారికి నాట్యరూపంలో సేవచేసుకునే భాగ్యం కలిగిందన్నారు.

తెలంగాణారాష్ట్రం నుండి 11కల్చరల్ బృందాలు 281మంది కళాకారులు వచ్చి గుస్సా డి నృత్యాలు, లంబాడా, చక్కభజనలు, కోలాటాలతో జానపదకళారూపమైన మాథురి నృత్యాన్ని హైదరాబాద్‌కు చెందిన గణేష్ బృందం,వికారాబాద్‌కు చెందిన అశోక్ బృందం గుస్సాడి నృత్యం, ధనశ్రీబృందం స్వామివారికి నీరాజనం సమర్పించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జానపద నృత్యాలు, కోలాటలు ప్రత్యేక ఆకర్షణగానిలిచాయి. కళాకారులకు టిటిడిఅందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు.

## ఖరగ్‌పూర్ ఐఐటిలో తెలంగాణ విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** ఐఐటి ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ నాలుగవ సం వత్సరం చదువుతున్న తెలంగాణకు చెందిన గిరిజన విద్యార్థి ఆత్మహ త్య చేసుకున్నాడు. మంగళవారం రాత్రి జరిగిన ఈఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాలు ఇలావున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా మాసా యిపేట మండలం సుజిత్ తాండ చెట్లతిమ్మయ్యపల్లికి చెందిన కేతావత్ కిరణ్ చంద్ర (21) ఖరగ్‌పూర్ ఐఐటిలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ నాలుగవ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం రాత్రి ఏడున్నర గంటల వరకు కిరణ్ చంద్ర హాస్టల్‌లోని తన గదిలో సహచరులైన ఇద్దరు విద్యార్థులతో కలిసి వున్నాడు. ఆ తరువాత ఇద్దరు విద్యార్థులు ప్రాజెక్టు వర్క్ కు సంబంధించిన పనులపై బయటకు వెళ్లి ఎనిమిదిన్నర గంటలకు రాగా తలుపులు లోపలి నుంచి మూసివున్నాయి. దీంతో వారు కంగారుపడి సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చి బలవంతంగా తెరిచిచూడగా అప్పటికే కిరణ్ చంద్ర ఫ్యాన్‌కు ఉరివేసుకుని అచేతన పరిస్థితిలో వున్నాడు. వెంటనే తేరుకున్న సెక్యూరిటీ సిబ్బంది, సహ చర విద్యార్థులు కిరణ్ చంద్రను సమీపంలోని బిసి రాయ్ టెక్నాలజి ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో కొన ఊపిరితో వున్న కిరణ్ చంద్రను బతికించేందుకు వైద్యులు విశ్వప్రయత్నాలు చేశారు. అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో అతను చనిపోయాడు. అనంతరం ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై ఖరగ్‌పూర్ ఐఐటి అధికారుల ఫిర్యాదు మేరకు మిడ్నాపూ ర్ పోలీసులు విచారణ చేబట్టారు. కాగా ఖరగ్‌పూర్ ఐఐటిలో ఏడాది వ్యవధిలో మూడు ఘటనల్లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మొదట అస్సాంకు చెందిన ఫైజాన్ అహ్మద్ అనే విద్యార్థి సీనియర్ల ర్యాగింగ్ కా రణంగా తన హాస్టల్ గదిలోనే ఆత్మహత్యకు పాల్పడగా మరో ఘటనలో సూర్య దిపేన్ అనే విద్యార్థి తన గదిలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ రెండు ఘటనలు మ రు వక ముందే తాజాగా తెలంగాణకు చెందిన గిరిజన విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు.



ఆత్మహత్యకు పాల్పడ్డ కిరణ్ చంద్ర(ఫైల్)

కిరణ్ చంద్ర ఆత్మహత్యకు కారణాలు వెల్లడికాకున్నా అధ్యాపకుడు అనవస రంగా కోపగించడంతోనే బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిసింది. కాగా కిరణ్ చంద్ర తండ్రి చందర్ ఉపాధ్యాయుడు. తల్లి గృహిణి. ఇతనికి ఒక తమ్ముడు వున్నాడు.

## ఎపి ఎంసెట్ 3వ విడత కౌన్సెలింగ్‌ను రద్దుచేసి విద్యార్థులకు తీరని ద్రోహం

### వెంటనే కౌన్సెలింగ్ కోరుతూ టిఎన్ఎస్ఎఫ్ నిరసన

**అమరావతి, అక్టోబరు 18, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎంసెట్ 3వ విడత కౌన్సెలింగ్ నిర్వహ ణపై ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంభిస్తోందని, అందుకు నిరసనగా జోన్-3 పరిధిలోని పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బుధవారం రాష్ట్ర ఉన్నత విదా ్య మండలి చైర్మన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎంసెట్ 3వ విడత కౌన్సెలింగ్‌ను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు..ఈ మేరకు ఉన్నత విద్యా చైర్మన్ హేమచంద్రరెడ్డికి వినతి పత్రం అందజేశారు.. ఈసందర్భంగా నాయ కులు మాట్లాడారు.. ఇంజనీరింగ్ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్రంనుంచి ఏటా లక్షలాది మంది ఎంసెట్ రాస్తుం టారని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఏటా3 విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా, ఈ ఏడాది అర్ధాం తరంగా రెండు కౌన్సెలింగ్‌లకే పరిమితం చేయటం బాధాకరమని అన్నారు.

## కూష్మాండ అలంకారంలో ఆకట్టుకున్న దుర్గమ్మ

**శ్రీకాళహస్తి, అక్టోబరు 18 ప్రభాతవార్త:** తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తు న్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆలయానికి అనుబంధంగా ఉన్న కనకా చలంపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో మూలవిరాట్టుకు 'కూష్మాండదేవి అలంకారం' ఆకట్టుకుంది. దసరా ఉత్సవాలను అమ్మవారి ఆలయంతో పాటు ఆలయంలో వెలసిన బెజవాడ కనకదుర్గమ్మ ఆలయం వద్ద పూజలు, అలంకారాలు నిర్వహించారు. కాగా దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి ప్రతి రోజూ బంగారు చీరతో అలంకారం నిర్వహించారు.


కాగితం మీద రాసింది చెరపగలం కాని, మాటలను వెనక్కు తీసుకోలేం.

-హర్ష్

# జలవివాదాలు సృష్టించొద్దు!

చేయబోయే పనిని గూర్చి తెలుసుకోవడం వివేకం, ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం,పూర్తిచేయడం సామర్థ్యం. ఇందులో అవగాహనారాహిత్యంతో ఎక్కడ లోపం జరిగినా ఫలితాలు దారుణంగా ఉంటాయి. అందులోనూ కీలకపదవుల్లో ఉన్నవారు కోట్లాది మందికి సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపడంలో తొందరపాటుతోనో, పొరపాటుతోనో లేక కావాలని పక్షపాతంతో నిర్ణయాలు తీసుకుంటే జరిగే పరిణామాలు ఊహాకందవు. అందుకే గతంలో పాలకులు కొన్ని కీలకవిషయాల్లో ఎంతో దూర దృష్టితో అన్ని కోణాల్లో సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకునేవారు. మిగిలిన సమస్యలు ఎలావున్నా నీటి విషయంలో మాత్రం ఎన్నోజాగ్రత్తలు తీసుకొని అడుగులు వేసేవారు.తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత గోదావరి, కృష్ణా నదీజలాల సమస్య పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం నాన్చినాన్చి యేళ్లతరబడి పెండింగ్‌లో పెట్టి సమస్యను జటిలం చేస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల తాజాగా నీటి విభజన సమస్యల పరిష్కారానికి తెరలేపారు. ఇందులో ఎలాంటి తప్పులు జరిగినా, జరిగినట్లు ఏ ప్రాంత ప్రజలు భావించినా విద్వేషాలు పెరిగిపోతాయి. వీటిని రెచ్చగొట్టడానికి ఎలాగో కొందరు ఉండనే ఉంటారు. ఏదిఏమైనా స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి తాగునీరు, సాగునీరు విషయంలో తెలుగు రాష్ట్రాలకు న్యాయం జరగలేదేమోననిపిస్తున్నది. ఉభయ రాష్ట్రాల్లో చిన్న,పెద్ద కలిపి నలభైనదులు పొంగి పొర్లుతున్నాయి. కోట్లాది ఎకరాల బీడుభూములున్నాయి. కోట్లాది మంది శ్రమజీవులు ఉన్నారు. బీడుభూములకు నీటిని తరలించడంలో పాలకులు గతంలో విఫలమయ్యారని చెప్పక తప్పదు. ఈ పార్టీ, ఆ పార్టీ అని లేకుండా అధికారంలో ఎవరున్నా సాగునీటి విషయంలో సమర్థవంతంగా వ్యవహరించలేకపోయారేమోననిపిస్తున్నది. దీనికితోడు పాలకుల పక్షపాతం,అవగాహనారాహిత్యం, కొందరు అధికారుల దుర్బుద్ధికారణంగా తెలుగు రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాలకు తీరని అన్యాయం జరిగింది. ఇందులో ముఖ్యంగా తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రలోని కొన్ని ఎగువ ప్రాంతాలున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీరు, తాగునీరు విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కొంతమేరకు సమస్యకు పరిష్కారం చూపగలిగిందని చెప్పొచ్చు. అయినా ఇప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో కరవు,దుర్భిక్షం, ఆకలిచావులు, ఆత్మహత్యలతో కొన్ని ప్రాంతాలు అల్లాడిపోతున్నాయి. అతి పెద్ద నీటివనరు అయిన గోదావరి, కృష్ణానదులు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రవహిస్తున్నా బంగారం పండే సారవంతమైన భూములున్నా ఆరుగాలం కష్టపడి రక్తాన్ని చిందించి ఉత్పత్తులను పెంచే శ్రమజీవులున్నా కేవలం సాగునీటి సౌకర్యాలు లేని కారణంగా నిరుపయోగం అవుతున్నాయి. ఇప్పటికీ ఈ రెండు నదుల నుంచియేటా లక్షలాది ఎకరాలకు సరిపోయే వేలాది టిఎంసిల నీరు పాలకుల అసమర్థతను చాటుతూ కళ్లముందే సముద్రం పాలవుతున్నాయి. మరొకపక్క వేలాది గ్రామాలు గుక్కెడు మంచినీటి కోసం అలమటిస్తున్నాయి. మరెన్నో వేలాది ఎకరాల భూమి నీరు లేక సాగుకు నోచుకోలేకపోతున్నది. ఒకనాడు వ్యవసాయ రంగంలో అత్యంత ప్రాధాన్యత వహించిన చిన్ననీటి కుంటలు, చెరువుల పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. పెరుగుతున్న జనావాసాల ఆక్రమణతో అధికశాతం చిన్ననీటి వనరులు అదృశ్యమైపోయాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా వర్షం మీదనే ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకసారి నిండితే పండే అవకాశాలు లేవు.నిర్ణీత సమయంలో నిండితే తప్ప రైతులు బయటపడలేరు. వర్షాల పరిస్థితి ఎలావుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వరుణదేవుడు ఒక్కొక్కసారి ఒక్కో ప్రాంతంపై విరుచుకుపడి కుంభవృష్టి కురియడంతో అప్పటివరకు గుక్కెడు నీటికోసం ఎదురుచూస్తున్న చిన్ననీటి వనరులు రాత్రికిరాత్రే నిండి కట్టలు తెగి తెల్లవారేసరికి ఒట్టిపోతున్నాయి. మరికొన్ని సాగుకోసమో లేక ఇళ్లపట్టాల కోసమో ఆక్రమణకు గురై శాశ్వతంగా అదృశ్యమైపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల చరిత్రను పరిశీలించినా గతంలో చిన్ననీటి వనరులకు మనపెద్దలు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. కాకతీయులు కానీ, ఆ తర్వాత వచ్చిన విజయనగరాధీశుడు శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి సాగునీటి ముఖ్యంగా చిన్ననీటి వనరులకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చారు. వాననీటిని వృధాగా పోనీయకుండా మౌలిక వసతులను దృష్టిలో ఉంచుకొని ఒక క్రమపద్ధతి ద్వారా నీటిపారుదల వ్యవస్థను ఏర్పాటు చేసేవారు. వాగులు, వంకలకు అడ్డుకట్ట వేసి నీటిని మళ్లించి చిన్న కుంటలను ఏర్పాటు చేయడం,అవి నిండితే వాటి మత్తడి ద్వారా మరో కుంటలోకి అలా వరుసగా కుంటలు, చెరువులు ఏర్పాటుచేశారు.వర్షాలవల్ల వస్తున్న నీటిని అంచనా వేసి చిన్న,పెద్ద చెరువులను నిర్మించారు. గత రెండు, మూడు దశాబ్దాలుగా ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నా చిన్ననీటి వనరుల విషయంలో మాత్రం ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శను మూటకట్టుకుంటున్నారు. రాయలసీమలోని కొన్ని ప్రాంతాలు సాగునీటి సంగతి దేవుడెరుగు మంచినీటి కోసం కూడా ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. అధికారులు సహకరించకపోతే ఎంతపెద్ద నాయకుడు ఉన్నా ఏమీ చేయలేరనేందుకు రాయలసీమ ఒక ప్రత్యేక ఉదాహరణగా చెప్పొచ్చు. ఏదిఏమైనా రెండు రాష్ట్రాల మధ్య నీటిసమస్యను పరిష్కరించేందుకు కేంద్రం శ్రీకారం చుట్టాలి. రెండు ప్రాంతాలకు న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలి.రాజకీయ కక్షను తీర్చుకోవడానికి నీటి వివాదాన్ని ఎగదోస్తే ఆ తర్వాత ఆర్పడం ఎవరితరం కాదు.

ధర్మాత్ముడైన మనిషి మంచి గంధపు చెట్టు వంటివాడు. తనను నరికే గొడ్డలికి కూడా అది సువాసన ఇస్తుంది.



తులసీదాస్

మాట్లాడటం కంటే అధికంగా వినాలని, చూడాలని భగవంతుడు మనకు రెండు కళ్లు, రెండు చెవులు ఇచ్చి, నోరు మాత్రం ఒకటే ఇచ్చాడు.



సోక్రటీస్

## ప్రజావాక్కు



### ప్రశ్నార్థకంగా మారిన మహిళల భద్రత!

**ఈమధ్యకాలంలో** కేంద్ర,రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు,అత్యాచారాలు ఈ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా నిలుస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే ఇటీవల కాలంలో మహిళలపై జరుగుతున్న అమానుష దుర్ఘటనలు, లైంగిక వేధింపులు చూస్తూ ఉంటే కేంద్ర, రాష్ట్రవ్యాప్తంగా మహిళలభద్రత ఇక ప్రశ్నార్థకమేనా అనే అనుమానం పెనుభూతమై మన హృదయాల్ని తీవ్రంగా కలిచివేయకమానదు. అభం,శుభం తెలియని చిన్నారులపై జరుగుతున్న దారుణాలకు సంబంధించిన వార్తలే మనకు తరచుగా కళ్లకుకడుతూ ఉంటాయి.ప్రతిఒక్కరూ మహిళలపై జరుగుతున్న ఇలాంటి అమానుష అత్యాచారాలు, లైంగికదాడులను నియంత్రించే విషయంలో తమవంతుగా భాగస్వాములై మహిళల మాన ప్రాణాలకు ఒక రక్షణ కవచంలా నిలబడితీరాలి.

-బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాలజిల్లా

### చర్యలు తీసుకోవాలి

**సమాజంలో** అక్రమాలు, అవినీతి వంటి పనులు జరగకుండా చూడాల్సిన పోలీసు అధికారులే అక్రమాలకు పాల్పడితే ఇక సమాజంలోఉంటున్న ప్రజలువారికి జరుగుతున్న అన్యాయాలను ఎవరితో చెప్పుకోవాలి. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం పోలీసు వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చింది. అధికారులందరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో అన్ని పోలీసుస్టేషన్లలో సరైన సదుపాయాలు కల్పించింది.వేలకుపైగా జీతాలు తీసుకుంటూ కూడా కొంత మంది పోలీసు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూమామూళ్లను తీసుకుంటున్నారు.ఇప్పటికీ కొన్నిస్టేషన్లలో అధికారులకు డబ్బుల ఆశచూపి ఏమి తెలియని అమాయకులను దోచుకుంటున్నారు. దీనివల్ల సామాన్య ప్రజలకు న్యాయం జరగడం లేదు.

-కూరపాటి శ్రావణ్, హైదరాబాద్

### వాహనాల అతివేగం

**వాహనదారులు** అతివేగంగా డ్రైవింగ్ చేయడం వలన అనర్థాలు అనుకోని సంఘటనలు జరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా మైనర్ బాలురురోడ్లపై విపరీతమైన వేగంతో వెళ్తున్నారు.నగరాలు,పట్టణాలతోపాటుగా పెద్ద పెద్దగ్రామాల్లో కూడా మండలకేంద్రాలలో కూడాట్రాఫిక్‌సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.విద్య,వైద్య,వ్యాపారసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### షాపింగ్ మాల్స్ ఫుల్

**ఇదివరకు** పెద్దపెద్ద నగరాల్లో,పట్టణాల్లోఉండే షాపింగ్ మాల్స్ ఈరోజు చిన్న చిన్న పట్టణాలు ఆమాటకొస్తే కొంచెం పెద్ద పెద్ద గ్రామీణ ప్రాంతాల్లోవిస్తృతంగా విస్తరించడంతో నేటికీ భారత్‌లో చాలామంది గ్రామాల్లో నివసించడంవల్ల ఎక్కువజనాభా షాపింగ్ మాల్స్‌బాటపడుతున్నారు. ముఖ్యంగా అన్ని వస్తువులు ఒకే చోట దొరకడం, వివిధ బ్రాండ్‌లు అందుబాటులో ఉండటం, డిస్కౌంట్ ఆఫర్ల పేరుతో షాపింగ్ మాల్స్ బాటపడుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, పరిశుభ్రంగా ఉండుట వలన కూడా షాపింగ్ మాల్స్ బాటపడుతున్నారు. వివిధ పండుగలు పర్వదినాలు సందర్భంగా కొన్ని వస్తువులపై భారీ రాయితీలు ప్రోత్సాహకాలుఇస్తున్నారు. డోర్ డెలివరీ వంటివి సదుపాయాలు ఉన్నాయి. వన్ ప్లస్ వన్, బై వన్ గెట్‌వన్ ఫ్రీ వంటి పలు ఆఫర్లు వినియోగదారులకు మైకం కలుగచేస్తూ అవసరం లేని వస్తువులను కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ డబ్బు విలువ తెలుసుకోవాలి.

-ఐ.పి.రావు, హైదరాబాద్

### కష్టే ఫలి

**విజయం** అనే మంత్రదండాన్ని భగవంతుడు మనకు అల్లాఉద్దీన్ అద్భుత దీపంలాఒకేసారి మనకు అందివ్వడు. నిరంతర కృషి, పట్టుదల, దృఢచిత్తాన్ని బట్టి భగవంతుడు అనేక కఠిన పరీక్షలుపెడుతూ అంతిమంగా మాత్రమే మనకు విజయం అనే ఈ కిరీటాన్ని తలపై అధిష్టిస్తాడు. విజయం విజయం అంటూ వెంపర్లాడకుండా పరుగు లంకించుకోకుండా కష్టేఫలి అనే నానుడికి మనమంతా కట్టుబడి, మనమనుకున్న రంగంలో మన సర్వశక్తులు వడ్డినిరంతర సాధన చేస్తూపోతే అందుకు ఆ దేవదేవుని ఆశీస్సులు తోడైతే విజయం అనేది ఆఘమేఘాల మీద మన ఇంటి తలుపు తట్టడం తథ్యం.

-మధుపాళి, బేతంచెర్ల, నంద్యాలజిల్లా

### ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం

**భారత్** వేదికగా వన్డే ప్రపంచ కప్ జరుగుతున్న వేళ క్రికెట్ క్రీడాభిమానులకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ సంతోషకరమైన వార్త ప్రకటించింది. 2028 లాస్ ఏంజెలిస్ విశ్వక్రీడల్లో టీ-20 క్రికెట్, స్క్వాష్, బేస్‌బాల్, లాక్రాస్, ఫ్లాగ్,ఫుట్‌బాల్ క్రీడాంశాలకు చోటు కల్పించింది. 1900లో తొలిసారిగా జరిగిన ప్యారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ భాగమైంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఆడుతున్న దేశాలు వందలోపే ఉన్నాయి. తాజా వన్డే ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో కేవలం 10 దేశాలు మాత్రమే పాల్గొంటున్నాయి.

-చల్లాచంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# కులాల వర్గీకరణ నివేదిక అమలు సాధ్యమా?

*నిజానికి జనాభా వివరాల సేకరణ సమయంలో కులాల గణాంకాలు సేకరించడం చాలా సులువైన మార్గం. కానీ కులాల వారీ గణన జరిగితే తమ అధికార పీఠాలు కదిలిపోతాయనే ఆధిపత్యకులాల నేతల భయం వల్ల జనాభా వివరాల సేకరణలో కులాలవారీగా గణాంకాలను సేకరించాలనే డిమాండ్‌ను కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తెలివిగా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించింది. అయితే ఇదే సమయంలో దేశంలో అనేక రాష్ట్రాలలో బిజెపి అధికారంలో ఉన్న విషయాన్ని మరిచిపో యింది. మెజారిటీ ప్రజల కోర్కెలను పరిగణనలోకి తీసుకుంటున్న బిజెపియేతర రాష్ట్రాలు కులాల గణన చేపట్టడానికి సిద్ధమవు తున్నాయి. ఈ నేపథ్యంలో ఒబిసి కులాల గణనకు బిజెపి వ్యతిరేకమని ప్రజలకు తెలిసిపోతోంది. వ్రతం చెడినా ఫలితం దక్కని చందంగా బిజెపిపాలిత రాష్ట్రాల్లో కూడా ఏదో ఒక రూపంలో కుల సర్వే చేయడం అనివార్యంగా మారింది.*



అన్నవరపు బ్రహ్మయ్య

ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) కులాల వర్గీకరణకు సంబంధించి జస్టిస్ రోహిణి కమిషన్ సమర్పిం చిన నివేదిక అమలు సాధ్యం అవుతుందా? లేక బుట్ట దాఖలవుతుందా? అనే ప్రశ్నతలెత్తుతోంది. ఒబిసి గణాంకాలు వివరాలులేకుండా రూపొందించిన నివేదికకు చట్టబద్ధత సాధ్యం అవుతుందా? ఈ నివేదిక అమలు కావాలంటే కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కావాలి. జస్టిస్ రోహిణి సమర్పించిన నివేదికను తొలుత కేంద్ర కేబినెట్‌లో, ఆ తర్వాత పార్లమెంటులో ఆమోదం పొందాలి.బిసిల గణాంకాలను సేకరించడానికి ఇష్టపడని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒబిసి వర్గీకరణ నివేదికను రికార్డులకే పరిమితం చేసే ప్రమాదం కనిపిస్తోంది. జస్టిస్ రోహిణి కమిషన్ జస్టిస్ జి. రోహిణి నేతృత్వంలోని ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) కులాల వర్గీకరణకు నియమించిన కమిషన్ ఎట్టకేలకు జులై 31న తన నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖకు సమర్పించింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి. రోహిణి చైర్‌పర్సన్‌గా అక్టోబరు 2, 2017న ఏర్పాటైన కమిషన్ ఈ కమిషన్ 12 వారాల్లో నివేదిక సమర్పించాల్సి ఉన్నప్పటికీ, దఫాలవారీగా 13సార్లు గడువును పెంచారు. అయినప్పటికీ కమిషన్ వర్గీకరణకు సంబంధించి పూర్తిస్థాయిలో పరిష్కార మార్గాలు సూచించలేకపోయినట్టు తెలుస్తోంది. అందుకు ప్రధాన బిసి వర్గాలకు సంబంధించి సరైన గణాంకాలు అందుబాటులో లేకపోవడమే కారణమని కమిషన్ తన నివేదికలో ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ జాబితాలో ఉన్న మొత్తం 2,633 ఒబిసి కులాలలో కేవలం 25 శాతం కులాల వారే 97శాతం ఉద్యోగాలు పొందినట్టుగా కమిషన్ పేర్కొంది. ఈ స్థితిలో ఒబిసి (ఇతర వెనుకబడిన కులాల)లకు సంబంధించి ప్రస్తుతం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న మొత్తం 27శాతం కోటా ప్రస్తుతం జాబితాలో ఉన్న అన్నికులాలకు సమాన ఫలాలు అందేవిధంగా 1,2,3,4 సంఖ్యలతో కూడిన కేటగిరిలుగా 27 శాతం ఒబిసి రిజర్వేషన్ విభజించాలని ప్రతిపాదించారు. ఉదాహరణకి కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థల్లో ఉద్యోగాలు, సీట్లలో ఒబిసిలకు 27శాతం రిజర్వేషన్ అమలవుతోంది.అయితే ఈ మొత్తం రిజర్వేషన్‌లో కొన్ని కులాలు మాత్రమే అత్యధిక ఫలాలను పొందుతున్నట్టు కమిషన్ గుర్తించింది. ప్రాథమిక అంచనా ప్రకారం కేటగిరి 1లో 1,674 కుల సమూహాలు, కేటగిరి 2లో అంటే కోటా నుండి ఎక్కువ ప్రయోజనం పొందని 534 కులాలు ఉండగా, 3,4 కేటగిరీలలో వరుసగా 328, 97 కులాలు ఉన్నాయి. 3,5 కేటగిరీలలో 4వ కేటగిరి వారు అత్యల్పంగా రిజర్వేషన్ ఫలాలు అందుకుంటున్న విషయాన్ని కమిషన్ గుర్తించింది. ప్రస్తుతం 27శాతం రిజర్వేషన్లలో అత్యధిక ప్రయోజనాలను పొందుతున్న కులాలను 1వ కేటగిరిగా, ఒబిసిలలో ఆధిపత్య కులాలుగా రోహిణి కమిషన్ పేర్కొంది. కమిషన్‌కు తన నివేదికలో రిజర్వేషన్ ప్రయోజనాల అసమాన పంపిణీ ఏ మేరకు జరిగిందో అధ్యయనం చేసింది. ఒబిసిలలో శాస్త్రీయంగా వర్గీకరణ





చేయడానికి అవసరమైన యంత్రాంగం, ప్రాతిపదిక, పద్ధతులు, ప్రమాణాలను నెలకొల్పడం, ఒబిసిలలో ఒకే విధమైన వృత్తులు కలిగిన ఉపకులాలను గుర్తించడం, వారి వారి సామాజిక, ఆర్థిక విద్యాస్థాయిలను అధ్యయనంచేసి ఆ మేరకు వేర్వేరు తరగతులుగా ఒబిసి కులాలను వర్గీకరించింది. రోహిణి కమిషన్ నివేదిక రూపొందించే సమయంలో 2018వ సంవత్సరానికి ముందు ఐదేళ్లలో నియమితులైన 1.3 లక్షల కేంద్ర ప్రభుత్వ ఒబిసి ఉద్యోగుల వివరాలను పరిశీలించింది. అలాగే మూడేళ్లలో ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్ వంటి విద్యాసంస్థల్లో కేంద్ర విశ్వవిద్యాలయాల్లో జరిగిన ఒబిసి అడ్మిషన్లను కూడా పరిశీలించింది. ఈ సందర్భంగా వెల్లడైన అంశాలను కూడా కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. కమిషన్ తన అధ్యయనంలో 97శాతం ఉద్యోగాలు,విద్యావకాశాలు ఒబిసిల్లోని 25 శాతం కులాలకే దక్కుతున్నాయి. ఇంకా చెప్పాలంటే కేవలం పదికులాలకు 24.95 శాతం ఉద్యోగాలు అనుభవిస్తున్నాయి.ఇదే సమయంలో దాదాపు 983 కులాలకు (37శాతం) విద్య, ఉద్యోగాల్లో కనీస ప్రాతినిధ్యం లేదు. 994కులాలకు విద్య, ఉద్యోగాల్లో కేవలం 2.68శాతం ప్రాతినిధ్యమే ఉంది. అయితే ఒబిసిల జనాభా వివరాలు లేనందున ఈవిశ్లేషణ ఏ మేరకు శాస్త్రీయమైనదన్న సందేహాలు ఉన్నాయి. ఒబిసిలకు సంబంధించిన అంశాలు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖకు సంబంధించిన అంశం కావడం వల్ల కమిషన్ సమర్పించిన నివేదిక రాష్ట్రపతి నుంచి కేంద్ర ప్రభుత్వం సామాజిక,న్యాయమంత్రిత్వశాఖకు చేరింది. నివేదికను ప్రభుత్వం ఇంకా బహిరంగపరచలేదు. ఈ నివేదిక సిఫార్సులు అమలు చేయడానికి ముందు చర్చలు జరపడం అవసరమని గుర్తించారు.నివేదికలోని పునర్విభజనపై రాజకీయంగా సున్నితమైన అంశాలను పరిశీలించడానికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలని కూడా జస్టిస్ రోహిణి కమిషన్ పేర్కొంది.ఈ కమిషన్ సిఫార్సులు అమలుపై అనేక అనుమానాలు కలుగుతుంది. దానికి ప్రధాన కారణం ఒబిసిలకు సంబంధించిన గణాంకాలు కేంద్రప్రభుత్వం వద్ద లేకపోవడమే. ఒబిసిల జనగణనపై అఖిల భారత స్థాయిలో సర్వే చేపట్టడానికి వీలుగా బడ్జెట్ కేటాయించాలని 2018 డిసెంబరు 12న కేంద్రానికి కమిషన్ లేఖ రాసింది. 2019 జులై 30న కమిషన్ ప్రభుత్వానికి మరో లేఖ రాస్తూ తమ నివేదిక ముసాయిదా సిద్ధమైందని, అయితే కేంద్ర ఒబిసి జాబితాలో ఎన్నో అస్పష్టతలు ఉన్నాయని, వర్గీకరణ జరగడానికన్నా ముందే వాటిని సవరించాలని ఆ లేఖలో పేర్కొంది.ఈ లేఖలపై కేంద్రప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. ఒబిసి జనాభాపై స్పష్టత లేనప్పటికీ రోహిణి కమిషన్ చివరికి నివేదిక సమర్పించింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం తెలివిగా కులాలవారీగా గణాంకాలను సేకరించడానికి ససేమిరా అంటూనే రాష్ట్ర ప్రభుత్వాలు కులాల వివరాలు సేకరించుకోవచ్చునని పేర్కొంది. ఈ నేపథ్యంలో బీహార్ రాష్ట్రప్రభుత్వం ప్రథమంగా బిసి కులాల గణన ప్రారంభించి పూర్తి చేసింది. ఈ సందర్భంగా కులగణన వల్ల జాతి సమైక్యత దెబ్బతింటుందంటూ కొంతమంది న్యాయస్థానాల్లో సవాలుచేశారు.అయితే ఈ సవాల్‌ను పాట్నా హైకోర్టు కొట్టివేసింది. నిజానికి జనాభా వివరాల సేకరణ సమయంలో కులాల గణాంకాలు సేకరించడం చాలా సులువైన మార్గం. కానీ కులాల వారీ గణన జరిగితే తమ అధికార పీఠాలు కదిలిపోతాయనే ఆధిపత్యకులాల నేతల భయంవల్ల జనాభా వివరాల సేకరణలో కులాలవారీగా గణాంకాలను సేకరించాలనే డిమాండ్‌ను కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తెలివిగా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించింది. అయితే ఇదే సమయంలో దేశంలో అనేక రాష్ట్రాలలో బిజెపి అధికారంలో ఉన్న విషయాన్ని మరిచిపోయింది. మెజారిటీ ప్రజల కోర్కెలను పరిగణనలోకి తీసుకుంటున్న బిజెపియేతర రాష్ట్రాలు కులాల గణన చేపట్టడానికి సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒబిసికులాల గణనకు బిజెపి వ్యతిరేకమని ప్రజలకు తెలిసిపోతోంది. వ్రతం చెడినా ఫలితం దక్కని చందంగా బిజెపిపాలిత రాష్ట్రాల్లో కూడా ఏదో ఒక రూపంలో కుల సర్వే చేయడం అనివార్యంగా మారింది. ●

# ఎన్నికలపై ఓటర్లలో చైతన్యం రావాలి

కొల్లు లక్ష్మీ నారాయణ

ప్రజాసంక్షేమ సిద్ధాంతాలతో, విధి విధానాలలో ప్రజలను పాలించేందుకు ఎన్నో పార్టీలు ఎన్నికల్లో పోటీ పడతాయి. సుభిక్షమైన పాలనను అందించాల్సిన పార్టీలు పౌరులకు ప్రజాప్రతినిధులకు మధ్య నేడు దళారీల పాత్ర పోషిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ విధించిన పరిమితికి లోబడి దొంగ లెక్కలు చూపెడుతూ అన్యాయ, అక్రమ, దోపిడీ, వారసత్వ విధానాలతో లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్న తీరు మనకు ప్రత్యక్ష నిదర్శనమే. పార్టీల వివిధ కార్యక్రమాలకు, ప్రచారాలకు, సమావేశాలకు జనసమీకరణ కీలకం. తరలింపు జనానికి ఒక్కొక్కరికి కనీసం రెండు, మూడు వందల రూపాయలే కాక మద్యం, బిర్యానీలు, తాయిలాలు పంపిణీ చేస్తుండడం బహిరంగ సత్యం. తరలింపు జనం నిజమైన ఆ పార్టీ కార్యకర్తలు కాకపోగా, ఇదే జనం మరో పార్టీ కార్యక్రమంలో ప్రత్యక్షమవటం గమనించవచ్చు. వాగ్దానం చేసినట్లు డబ్బులు, తాయిలాలను సభల ముగింపు అనంతరం పార్టీలు, అభ్యర్థులు, స్థానిక నాయకులచేత ఓటర్లకు సక్రమంగా పంపిణీ జరగనప్పుడు ఏర్పడే తగాదాలు, వివాదాలు, సంభాషణలు ప్రత్యక్ష నిదర్శనమేగాక సామాజిక మాధ్యమాల ద్వారా మనకు విదితమే. పోలింగ్‌కు మూడు, నాలుగు రోజుల ముందు ప్రతి నియోజకవర్గంలో పోటీ చేసే వివిధ పార్టీల అభ్యర్థులు తమ చేతికి మట్టి అంటకుండా పరోక్షంగా స్థానిక నాయకగణం చేత కనిష్టంగా 500 నుండి గరిష్టంగా రెండువేల రూపాయల వరకు ఓటు కోసం పంపిణీ చేస్తుండడం, తీసుకోవడం నేడు ఆనవాయితీగా మారింది. డబ్బులు, మద్యం తాయిలాల పంపిణీలో సాక్ష్యాధారాలు దొరకకుండా రాత్రికిరాత్రే తమ అక్రమ పనులు పూర్తి చేస్తున్నారు. ఒకవేళ అధికారులకు దొరికిపోయినా వారిని బతిమాలో,బెదిరించో మభ్యపెడుతున్నారు.విచ్చలవిడిగా మద్యం పంపిణీ, డబ్బులు ఖర్చుపెడుతున్న నిజాన్ని ఓటర్లే ముచ్చటించుకోవడం తెలిసిందే. సొంత పార్టీ విధివిధానాలతో, సిద్ధాంతా




లతో, జెండాలతో ఎన్నికల్లో గెలిచి అధికారం దక్కని పార్టీ అభ్యర్థులు తమ ఉనికి కోసం, పదవుల కోసం,అక్రమంగా సంపాదించిన ఆస్తుల రక్షణ కోసం అధికారం దక్కిన పార్టీలో చేరి 'పార్టీ ఫిరాయింపు'లకు పాల్పడుతున్న తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుండటమే.డబ్బు, మద్యం, అక్రమ,అవినీతి, దోపిడీల వంటి అప్రజాస్వామ్య లక్షణాలున్న నేటి రాజకీయాల్లో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని మార్పుకోరే ఒక సామాన్య వ్యక్తి, ఒక ప్రజాసేవకుడు, ఒక విద్యావంతుడు, ఒక మేధావి, ఒక ప్రజాస్వామ్యవాది పోటీ చేయాలంటే భయపడే పరిస్థితి. నేటి విశృంకుల రాజకీయాలలో గెలుపు అనే మాట కలలో కూడా రాదు. ఓటర్లు ఎక్కడున్నా, ఏం చేస్తున్నా వారి దగ్గరికి వెళ్లి అలవికాని వాగ్దానాలు, ప్రలోభాలతో కాళ్లవేళ్ల పడి ఓట్లు రాబట్టుకుని గెలుస్తున్నారు. గెలిచాక గ్రామ, మండలస్థాయి నాయకులకు, కాంట్రాక్టర్లకు, వ్యాపారస్తులకు, అండబలం, కండబలం, ఉన్నవారికి మాత్రమే ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష దర్శనం ఇస్తున్నారు. బడాబాబుల పనులకే మోక్షం. ఇక జనంలోకి వస్తే మాత్రం ప్రభుత్వ ధనాన్ని వృధాగా ఖర్చుపెడుతూ మందిమార్బలం, హంగు ఆర్భాటం, వాహనశ్రేణి (కాన్వాయి) సెక్యూరిటీ గార్డ్‌లతో కండబలం, ధనబలం రాజకీయాలుగా మారిన తీరు మాత్రం ప్రజాసేవను దూరం చేసి స్వార్థం, అవినీతి, దోపిడీ, అక్రమ రాజకీయాలకు పునాది వేస్తుంది. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని, ప్రజాసేవలో సరైన పనితీరు, బాధ్యత లేకుండా పారదర్శకతలేని అప్రజాస్వామ్య విధానాలకు పాల్పడే ప్రజాప్రతినిధులను ఐదేళ్లకి ఒకమారు ప్రజలు తమ విలువైన ఓటుద్వారా మార్చే అవకాశాన్ని ఉపయోగించుకోకపోవడం ప్రజాస్వామ్యపునాదులకు ప్రమాదకరం. తాయిలాలకు ఓటును అమ్ముకునే ప్రజలకు తాము ఎన్నుకున్న ప్రతినిధులను ప్రశ్నించేహక్కును కోల్పోవడం ప్రజాస్వామ్యానికి విఘాతం.కుల,మత, వర్గాలకు తాయిలాలకు తలొగ్గి ఎంతో శక్తివంతమైన ఓటును అమ్ముకోవడం, ప్రజాసంక్షేమ పాలకులను ఎన్నుకోకపోవడం ప్రజాస్వామ్య పునాదులకే పెను ప్రమాదం. ప్రజలే అసలైన రాజ్యాంగ సంరక్షకులు, సార్వాభౌములు అన్న స్ఫూర్తితో ముందడుగు వేస్తేనే ప్రజాస్వామ్యం పదికాలాలపాటు పరిఢవిల్లుతుంది.

# పాత పెన్షన్ విధానం అమలు జరిగేనా?



వాసిలి సురేష్

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రాజకీయపార్టీలు ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లపై గురి పెట్టాయి. వాళ్ల డిమాండ్లను మేనిఫెస్టోలో పెట్టి ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉద్యోగులు కూడా తమ ప్రధాన డిమాండ్ అయిన పాత పెన్షన్ విధానంపై ప్రకటన ఇప్పించుకోవాలని చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలలో కొంత నిరాశ నెలకొని ఉంది. సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులంతా ఏ పార్టీ ఓపిఎస్‌ను మేనిఫెస్టోలో పెడుతుందో ఆ పార్టీవైపు ఉండాలని సూత్రపాయంగా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణా రాష్ట్రంలో దాదాపు రెండున్నర లక్షలమంది వరకు ఉన్న సిపిఎస్ ఉద్యోగుల ఓట్లు అన్ని పార్టీలకూ కీలకంగా మారుతున్నాయి. అందుకే అన్నిపార్టీలు పాతపెన్షన్ పథకం అమలు చేయాలన్న డిమాండ్లకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. అధికారంలోకి రాగానే సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేస్తామని, ఈ అంశాన్ని మేనిఫెస్టోలో చేరుస్తామని ఇదివరకే కాంగ్రెస్‌పార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిఆర్‌ఎస్ కూడా సిపిఎస్ రద్దుపైన, ఏదైనా నిర్ణయం తీసుకోవచ్చని ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నప్పటికీ సిపిఎస్ రద్దు, ఓపిఎస్ అమలుపై కమిటీ వేసి అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చట్టంలో ఈ విషయాన్ని చేర్చారు. దీంతో రాష్ట్రంలో బిజెపి మినహా కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలకే ఓపిఎస్ రద్దు అవకాశం ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే సిపిఎస్‌ను రద్దుచేశాయి. ఇక తమిళనాడు ఎన్‌పిఎస్ ఖాతాకు ఒక్కపైసా కూడా జమ చేయడంలేదు. తెలంగాణ రాష్ట్రంలో ఓపిఎస్ కోసం ఉద్యోగులు చాలా ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. పాత, కొత్త అందరు ఉద్యోగులు కలిస్తే మొత్తం ఓపిఎస్ కోరుకునే వాళ్ల సంఖ్య మూడులక్షల వరకు ఉంటుంది. రాష్ట్రప్రభుత్వ పరిధిలో ఉన్న ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. సిపిఎస్ వద్దని పాత పెన్షన్ స్కీమ్‌విధానాన్నే తమకు వర్తింపచేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క సిపిఎస్‌ను రద్దుచేస్తున్న రాష్ట్రాలసంఖ్యక్రమేణా పెరుగుతుండడంతో తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సరైన నిర్ణయం తీసుకోకపోతే





సిపిఎస్ కింద ఉన్న రెండు లక్షల మందికిపైగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఓట్లు అధికార పార్టీపై ప్రభావం చూపే అవకాశముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌లలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్‌ను రద్దు చేశాయి. ఇటీవల ఎన్నికలు జరిగిన కర్ణాటకలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సిపిఎస్‌నురద్దు చేస్తుండడంతో తెలంగాణలో కూడా సిపిఎస్ రద్దు చేయాలని ఉద్యోగులు ఒత్తిడి చేస్తున్నారు.నిజానికి సిపిఎస్‌ను రద్దు చేసుకునే అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలకు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం వీలుకల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రాల ఉద్యోగుల కోసం కేంద్రం 'నేషనల్ పెన్షన్ సిస్టం (ఎన్‌పిఎస్), సిపిఎస్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది.2004 జనవరి 1 తర్వాత నియమితులైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పిఎస్‌ను కేంద్ర పెన్షన్ల, పెన్షనర్ల సంక్షేమ శాఖ వర్తింపచేసింది. ఈ విధానాన్ని రాష్ట్రప్రభుత్వం కూడా అన్వయించుకుంటూ 2014 ఆగస్టు 23న జీవోను జారీచేసింది. దీంతో2004 సెప్టెంబరు1 తర్వాత నియమితులైన రాష్ట్ర ప్రభుత్వఉద్యోగులకు సిపిఎస్ విధానం అమలవుతోంది. తెలంగాణ రాష్ట్రంలోని 3.28 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, సిపిఎస్ కిందే రెండు లక్షల మంది ఉద్యోగులున్నారు. అటెండర్ నుంచి గ్రూపు-1 అధికారుల వరకు సిపిఎస్ కింద ఉన్నారు. దీనిని రద్దు చేయాలంటూమొదటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. సిపిఎస్ విధానం వల్ల తమకు పాతపెన్షన్ విధానంలో ఒనగూరిన యాభైశాతం పెన్షన్, కుటుంబసభ్యులకు ముప్పైశాతం పెన్షన్ రూ.16 లక్షల గ్రాట్యుటీ, కమ్యూనికేషన్ వంటి సౌకర్యాలను ఉద్యోగులు కోల్పోతున్నారు. నిజానికి పాత పెన్షన్ స్కీమ్ (ఓపిఎస్) కింద ఉద్యోగి పదవీ విరమణ చేయగానే ఆఖరి నెల వేతనంలో యాభైశాతం మొత్తాన్ని ప్రతినెలా పెన్షన్ కింద చెల్లిస్తారు. సిపిఎస్ కింద ఈ సౌకర్యం లేదు. ప్రస్తుతం సిపిఎస్ కింద ఉద్యోగి వేతనం, డిఏల నుంచి పదిశాతం, ప్రభుత్వం నుంచిమరో పది శాతం సొమ్మును కలిపి నేషనల్ పెన్షన్ స్కీం ట్రస్టులో జమ చేస్తున్నారు. ఉద్యోగికి కేటాయించిన పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నెంబర్‌లో ఈ సొమ్ము జమ అవుతుంది. ఉద్యోగి పదవీ విరమణ పొందే వరకు జమ అయిన మొత్తం నుంచి అరవై శాతం డబ్బును మాత్రమే ఉద్యోగికి నగదుగా చెల్లిస్తారు.మిగతా నలభై శాతం డబ్బును షేర్ మార్కెట్‌లో పెడుతున్నారు. వచ్చే లాభాన్ని నెలవారి పెన్షన్‌కింద రిటైర్డు ఉద్యోగికి చెల్లిస్తున్నారు. షేర్‌మార్కెట్ నష్టాలను చవిచూస్తే అవే నష్టాల మొత్తాన్ని ఉద్యోగి డబ్బులనుంచి కట్ చేసుకుంటున్నారు.అందుకే ఈ సిపిఎస్ నష్టదాయకంగా ఉందని, దానిని రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలంటూ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ఇప్పటికే ఆరు రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేశారు. కాబట్టి తెలంగాణలో రాబోవు ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పినట్లు సిపిఎస్‌ను రద్దుచేయాలి. సిపిఎస్ వల్ల ఉద్యోగులకు నష్టమే తప్ప లాభంలేదు.పాతపెన్షన్ విధానమే రిటైర్ అయిన తర్వాత అన్నం పెడుతుంది. సిపిఎస్‌ను రద్దు చేస్తే ప్రభుత్వానికి ఉద్యోగులనుంచి మరింత ఆదరణ,అభిమానాలు పెరుగుతాయి. ●

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అదానీ గ్రూప్‌పై దర్యాప్తు చేపడతాం : రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, అక్టోబరు18 :** బొగ్గు దిగుమతులపై ఆదానీ గ్రూపుఅధిక ధరలు కారణంగా ప్రజలపై విద్యుత్తు భారం పడుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బొగ్గు దిగుమతులపై ఆదానీ గ్రూపు అధిక ఇన్‌వాయిస్‌లతో ప్రజలు విద్యుత్తుకు ఎక్కువ చెల్లించేలా చేస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ క్రమంలో ప్రజలపై రూ. కోట్లభారం పడుతోందని మీడియాలో వచ్చిన కథనాన్ని ఆయన ఉదహరించారు. దీనిపై దర్యాప్తునకు ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. దీనిపై దర్యాప్తునకు ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆదానీ గ్రూప్‌పై దర్యాప్తుకు ఆదేశిస్తామన్నారు.ఎ ఇండోనేషియా నుంచి ఆదానీ గ్రూప్ బొగ్గు దిగుమతి చేసుకొంది. భారత్‌కు చేరేసరికి దాని ధర రెట్టింపు అవుతోంది. ఇలా అధిక ధరల కారణంగా సామాన్య ప్రజలు విద్యుత్ బిల్లులను భారీగా చెల్లించాల్సి వస్తోంది. దీంతో కొన్ని కాంగ్రెస్ పాలిత ప్రాంతాలు పేదలకు సబ్సిడీలు చెల్లించాల్సి వస్తోందన్ని ని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జర్నలిస్టు సౌమ్యవిశ్వనాథన్ హత్యపై 15ఏళ్ల తర్వాత కీలక తీర్పు దీనిపై దర్యాప్తు చేస్తారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన రాహుల్.. 'తాము అధికారంలోకి వస్తే తప్పకుండా దర్యాప్తుకు ఆదేశిస్తాం అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రధాని మోడీ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించిన రాహుల్.. దర్యాప్తు జరిపి విశ్వసనీయతను నిరూపించుకోవాలని అడుగుతున్నానన్నారు. మార్కెట్ విలువకంటే ఎక్కువ ధరకు అదానీ గ్రూప్ బొగ్గు దిగుమతి చేసుకున్నట్లుకనిపిస్తోందంటూ ఫైనాన్షియల్ టైమ్స్ కథనాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావిస్తూ ఈ ఆరోపణలు చేశారు.



## సమాజ్ వాదీ నేత అజాంఖాన్‌కు ఏడేళ్ల జైలు శిక్ష

**లక్నో, అక్టోబర్ 18 :** సమాజ్‌వాదీ పార్టీ నాయ కుడు అజాం ఖాన్, ఆయన భార్య తజన్ ఫాతి మా, కుమారుడు అబ్దుల్లా అజాంలకు యూపీ లోని రాంపూర్ కోర్టు ఏడేళ్ల శిక్షను విధించింది. 2019నాటి నకిలీ జనన ధృవీకరణ పత్రాల కేసులో ఈ ముగ్గుర్ని దోషులుగా నిర్ధారించింది. ఎంపీ -ఎమ్మెల్యే కోర్టు న్యాయమూర్తి షోబిత్ బన్సల్ ముగ్గురు దోషులకు గరిష్టంగా ఏడేళ్ల జైలు విధిస్తూ శిక్షను ఖరారు చేశారు. నకిలీ ధ్రువపత్రాలపై బిజెపి ఎమ్మెల్యే అకాష్ సక్సెనా రాంపూర్‌లోని గంజ్ పోలీస్ స్టేషన్‌లో జనవరి 3,2019న పోలీసులకు ఫిర్యాదు చేయగా .. ఎఫ్ఐఆర్ నమోదైంది. వారి కుమారుడు అబ్దుల్లా అజాంకు రెండు నకిలీ పుట్టిన తేదీ సర్టిఫికేట్‌లు పొందేందుకు అజాం ఖాన్, ఆయన భార్య తజీన్ ఫాతిమా సహాయం చేశారని సక్సెనా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక సర్టిఫికెట్ లక్నోనుంచి కాగా మరొకటి రాంపూర్ నుంచి పొందినట్లు ఫిర్యాదులో స్పష్టం చేశారు. 'కోర్టుతీర్పు తర్వాత, ముగ్గురిని జ్యుడీషల్ కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు నుండే దోషులను జైలుకు తరలించార్ను. అని ప్రాసిక్యూషన్ తరఫున వాదిస్తున్న మాజీ జిల్లా ప్రభుత్వ న్యాయవాది అరుణ్ ప్రకాష్ సక్సెనా అన్నారు.

## పాక్‌లో ఆర్థిక సంక్షోభం - 48 విమానాలు రద్దు

**ఇస్లామాబాద్, అక్టోబరు 18:** పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకి మరింత దిగజారిపోతోంది. తాజాగా ఇంధనం లేని కారణంగా పాక్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పిఐఎ) 48 జాతీయ, అంతర్జాతీయ విమానాలను నిలిపివేయాల్సి వచ్చింది. ఇంధనం పరిమితంగా ఉండడం వల్ల విమానాలు రద్దు చేయాల్సి వచ్చింది, కొన్ని విమాన సర్వీసులను రీషెడూనయల్ కూడా చేశామని పిఐఎ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇప్పటి వరకూ మొత్తం 13 దేశీయ, 11 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు చేసినట్లు చెప్పారు. అలాగే 12 విమానాలను షెడ్యూల్ మార్చామని అన్నారు. రద్దు చేసిన విమానాలకు సంబంధించిన ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వచ్చే ముందే పిఐఎ కస్టమర్ కేర్‌ను సంప్రదించాలని కోరారు. బుధవారం మరో 16 విమానాలను రద్దు చేశామని, మరికొన్ని ఆలస్యం కానున్నాయని చెప్పారు. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రభుత్వ చమురు సంస్థ (పిఎస్ఒ) పిఐఎకు ఇంధన సరఫరా నిలిపివేయడంతో ఈ సంక్షోభం తలెత్తినట్లు తెలిసింది. దీంతో పిఐఎకు ఇంధన కొరత ఏర్పడింది. మరోవైపు రుణభారం పెరిగిపోతున్న నేపథ్యంలో పిఐఎను ప్రైవేట్ పరం చేసేందుకూ ఆలోచనలు నడుస్తున్నాయి.

## గగన్‌యాన్ ప్రయోగానికి ముందుగా కీలక పరిశోధన

### - షార్ నుంచి క్రూ మాడ్యూల్ ఎస్కేప్ సిస్టం ప్రయోగానికి సర్వంసిద్ధం

**శ్రీహరికోట (తడ), అక్టోబర్ 18 ప్రభాతవార్త** అంతరిక్ష పరిశోధనలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గగన్‌యాన్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు ముందస్తుగా అన్ని పరిశోధనలు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే నింగిలో హెలికాప్టర్ ద్వారా పారాచూట్ల పరిశోధన, సముద్రంలోకి పరికరాలు చేర్చడం, క్షేమంగా భూమికి తీసుకురావడం వంటి పరిశోధనలు కొన్ని నెలలుగా పూర్తి చేశారు. ఇద్దరికి పైగా వ్యోమగాములకు శిక్షణ ఇచ్చారు. అంతరిక్షంలోకి మనుషులకు ముందుగా రోబోను ప్రయోగించడానికి రూపకల్పన చేశారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే నింగి నీరు నేలలలో ఒకేసారి క్రూమాడ్యూల్ ఎస్కేప్ సిస్టం ప్రయోగాన్ని ప్రస్తుతం శ్రీహరికోట నుంచి చేపడుతున్నారు. గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ డి-1 పేరుతో దీన్ని రూపొందించారు. ఇప్పటిదాకా జరిగిన గగన్‌యాన్ పరీక్షలు, పరిశోధనలు ఒక ఎత్తు కాగా, ఈ ప్రయోగం మరో ఎత్తు. అందుకే దీనిని అత్యంత క్లిష్టమైనదిగా ఇస్రో శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సాధారణంగా జిఎస్ఎల్‌వి తరహా రాకెట్లలో క్రింది భాగంలో ఉపయోగించే నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లలో ఒక దాని సైజులో ఈ రాకెట్‌ను రూపొందించారు. ఎల్‌పార్టీగా పిలిచే ఈ బూస్టర్‌లో 44 టన్నుల ద్రవ ఇంధనం నింపారు. ఈ రాకెట్ ద్వారా క్రూమాడ్యూల్ పరికరాన్ని 16.9 కిలోమీటర్ల దూరం అంతరిక్షంలోకి ప్రయోగిస్తారు. అక్కడ నుంచి పారాచూట్ల సహాయంతో ఈ పరికరం సముద్రంలో పడుతుంది.

## బెంగళూరు పబ్‌లో భారీ అగ్నిప్రమాదం

**బెంగుళూరు, అక్టోబరు 18 :** బెంగళూరులోని ఓ పబ్ మంటల్లో చిక్కుకుంది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలోని ఓ పబ్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వివరాల్లోకి వెళితే.. కోరమంగళ ప్రాంతంలోని ఓ నాలుగు అంతస్తుల భవనంలో నిర్వహిస్తున్న పబ్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఇదే భవనంలో జిమ్, కార్ల షోరూం సైతం ఉన్నాయి. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సుమారు ఆరు పఃరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ప్రస్తుతానికి మంటలు చాలా వరకు అదుపులోకి వచ్చాయని పోలీసులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదానికి సంబం ధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఓ వ్యక్తి భవనం టెర్రస్‌పై నుంచి కిందికిదూకాడు.

# గాజా ఆసుపత్రిపై దాడి ఉగ్రవాదుల పనే ఆధారాలున్నాయంటున్న ఇజ్రాయెల్

**జెరూసలెం, అక్టోబరు 18:** గాజాలోని అల్ అహ్లీ సిటీ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ దాడులు చేసిందన్న పాలస్తీనా ఆరోపణలను ఇజ్రాయెల్ సైన్యం ఖండించింది. దాడి చేసింది తాము కాదని స్పష్టం చేసింది. పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ మిలిటరీ గ్రూప్ రాకెట్ మిస్‌ఫైర్ అయి ఆసుపత్రిపై పడిందని తెలిపింది. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా విడుదల చేసింది. ఆసుపత్రి దాడిపై తీవ్రంగా



ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ఈ మేరకు స్పందించింది. పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ మిలిటరీ గ్రూప్ హమాస్‌తో కలిసి మిత్ర కూటమిగా పనిచేస్తోంది. హమాస్, ఇజ్రాయెల్ యు ద్ధం మంగళవారం భీకర రూపం సంతరించుకుంది. సెంట్రల్ గాజాలోని అల్ అహ్లీ సిటీ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ జరిపిన భారీ వైమానిక దాడిలో ఏకంగా 500 మంది ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే దాడిని ఇజ్రాయెల్ ధృవీకరించలేదు. హమాస్ దళాలకు చెందిన రాకెట్ దాడుల్లోనే ఆసుపత్రి కూలిపోయిందని స్పష్టం చేసింది. అక్టోబరు 7న హమాస్ దళాలు ఇజ్రాయెల్‌లో నోవా ఫెస్టివల్‌పై దాడులు ప్రారంభించాయి. అకస్మాత్తుగా జరిగిన ఈ దాడుల నుంచితేరుకుని ఇజ్రాయెల్ హమాస్ దళాలపై తిరగబడింది. హమాస్ అంతమే లక్ష్యంగా మెరుపుదాడులు చేస్తోంది. ఇరుపక్షాల వైపు దాడుల్లో ఇజ్రాయెల్‌లో సైనికులు, మహిళలు, చిన్నారులతో సహా 1,400 మందికిపైగా జనం మరణించారు. హమాస్ దళాల చేతికి దాదాపు 200 మంది ఇజ్రాయెల్ పౌరులు బందీలుగా చిక్కారు. ఈ విషయాన్ని యావత్ ప్రపంచం తెలుసుకోవాలి. గాజాలోని అనాగరిక ఉగ్ర మూకలే, అక్కడి ఆసుపత్రిపై దాడి చేశాయి. ఐడిఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్) కాదు. మా పిల్లలను అతి దారుణంగా హత్య చేసిన ఆ ఉగ్రవాదులు ఇప్పుడు వారి పిల్లలను కూడా చంపేస్తున్నారు' అని నెతన్యాహు ఆరోపించారు. అటు 'ఇజ్రాయెల్ డిఫెన్స ఫోర్సెస్' కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. ఆసుపత్రి సమీపంలో పిఐజె మిలిటెంట్లు ప్రయోగించిన రాకెట్ గురితప్పి ఆసుపత్రిలో పేలుడు సంభవించిందని పేర్కొంది. ఇదిలా ఉండగా, ఆసుపత్రిలో పేలుడు ఘటనపై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రంగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయం తెలియగానే తాను జోర్డాన్ రాజు అబ్దుల్లా 2, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో మాట్లాడినట్లు తెలిపారు. మరోవైపు ఈ దాడి నేపథ్యంలో బైడెన్ జోర్డాన్ పర్యటన రద్దయింది. జోర్డాన్‌లో ఆయన అబ్దుల్లాతో పాటు ఈజిప్టు ప్రధాని ఎల్-సిసి, పాలస్తీనా అధ్యక్షుడు మహ్మూద్ అబ్బాస్ తదితరులతో భేటీ కావాల్సి ఉండగా, ఆ సమావేశం రద్దయినట్లు జోర్డాన్ విదేశాంగ మంత్రి తెలిపారు. ఇందుకు గల కారణాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. మరోవైపు బైడెన్ ఇప్పటికే ఇజ్రాయెల్ పర్యటన నిమిత్తం బయల్దేరారు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కూడా ఈ వారం ఇజ్రాయెల్‌లో పరనయటించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ కొన్ని కథనాలు వెలువడ్డాయి.

### 4.30 గంటలు డోర్ పట్టుకునే ఉన్నాం:

హమాస్ దాడిని ప్రత్యక్షంగా చూసిన కేరళ మహిళ

**తిరువనంతపురం, అక్టోబరు 18:** కేరళకు చెందిన సబిత, మీరా మోహన్ ఇజ్రాయెల్‌లో కేర్‌గివర్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల గాజా సరిహద్దుల్లోని నీర్ ఓజ్ అనే కిబుట్జ్‌లోకి హమాస్ మిలిటెంట్లు చొరబడి



నరమేధానికి పాల్పడిన సమయంలో వారు అక్కడే విధి నిర్వహణలో ఉన్నారు. ఆ సమయంలో ప్రాణాలకు తెగించి వారు ఓ వృద్ధురాలిని హమాస్ దాడి నుంచి కాపాడగలిగారు. వారి ధైర్యాన్ని అభినందిస్తూ భారత్‌లోని ఇజ్రాయెల్ ఎంబసి తాజాగా తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ విడియోను పోస్ట్ చేసింది. ఆనాడు వారు ఎదుర్కొన్న భయానక అనుభవాన్ని సబిత ఆ విడియోలో గుర్తుచేసుకున్నారు. ఈ సరిహద్దు ప్రాంతంలో నేను మూడేళ్లుగా పనిచేస్తున్నా. ఎఎల్ఎస్ వ్యాధితో బాధపడుతున్న రాహేల్‌కు నేను, మీరా మోహన్ కేర్‌గివర్లుగా ఉన్నాం. ఆ రోజు అక్టోబరు 7న నేను నైట్ డ్యూటీలో ఉన్నాం. ఉదయం 6.30 గంటలకు వెళ్లిపోవాల్సి ఉంది. సరిగ్గా అదే సమయంలో మాకు సైరన్లు వినిపించాయి. వెంటనే రహేల్‌ను తీసుకుని మేం సేఫ్టీ గదుల్లోకి పరిగెత్తాం. సైరన్ల మోత ఆగట్లేదు. బయట ఏం జరుగుతుందో తెలియదు. అప్పుడు రహేల్ కుమార్తె మాకు ఫోన్ చేసి, 'పరిస్థితి చేయి దాటిపోయింది. ముందు, వెనుక డోర్లు లాక్ చేసుకోండి' అని చెప్పారు. 'వెంటనే మేం తలుపులు లాక్ చేసుకున్నాం. ఉదయం 7.30గంటల సమయంలో ఉగ్రవాదులు మా ఇంట్లోకి చొరబడ్డారు. మేము ఉన్న గది తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. మాకేం చేయలో అర్థం కాలేదు. మళ్లీ రహేల్ కుమార్తెకు ఫోన్ చేశాం.' డోర్‌ను గట్టిగా పట్టుకోండి. వదిలిపెట్టొద్దు' అని ఆమె చెప్పారు. మేం అలాగే చేశాం. గ్రిప్ పోకుండా ఉండేందుకు చెప్పులను కూడా తీసేశాం. బయట నుంచి ఉగ్రవాదులు మా గది తలుపు బద్దలుకొట్టేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. తుపాకీతో కాల్పులు కూడా జరిపారు' అని తెలిపారు.

'దాదాపు నాలుగున్నర గంటల పాటు మేం ఆ డోర్‌ను గట్టిగా పట్టుకునే ఉన్నాం. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో మళ్లీ కాల్పుల చప్పుడు వినిపించింది. అప్పుడు షెములిక్ (ఆ ఇంటి యజమాని) వచ్చి ఇజ్రాయెల్ సైన్యం వచ్చిందని చెప్పారు. ఆయన బయటకెళ్లి చూసే సరికి అంతా ధ్వంసమై కనిపించింది. మా ఇంట్లో ఉగ్రవాదులు అన్ని దోచుకెళ్లారు. మీరా పాస్‌పోర్ట్, నా ఎమర్జెన్సీ బ్యాగ్‌ను కూడా తీసుకెళ్లారు'. 'సాధారణంగా సరిహద్దుల్లో ఉండే మాకు క్షిపణులు పడినప్పుడు సేఫ్టీ గదుల్లోకి వెళ్లి, పరిస్థితులు సద్దుమణిగా బయటకు రావడం అలవాటే. అప్పుడు మా ఎమర్జెన్సీ బ్యాగులు తీసుకుని వెళ్తాం. అందులో మా డాక్యుమెంట్లన్నీ ఉంటాయి. కానీ ఇలాంటి ఉగ్రదాడిని మేం ఊహించలేదు.

### గాజాపై వైమానిక దాడులు ఆపితే..బందీల విడుదల..

ఇజ్రాయెల్‌పై మెరుపుదాడి చేసి కొందరు పౌరులను బందీలుగా పట్టుకెళ్లిన హమాస్ గ్రూప్, ఇప్పుడు వారిని విడిచిపెట్టేందుకు ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇందుకోసం ఇజ్రాయెల్‌కు షరతు విధించినట్లు సమాచారం. గాజాలో బాంబు దాడులు ఆపితే బందీలందరినీ విడిచిపెట్టేస్తామని హమాస్ సీనియర్ అధికారి ఒకరు చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. గాజాలో ఇజ్రాయెల్ బల గాలు తమ సైనిక దురాక్రమణ, వైమానిక దాడు లను నిలిపివేస్తే, గంటలోనే మా వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెల్, ఇతర దేశాల పౌరులను విడిచిపెడతాం. ప్రస్తుతం వారిని విడిచిపెట్టేందుకు సురక్షిత ప్రదేశం లేదు' అని హమాస్ సీనియర్ అధికారి చెప్పినట్లు కథనం పేర్కొంది. ఆ అధికారి ఎవరనేది మాత్రం వెల్లడించలేదు.

# 60 మంది ఉద్యోగులపై 'బిఒబి' వేటు..

**వాణిజ్యం**

**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** దేశీయ ప్రభుత్వ యాజమాన్యంలో అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటిగా బ్యాంకు ఆఫ్ బరోడా కొనసాగుతోంది. తాజాగా ఈ సంస్థలో డబ్బుల గోల్ మాల్ వ్యవహారం బయటకు రావడంతో రిజర్వ్ బ్యాంకు రంగం లోకి దిగిన విషయం విదితమే. తాజాగా బిఒబి వర్డ్ యాప్ అక్రమాల వ్యవహారం లో బ్యాంకు ఆఫ్ బరోడా 60 మందికిపైగా ఉద్యోగులను సస్పెండ్ చేసింది. సెస్పెండ్ అయిన వారిలో 11 మంది అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు ఉన్నారు. బిఒబి వరల్డ్ యాప్ కేసు సంచలనంగా మారిన వేళ షేర్లు బుధవారం దాదాపు ఒకశాతం క్షీణతతో రూ.205.35 వద్ద ట్రేడవుతున్నాయి. దీనికి ముందు రిజర్వ్ బ్యాంకు ఇండియా బ్యాంకు ఆఫ్ బరోడాను బిఒబి వరల్డ్ యాప్ ద్వారా కొత్త కస్టమర్ లను ఆన్‌బోర్డ్ చేయడాన్ని నిలిపివే యా లని ఆదేశించింది. ఈ వ్యవహారంపై బ్యాంకు ఆఫ్ బరోడా ఉద్యోగి మాట్లాడుతూ, ఎజిఎం స్థాయి అధికారులు సాధారణంగా ఏరియా మేనేజర్లు, జోనల్ హెడ్‌ల పదవుల ను కలిగి ఉన్న స్కేల్ 5 అధికారులని తెలిపారు. 25కిపైగా శాఖల అధిపతుల పని పై ఆయన నిఘా ఉంచినట్లు వెల్లడించారు. అంతర్గత ఆడిట్ ఆధారంగా తాజా చర్యలు వచ్చాయని ఆయన అన్నారు.




కస్టమర్ల సమ్మతి లేకుండా వారి అకౌంట్ వివరాలు ఫీడ్ చేసి కొందరు ఉద్యోగులు బిఒబి వరల్డ్ అప్లికేషన్‌ను రిజిస్టర్ చేసి డీరిజిస్టర్ చేశారు. దీంతో కొందరు ఖాతాదారులకు ఆర్థిక నష్టం వాటిల్లిందని తేలింది. సస్పెండ్ అయిన వారిలో ఎక్కువ మంది గుజరాత్ వడోదల ప్రాంతానికి చెందిన వారేనని సమాచారం. ఈ వ్యవ హారానికి సంబంధించి త్వరలోనే లక్నో, భోపాల్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో చర్యలు ఉండే అవ కాశం ఉన్నట్లు వెల్లడైంది. ఈ క్రమంలో తప్పుచేసినట్లు గుర్తించిన ఉద్యోగులను పూర్తిగా తొలగించడం లేదా ఇతర శిక్షలు వేయొచ్చని తెలుస్తోంది. అలాగే నిర్దోషి అని తేలితే సస్పెన్షన్ కాలంలో నిలిపివేసిన జీతం తిరిగి చెల్లిస్తారని ఒక ఉద్యోగి వెల్లడించారు.

## అదానీ మరో సిమెంట్ కంపెనీ కొనుగోలు!


**ముంబై, అక్టోబరు 18:** సిమెంట్ వ్యాపారంలో కొన్ని కీలక కంపెనీలను హస్తగతం చేసుకున్న తర్వాత అదానీ సిమెంట్స్ దేశంలో పెద్ద ఆటగాడిగా మారిపోయింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో దూసుకుపోతున్న అదానీ అంబుజా సిమెంట్స్, ఎసిసి సిమెంట్స్, సంఘీ ఇండస్ట్రీస్ కంపెనీలను భారీ మొత్తం వెచ్చించి కొనుగోలు చేసిన విషయం విదితమే. అయితే తాజాగా ఓరియంట్ ప్రమోటర్ సికె బిర్లా తమ కంపెనీ లో వాటాలను విక్రయించేందుకు గౌతమ్ అదానీని సంప్రదించారు. ఈ వార్తల నేపథ్యం లో బుధవారం ఓరియంట్ సిమెంట్



షేర్లు 13శాతం పెరిగి పెట్టుబడిదారులకు భారీ రాబడులను అందించింది. ఈ డీల్ గురించి చర్చించేందుకు బిర్లా, అదానీ గ్రూప్ సీనియర్ అధికారులు చర్చించేందుకు సమావేశమైనట్లు కూడా ఒక నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం, గత కొన్ని నెలలుగా అదానీతో పెట్టుబడిపై చర్చలు జరుగుతున్నాయని వెల్లడైంది. ప్రస్తుతం అదానీ సిమెంట్ మొత్తం సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 110 మిలియన్ టన్నులుగా ఉంది. దీంతో ఈ రంగంలో కంపెనీ దేశంలోనే రెండవ అతిపెద్ద సంస్థగా ఎదిగింది. ఇక సికె బిర్లా గ్రూప్ దీనికి ఆటో యాక్సెసరీస్ ఉత్పత్తులు, భవన నిర్మాణ ఉత్పత్తులు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, సిమెంట్, పేపర్, ఫ్యాన్స్ అండ్ ఎలక్ట్రికల్ వస్తువులు వంటి విభిన్న పరిశ్రమల్లో వ్యాపారాలున్నాయి. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ప్రమోటర్లు సిమెంట్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. కంపెనీ మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రధాన మార్కెట్ వాటాను కలిగి ఉంది.

## క్షీణించిన స్టాక్ సూచీలు

**ముంబై, అక్టోబరు 18:** దేశీయ స్టాక్ మార్కెట్లు అకస్మాత్తుగా బుధవారం నష్టాల బాటపట్టా యి. స్వల్ప లాభాలతో ప్రారం భమైన సూచీలు, చివరికి నష్టాలను చవిచూశాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపద భారీగా ఆవిరైంది. మార్కెట్లు ముగిసే సమయంలో బెంచ్ మార్క్ సూచి సెన్సెక్స్ 551 పాయింట్లు క్షీణించి 65,877 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 140 పాయింట్లు నష్టపోయి 19,671 పాయింట్ల వద్ద నిలిచింది. ఇదే క్రమంలో నిఫ్టీ బ్యాంకు సూచి 521 పాయింట్లు, నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచి 366 పాయింట్లను కోల్పోయాయి. మార్కెట్ నిపుణుల రెండవ త్రైమాసిక ఫలితాల ఆదాయాల మార్జిన్లు కార్పొరేట్ కంపెనీల పై ప్రతికూలంగా ఉంటుందని అంచనాలు వేసిన వేళ స్టాక్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి మొదలైం ది. దీనికి అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతలు భారీ నష్టాలకు దారితీశాయి. బ్యాంకింగ్, పవర్ రంగాల్లోని కంపెనీలు మార్కెట్లను నష్టాల్లోకి లాగాయి. ఇదే క్రమంలో ఫార్మా స్టాక్స్ లాభాల పంట పండిం చాయి. ఇదే క్రమంలో బిఎస్ఇ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు నష్టాల్లో ముగిసాయి. ఎన్ఎస్ఇలో సిప్లా, డాక్టర్ రెడ్డీస్, టాటా మోటార్స్, సన్‌ఫార్మా, ఎస్‌బిఐ లైఫ్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఒఎన్‌జిసి, మారుతి సుజుకి, బ్రిటానియా, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఆటో కంపెనీల షేర్లు లాభాల్లో ముగిసాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టిపిసి, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, టాటా కన్స్యూమర్, ఐసిఐసిఐ బ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంకు, టెక్ మహీంద్రా, గ్రాసిమ్‌ఇండియా, అపోలోహాస్పిటల్స్, జెఎస్‌డబ్ల్యూస్టీల్, విప్రో, బిపిసిఎల్, అదానీ పోర్ట్స్, ఎల్‌టిఐఎం, అదానీ ఎంటర్‌ప్రైజెస్, టైటాన్ కంపెనీల షేర్లు నష్టాలతో ముగిసాయి.



## హీరో ఫిన్‌కార్ప్ రూ.4వేల కోట్ల సమీకరణ!

**ముంబై, అక్టోబరు 18:** ప్రముఖ దిగ్గజ కంపెనీ హీరో మోటోకార్ప్ ఆటోమొబైల్ రంగంలో సేవలు అందించడం తో పాటు ఫైనాన్స్ రంగంలోనూ తన సత్తాచాటేందుకు సిద్ధం అయింది. హీరో మోటోకార్ప్, ఆర్థిక సేవల విభాగమైన హీరో ఫిన్‌కార్ప్ రూ.4వేల కోట్ల సమీకరణ లక్ష్యంతో 2024లో పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పబ్లిక్ ఇష్యూపై సలహా లు ఇచ్చేందుకు ఎనిమిది ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులకు సంస్థ ఎంపిక చేసినట్లు తెలిసింది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకుల్లో జెఎం ఫైనాన్షియల్, బ్యాంకు ఆఫ్ అమెరికా సెక్యూరిటీస్, జెఫ్రీస్, ఐసిఐసిఐ సెక్యూరిటీస్, హెచ్ఎస్‌బిసి సెక్యూరిటీస్, యుబిఎస్, ఎస్‌బిఐ కేపిటల్, హెచ్‌డిఎఫ్‌సి ఉన్నాయని తెలిసింది. ప్రతి ఐపిఒలో భాగంగా కొత్త షేర్ల జారీ, ప్రస్తుత వాటాదార్ల షేర్ల విక్రయం ద్వారా రూ.4వేల కోట్లను సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. హీరో ఫిన్‌కార్ప్‌లో హీరో మోటోకార్ప్ సంస్థకు 40శాతం వాటా ఉంది. ముంజల్ కుటుంబం చేతిలో 35-39 శాతం వాటా ఉండగా, అపోలో గ్లోబల్, క్రిస్ కేపిటల్, క్రెడిట్ సూయిజ్, హీరో మోటో కార్ప్‌కు చెందిన కొన్ని డీలర్ల సంస్థల వద్ద మిగిలిన వాటా ఉంది. 1991లో హీరో ఫిన్‌కార్ప్ బ్యాంకింగేతర ఆర్థిక సేవల కంపెనీగా ఏర్పడింది.



## జొమాటోతో ఐఆర్‌సిటిసి టైఅప్

**ముంబై, అక్టోబరు 18:** రైల్వే ప్రయాణికులకు ఆహారం అం దించే విషయంలో మరిన్ని ఆప్షన్ల ను కల్పించేందుకు ఐఆర్‌సిటిసి సిద్ధ మైంది. ప్రయాణికులు ముందుగా ఆర్డర్ చేసిన ఆహార పదార్థాలను తెప్పించేందుకు ఫుడ్ డెలివరీ యాప్ జొమాటోతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ప్రస్తుతానికి ఈ సదుపాయాన్ని ఐదు స్టేషన్లకు మాత్రమే పరిమితం చేసింది. రానున్న రోజుల్లో మరిన్ని స్టేషన్లకూ విస్తరించే అవకాశం ఉంది. ఐఆర్‌సిటిసికి చెందిన ఇ-క్యాటరింగ్ సేవల కింద ప్రయాణికులు తమకు నచ్చిన ఆహారాన్ని ఆర్డర్‌చేసుకోవచ్చు. వారిని జొమాటో సాయంతో ఆయా స్టేషన్లలో వారికి అందచేస్తారు. 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్' కింద ప్రస్తు తానికి దీన్ని న్యూఢిల్లీ, ప్రయాగ్‌రాజ్, కాన్పూర్, లక్నో, వారణాసి రైల్వే స్టేషన్లలో అమలు చేయనున్నారు. ఆహారం విషయంలో ప్రయాణికులకు ఎక్కువ ఆప్షన్‌ను అందించడంలో భాగంగా జొమాటోతో చేతులు కలిపినట్లు ఐఆర్‌సిటిసి తెలిపింది. మరోవైపు పండుగ సీజన్ నేపథ్యంలో రైల్వే క్యాటరింగ్ సర్వీస్ ప్రత్యేక సేవ లు, ఆఫర్లతో ముందుకు వచ్చిన విషయం విదితమే. నవరాత్రి సందర్భంగా ఉపవాసం చేసే వారి కోసం ప్రత్యేక 'థాలీ'ని అంది స్తోంది. ఈ నేపథ్యంలో జొమాటో షేరు బుధవారం ఆరంభంలో రూ.115వద్ద యేడాది గరిష్టానికిచేరింది. కానీ గరిష్టాల వద్ద అమ్మ కాల సెగతో తిరిగి నష్టాల్లోకి జారుకుంది. మరోవైపు ఐఆర్‌సిటిసి షేరు రూ.700 వద్ద దాదాపు రెండుశాతం నష్టాల్లో ట్రేడవుతోంది.

## బాస్మతీయేతర బియ్యం ఎగుమతులకు గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** బాస్మతీయేతర బియ్యాన్ని మరో ఏడు దేశాలకు ఎగుమతి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నేపాల్, కామెరూన్, కోట్ డి ఐవోయిర్, రిపబ్లిక్‌ఆఫ్ గినియా, మలేషియా, పిలిప్పీన్స్, సీషెల్స్‌లకు బాస్మతీయేతర తెల్ల బియ్యాన్ని వివిధ పరి మాణాలలో ఎగుమతి చేయడానికి అనుమతించింది. ముఖ్యంగా దేశీయంగా ధరలను అదుపు చేసేందుకు, దేశీయ ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని జులై 20 నుంచి బాస్మతీయేతర తెల్లబియ్యం ఎగుమతి నిషేధించ బడింది. తాజాగా ఏడు దేశాలకు 10,34,800 టన్నుల బాస్మతీయేతర బియ్యాన్ని ఎగుమతి చేసుకోవచ్చునని, నేషనల్ కోఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ కింద వీటిని అనుమతిస్తున్నట్లు డిజిఎఫ్‌టి తెలిపింది. పలు దేశాల ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక అనుమతులకు జారీచేసింది. ఇంతకుముందు యుఎఇ, సింగపూర్‌లకు బాస్మతీయేతర తెల్లబియ్యం ఎగుమతి చేసేందుకు భారత్ అనుమతించింది. గతవారం కేంద్ర ప్రభుత్వం పారాబాయిల్డ్ రైస్‌పై 20శాతం ఎగుమతి సుంకాన్ని మార్చి 31, 2024 వరకు పొడిగించింది. పొట్టుతో పాక్షికంగా ఉడకబెట్టిన బియ్యాన్ని పారాబాయిల్డ్ రైస్ అంటారు. ఇక 2022 సెప్టెంబర్‌లో భారత్ బ్రోకెన్ రైస్ ఎగుమతులను నిషేధించింది. వరి పంట కింద విస్తీర్ణం తగ్గడం వల్ల తక్కువ ఉత్పత్తి గురించి ఆందోళనల మధ్య పారాబాయిల్డ్ రైస్ మినహా బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై 20శాతం సుంకం విధించింది. ఆ తర్వాత నవంబర్‌లో నిషేధాన్ని ఎత్తివేసింది.



## చక్కెర ఎగుమతులపై ఆంక్షల పొడిగింపు

**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** ప్రభుత్వం మరోసారి చక్కెర ఎగుమతులపై ఆంక్ష లను పొడిగించింది. గతంలో విధించిన గడువు అక్టోబర్ 31 తర్వాత కూడా ఆంక్షలు కొనసాగుతాయని తెలిపింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఇవి అమల్లో ఉంటాయని పేర్కొంది. పండుగ సీజన్ నేపథ్యంలో దేశీయంగా తగినన్ని చక్కెర నిల్వలను అందుబాటులో ఉంచాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు 'డైరెక్టరేట్ ఆఫ్ పారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి)' బుధవారం వెల్లడించింది. ముడి చక్కెర, వైట్ షుగర్, రిఫైన్డ్ షుగర్,



ఆర్గానిక్ షుగర్‌పై ఆంక్షలు ఉంటాయని గుర్తుచేసింది. సిఎక్స్ఎల్, టిఆర్‌క్యూ కింద సుంకాల మినహాయింపు ద్వారా ఐరోపా సమాఖ్య, అమెరికాకు చేసే చక్కెర ఉత్పత్తిదారు. అలాగే రెండో అతిపెద్ద చక్కెర ఎగుమతిదారు. విదేశాలకు చక్కెరను ఎగుమతి చేయాలంటే వ్యాపారులకు ప్రత్యేకంగా లైసెన్స్ ఉండాలి. గత కొంతకాలంగా చక్కెర ఉత్పత్తి, నిల్వలు, సరఫరా, ఎగుమతులపై ప్రభుత్వం దృష్టిసారించింది. వర్షాభావ పరిస్థితులు వల్ల ఈ యేడాది చక్కెర ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందనే అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో ధరల్ని నియంత్రించడం కోసం ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. మరోవైపు నిల్వల వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని ఇటీవలే వ్యాపారులను కేంద్రం ఆదేశించిన విషయం విదితమే.

# బిఆర్ఎస్ సర్కార్ అన్ని రంగాల్లో విఫలం

### ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారు: బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బిజెపిలో చేరిన పలువురు నేతలు



**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న బిఆర్ఎస్ సర్కార్ అన్ని రంగాలలో వైఫల్యం చెందిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, కార్యవర్గ సభ్యులు వివేక్‌వెంటకస్వామి సమక్షంలో పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం లోని పాలకుర్తి జెడ్‌పిటిసి సభ్యురాలు కందుల సంధ్యారాణి ఆమె అను చరులతో పెద్దపల్లి, రామగుండానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి జెడ్‌పిటిసి సభ్యురాలు కందుల సంధ్యారాణిని బిజెపిలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల దృష్ట్యా బిఆర్ఎస్ పార్టీ కేవలం డబ్బులపైనే ఆధారపడిం దన్నారు. రాష్ట్రాభివృద్ధిపై బిఆర్ఎస్ నాయకులు మాట్లాడటం లేదన్నారు. నెరవేర్చిన హామీలు ఏంటనేవి ప్రజలకు వివరించి ఎన్నికలకు రావాలన్నారు. ఇచ్చిన హామీలు ఏవి అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ, రుణమాఫీ, దళితబంధు, గిరిజన బంధు, దళితులకు మూడు ఎకరాల భూమి వంటి హామీలను నెరవేర్చకుండా అబద్దాలు ప్రచారం చేస్తున్నారన్నారు. మహిళా పొదుపు సంఘాలకు పావలా వడ్డీ రుణాలు ఇవ్వడం లేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీని అటకెక్కించారన్నారు. విద్యా, వైద్య రంగానికి బడ్జెట్‌లో నిధులను తగ్గించారన్నారు. బిఆర్ఎస్ సర్కారు అన్ని రంగాలలో వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్రంలో యువత, ప్రజలు నిశ్శబ్ద వాతావరణంలో రానున్న ఎన్నికల్లో బిజెపికి ఓటు వేసి బిఆర్ఎస్‌కు బుద్దిచెప్తారన్నారు. తమ నిర్లక్ష్యం, అసమర్థతతో ఉద్యోగాలు భర్తీ చేయకుండా పేపర్ లీకేజీలకు కారణమైన యువత, నిరుద్యోగులను వెన్నుపోటు పొడిచిందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ ముఖం పెట్టుకుని తెలంగాణకు వస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో నీళ్ళు, నిధులు, నియామకాలలో అన్యాయం జరిగిందని అందుకే తెలంగాణ ఉద్యమం కొనసాగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర మొత్తం అవినీతి మయం అన్నారు. కాంగ్రెస్ నాయకులకు తెలంగాణాలో పర్యటించే నైతిక హక్కులేదన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ కుటుంబ పార్టీలే, తెలంగాణలో కుటుంబ, అవినీతి పార్టీల చీడ వదలాలి అన్నారు. బిఆర్ఎస్ పాలనలో కెసిఆర్ కుటుంబం, మాఫియా తెలంగాణను దోచుకుందన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ది చెప్పాలని, ఓడించాలని తెలంగాణ సమాజం భావిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి సారథ్యంలో ప్రభుత్వం నీతివంతమైన పాలనను అందిస్తుందన్నారు. ప్రధాని చెసేదే చెప్తారు, చెప్పిందే చేస్తారన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ గత నెలల్లోనే పన్నుల పేరుతో వేలకోట్ల రూపాయలను ప్రజల నుంచి దండుకుందన్నారు. వందల కోట్ల రూపాయలను తెలంగాణాకు పంపించేందుకు టాక్స్‌లు, వాటాల పేరుతో కర్ణాట ప్రజల నుంచి వసూలు చేస్తునానరన్నారు. దేశం కోసం బడుగు బలహీన వర్గాల నప్రజల కోసం నరేంద్రమోడి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని, మద్దతు కూడగట్టి ప్రజల ఆశీస్సులో బిజెపి జెండా ఎగురవేస్తామన్నారు. సకల జనుల తెలంగాణను సాధిస్తామన్నారు. కార్యవర్గ సభ్యులు వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ పాలకుర్తి జెడ్‌పిటిసి సభ్యులురాలు కందుల సంధ్యారాణి అనేక ఉద్యమాల్లో పాల్గొని రాజకీయాల్లో మంచిపేరు సంపాదించుకున్నారన్నారు. బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి బిజెపిలో చేరడం పార్టీ బలోపేతానికి దోహదమవుతుందన్నారు.



వైష్ణవి కన్‌స్ట్రక్షన్ నుంచి లంచం తీసుకుని దొరికిన రాచులూరు పంచాయతీ కార్యదర్శి దేరంగుల ప్రవీణ్, ఎంపిఓ కళ్యాణి,

## ఎసిబి అధికారులకు చిక్కిన పంచాయతీ ఉద్యోగులు

### రూ.2.50 లక్షల లంచం తీసుకుంటుండగా పట్టివేత

**కందుకూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** రెడిమిక్స్ వ్యాపారివద్దనుండి అధికారి ప్రోద్బలంతో రూ 2.50 లక్షల లంచం తీసుకుంటు పంచాయతీ కార్యదర్శి ఎసిబి అధికారులకు రెడ్ హండెడ్‌గా దొరికిపోయారు. బుధవారం కందుకూరు మండలం రాచులూరు గ్రామంలో జరిగిన ఈ సంఘటన ఎసిబి డిఎస్‌పి కె బద్రయ్య కథనం ప్రకారం మండల పరిదిలోని రాచులూరు గ్రామంలో వైష్ణవి కన్‌స్ట్రక్షన్ యజమాని మదుసూదన్‌రెడ్డి 2022 సంవత్సరంలో సంబందిత శాఖల వారినుండి అనుమతులు తీసుకుని రెడిమిక్స్ పరిశ్రమను నెలకొల్పి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి దేరంగుల నరేందర్, మండల పంచాయతీ అధికారి కళ్యాణి ఇద్దరు కలిసి దురాశతో వైష్ణవి కన్‌స్ట్రక్షన్ వారితో గత రెండు నెలలుగా సరైన పత్రాలు లేవని పరిశ్రమను నిలిపివేయాలని హెచ్చరిస్తూ రూ 5 లక్షలు ఇవ్వాలని మధుసూదన్‌రెడ్డి కి సూచించగా పరిశ్రమ నష్టాల బాటలో నడుస్తుందని అనుమతులు ఉన్నాయని మీరు అడిగినంత ముడుపులు ఇవ్వలేనని విన్నవించుకోగా కనీసం రూ 3.50 లక్షలైనా ఇవ్వాలని లేదంటే కుదరదని వత్తిడి పెంచారు. చివరకు రూ 2.50 లక్షలు ఇవ్వడానికి బేరం కుదుర్చుకున్నారు. ఈ విషయాన్ని సదరు యజమాని ఈ నెల 11 వతేదీన అవినీతి నిరోధక అధికారులను ఆశ్రయించగా వాస్తవాలను గుర్తించి ఎసిబి అధికారులు రంగంలోకిదిగి పంచాయతీ కార్యదర్శి దేరంగుల నరేందర్ రూ 2.50 లక్షల రూపాయలు తీసుకోగా పట్టుకున్నారు. నరేందర్ అందించిన సమాచారందో పంచాయతీ అధికారిని కళ్యాణిని సహితం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎసిబి డిఎస్‌పి కె బద్రయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనిస్పెక్టర్లు ప్రశాంత్, సతీష్, నరేష్ లతోపాటు సిబ్బందితో పాటు కొత్తగా వచ్చిన డిఎల్‌పిఓ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## త్వరలో వైఎస్సార్‌టిపిలోకి మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా సీనియర్ నాయకురాలు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత త్వరలో వైఎస్సార్ తెలంగాణ పార్టీలోకి చేరనున్నారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌టిపి అధికార ప్రతినిధి నీలం రమేష్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పార్టీ చేరాలని ఆకుల లలితను రమేష్ ఆహ్వానించారు. వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆహ్వానాన్ని ఆకుల లలిత స్వాగతించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పార్టీలో చేరే అంశంపై త్వరలోనే తమ నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు ఆకుల లలిత తెలిపారు.




## మా మొదటి సంతకం ఉద్యోగ క్యాలెండర్‌పైనే

### తొందరలోనే మా పార్టీ అభ్యర్థుల లిస్టులు విడుదల చేస్తాం

### వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధికార ప్రతినిధి పిట్టా రామిరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ఎదుర్కొనే ఒకే ఒక్క నాయకురాలు మా పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మాత్రమే అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధికార ప్రతినిధి పిట్టా రామిరెడ్డి అన్నారు. బుధవారం లోటస్ పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ తెలంగాణ పార్టీ ప్రభంజనం సృష్టించబోతుందన్నారు. మా మొదటి సంతకం ఉద్యోగ క్యాలెండర్‌పైనే ఉంటుందన్నారు. మంత్రి కెటిఆర్‌న సోయి లేకుండా మాట్లాడుతున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలు కెసిఆర్‌కు బుద్ధి చెప్తారన్నారు. గత నాలుగు రోజులుగా తమ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థులకు సంబందించి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి 377 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఒక్క ఎల్‌బినగర్ నుంచి 10 దరఖాస్తులు వచ్చాయన్నారు. తాము అభ్యర్థులు జాబితా ప్రకటన తరువాత, బహిరంగ సభ తేదీలు తెలియజేస్తామన్నారు. రాష్ట్రమంతటా మా అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సుడిగాలి పర్యటన చేస్తారన్నారు.

## బిజెపి ఆదేశిస్తే కామారెడ్డి నుంచి బరిలో ఉంటా: విజయశాంతి

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశ్యం తనకు లేదని, వ్యూహాత్మక నిర్ణయాలు ఎన్నడైనా పార్టీ నిర్దేశితమే అన్నది వాస్తవం అని బిజెపి సీనియర్ నేత విజయశాంతి అన్నారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. కామారెడ్డి నుంచి తాను, గజ్వేల్‌లో బండి సంజయ్ సంజయ్ పోటీ అంటూ ట్వీట్ చేశారు. బిఆర్ఎస్‌పై రాజీలేని పోరాటం చేయడంలో బిజెపి వెనక్కు తగ్గదన్నారు. అది కార్యకర్తల విశ్వాసం అన్నారు. అందుకు గజ్వేల్ నుంచి బండి సంజయ్, కామారెడ్డి నుంచి తాను అసెంబ్లీకి కెసిఆర్‌పై పోటీ చేయాలని గత కొన్ని రోజుల మీడియాలో వస్తున్న సమాచారం దృష్ట్యా కార్యకర్తలు అడగటం తప్పు కాదన్నారు. అయితే తనకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశ్యం తనకు లేదని ట్వీట్ చేశారు.

# ప్రపంచంలోనే హైదరాబాద్ అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతం

### వాషింగ్టన్ డిసిలో జరిగిన యునైటెడ్ నేషన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఈవెంట్ మేయర్ విజయలక్ష్మి ప్రసంగం

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావా నంతరం ప్రపంచంలోనే హైదరాబాద్ నగరం అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతంగా రూపొందిందని ప్రపంచ దేశాలు హైదరాబాద్ నగరంలో ఐటి సంస్థల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నాయని మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. బుధవారం వాషింగ్టన్ డిసిలో జరిగిన యునైటెడ్ నేషన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఈవెంట్‌లో మేయర్ ప్రత్యేక వక్తగా పాల్గొని ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో తెలంగాణాకు హరితహారంకు సంబంధించిన విషయాలను వివరించారు. నగరంలో రహదారుల వెంట సెంట్రల్ మీడియన్‌లో విస్తృతంగా మొక్కలు నాటడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, పాఠశాలల్లో, కళాశాలలు, యూనివర్సిటీ, ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున పచ్చదనం పెపొందించడంతో పాటు ట్రీ పార్కులు, పంచతత్వ పార్కులు, మేజర్ పార్కులు అభివృద్ధి, కాలనీ పార్కులలో విరివిగా మొక్కలు నాటడం, ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కలు పంపిణీ చేయడం, ఫ్లైఓవర్‌ల కింద గార్డెన్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సిఎం కెసిఆర్ మార్గదర్శకత్వంలో జిహెచ్‌ఎంసి అడవుల పెంపకం డ్రైవ్‌లు, పట్టణ ప్రాంతాల్లో వర్టికల్ గార్డెనింగ్, పర్యావరణ అనుకూల వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్దతులతో పాటు అనేక ప్రగతిశీల చర్యలు అమలు చేశామన్నారు. ఈ ప్రయత్నాలు నగరాల సౌందర్య ఆకర్షను మెరుగుపరచడమే కాకుండా వాతావరణ మార్పులు ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో కూడా గణనీయంగా దోహదపడ్డాయన్నారు. వాతావరణ మార్పు, పార్యవరణ క్షీణత సవాళ్లను పరిష్కరించడంలో సామూహిక ప్రపంచ చర్య ప్రాముఖ్యతను ఈ సందర్భంగా మేయర్ వివరించారు. స్థిరమైన పట్టణ ప్రణాళిక, సమాజ, భవిష్యత్తు తరాలకు పచ్చని ఆరోగ్య కరమైన వాతావరణాన్ని సృష్టించంలో పౌరుల చురుకైన ప్రమేయం అవసరం అన్నారు. హైదరాబాద్ నగరం అద్భుతమైన విజయాలను ప్రదర్శించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధికి, నగరాల నిబద్ధతను కూడా నొక్కి చెప్పిందన్నారు. పచ్చని, మరింత స్థిరమైన భవిష్యత్తును సృష్టించడంలో హైదరాబాద్ సాధించిన విజయాన్ని అనుకరించే విధంగా ప్రపంచ వ్యాప్త సమాజాన్ని ప్రేరేపిస్తుందన్నారు.



పట్టబడిన గంజాయి వివరాలను వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

## 12కిలోల గంజాయి పట్టివేత

### నిందితుడు అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

**ఆమనగల్లు, అక్టోబర్18, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణం మీదుగా ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని విశ్వసనీయమైన సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. 12.531 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు. గురువారం ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఎస్సై బల్‌రాంనాయక్‌తో కలిసి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెళ్ళడించారు. మంచిర్యాల జిల్లాకు చెందిన బెల్లంపల్లి గ్రామానికి చెందిన బైరి శ్రీనివాస్(42) వైజాగ్ ప్రాంతంలోని శ్రీలత వద్ద గంజాయిని కొనుగోలు చేసి కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరుకు చెందిన ఉమేశ్‌కు విక్రయించడానికి హైదరాబాద్‌నుండి ఆమనగల్లు మీదుగా ఆర్టీసీ బస్సులో వెళుతుండగా పోలీసులకు సమాచారం అందడంతో సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై బల్‌రాంనాయక్, సిబ్బందితో కలిసి బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. దీంతో బైరి శ్రీనివాస్ వద్ద ఉన్న 12.531 కిలోల గంజాయి పట్టుబడింది. బైరి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సిఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. గంజాయి స్మగ్లింగ్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో పోలీసులు బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## దొరసానిలా వ్యవహరిస్తున్న కవిత: ఎంపి ధర్మపురి అరవింద్

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కవితపై ఎంపి ధర్మపురి అరవింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత దొరసాని తరహాలో వ్యవహరిస్తుందని వ్యాఖ్యానించారు. మా ఇంటిపై మీ గుండాలను పంపినప్పుడు ఆడపడుచులు గుర్తుకు రాలేదా అంటూ ప్రశ్నించారు. ఆ రోజు మా అమ్మ ఒక్కతే ఇంట్లో ఉన్న సంగతి తెలిసే గుండాలను, బ్రోకర్‌లను దాడికి పంపించావన్నారు. కరోనాతో తెలంగాణ ప్రజలు లక్షల ఖర్చుచేసినప్పుడు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అప్పుడు ప్రజలకు ఒక్క రూపాయి అయినా సహాయం చేశారా అంటూ ప్రశ్నించారు. మనిషి బతికున్న ప్పుడు సాయం చేయరు కానీ, చనిపోతే రూ.5లక్షల రూపాయలు భీమా చేస్తారా అంటూ ప్రశ్నించారు.

# దసరా సందర్భంగా లాట్ మొబైల్స్ ఆఫర్లు

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** దసరా పండుగ సందర్భంగా అగ్రశ్రేణి మొబైల్ ఫోన్ల రిటైల్ చైన్ లాట్ మొబైల్స్ అపురూపమైన ఆఫర్లను ప్రకటించింది. దసరా సంబరాలను లాట్‌తో జరుపుకోండి అనే పిలుపునిస్తూ ఖాతాదారులకు వినూత్నమైన ఆఫర్లను ఇస్తున్నట్లు సంస్థ డైరక్టర్ ఎం అచల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోళ్లపై కచ్చితమైన బహుమతితో పాటు, 10,000 రూపాయల వరకూ క్యాష్ బ్యాక్ ఇస్తున్నామన్నారు. నిర్దిష్టమైన మోడల్ మొబైల్స్, ఇతర వస్తువుల కొనుగోళ్లపై జీరో డౌన్ పేమెంటేతో కూడిన రుణ సదుపాయాన్ని, 24 నెలలో కూడిన నో కాస్ట్ ఇఎమ్ఐ, లో కాస్ట్ ఇఎమ్‌ఐను కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఇంతేకాకుండా 999 రూపాయల కే స్మార్ట్ వాచ్, సౌండ్ బార్ ఊఫర్‌తో కూడిన స్మార్ట్ టీవీ కాంబో మరియు, అన్ని బ్రాండెడ్ యాక్సెసరీలు, ఇతర వస్తువుల కొనుగోళ్లపై 60 శాతం వరకూ తక్షణ డిస్కౌంట్ కూడా అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెలలో మార్కెట్‌లోకి వచ్చిన అధునాతన వివో వి29 సీరిస. మొబైల్స్‌పై ప్రత్యేక ఆఫర్‌ను అందిస్తున్నామన్నారు. సంస్థ మరో డైరక్టర్ సుప్రజ మాట్లాడుతూ తమ షోరూమ్‌లలో బ్రాండెడ్ స్మార్ట్ టీవీలు 8,999 రూపాయల ప్రారంభ ధర నుండి లభ్యమవుతాయన్నారు. అలాగే విస్తృత శ్రేణిలో బ్రాండెడ్ ఎయిర్ కండిషనర్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు క్యాష్ బ్యాక్ ఆఫర్లతో లభ్యమవుతాయని తెలిపారు. అలాగే స్మార్ట్ మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్ టాప్‌లపై స్మార్ట్ ప్రొటెక్షన్ ప్లాన్లు, ఎక్స్ ట్రా వారంటీ ఆఫర్లు అందిస్తున్నామని చెప్పారు. ప్రతీ స్మార్ట్ ఫోన్, స్మార్ట్ టీవీ, ఎయిర్ కండిషనర్, ల్యాఫ్ టాప్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి తో పాటు, 10 వేల రూపాయల వంకూ క్యాష్ బ్యాక్, 24 నెలల వరకూ జీరో డౌన్ పేమెంట్‌తో కూడిన నో కాస్ట్ ఇఎమ్ఐ ఫైనాన్స్ సదుపాయం, బ్రాండెడ్ యాక్సెసరీలు, స్మార్ట్ గ్యాడ్జెట్స్ కొనుగోలుపై 60 శాతం వరకూ తక్షణ డిస్కౌంట్, స్మార్ట్ టీవీ కొనుగోలుపై 17, 999 రూపాయల విలువగల సౌండ్ బార్ ఊఫర్ కేవలం 5,999 రూపాయలకు, బ్రాండెడ్ స్మార్ట్ వాచ్‌లపై ప్రత్యేక ఆఫర్ 999 రూపాయలకు లభ్యమవుతాయని తెలిపారు. ఏటీఎం, డెబిట్ కార్డుపై 1రూపాయి డౌన్ పేమెంట్‌సదుపాయం, పేటీఎం, వ్యాలెట్ చెల్లింపులపై 5 శాతం వరకూ తక్షణ క్యాష్ బ్యాక్ ఆఫర్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.



దసరా ఆఫర్లను ఆవిష్కరిస్తున్న లాట్ సంస్థ డైరెక్టర్ శ్రీ యం. అఖిల్ మరియు లాట్ బ్రాండ్ అంబాసిడర్ రష్మిక మందాన

## సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల బంద్

### ఆందోళనలో రైతాంగం

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నుండి నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. దీంతో సాగర్ ఆయకట్టు రైతాంగం ఆందోళన చెందుతోంది. వానాకాలం సాగు నిమిత్తం సాగర్ నుండి పది రోజుల పాటు అధికారులు నీటిని విడుదల చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలో ప్రస్తుతంవరి పంట అత్యధిక శాతం పొట్ట దశలో ఉంది. భూగర్భ జలాలు అంతంత మాత్రంగానే ఉండగా, మరో వైపు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. దీనికి తగినట్లుగా ఇప్పుడు సాగర్ నీటి విడుదలనుకూడా నిలిపేవయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగర్ ఎడమ కాల్వ కింద దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఇందులో ముందస్తుగా దాదాపు 80 వేల ఎకరాల్లో నాట్లు వేయగా, అవి వరిఈత, గింజ పోసుకునే దశలో ఉన్నాయి. మరో 1.20 లక్షల ఎకరాల్లో ఆలస్యంగా నాట్లు వేయడంతో అవి చిరు పొట్ట దశలో ఉన్నాయి. వీటికి దాదాపు నవంబరు మొదటి వారం వరకూ నీరు అవసరం ఉంటుంది. అయితే పది రోజులుగా విడుదల చేసిన నీరుతో ఎండిపోతున్న పంటలను చాలా వరకూ రైతులు కాపాడుకున్నారు. కాల్వ చివరి ప్రాంతాలకు మినహా ముందున్న రైతులు తమ పంటలకు కొంత వరకూ తడులు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో నీటి సరఫరాను నిలిపివేయ డంతో పంటలు ఎండిపోయి దిగుబడులురావని రైతులు చెబుతున్నారు. ఆరుగాలం పడిన కష్టం, పెట్టిన పెట్టుబడి వృధా అవుతుందని రైతులు వాపోతున్నారు.

## బియ్యం ఎగుమతికి కేంద్రం అనుమతి

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** బాస్మతీయేతర బియ్యాన్ని మరో ఏడు దేశాలకు ఎగుమతి చేసేందుకు కేంద్రం అనుమతినిచ్చింది. నేపాల్, మలేషియా, ఫజలిప్పీన్స్, సీషెల్స్, కామెరూన్, కోట్ డిఐవోయిర్, రిపబ్లిక్ ఆఫ్ గినియాలకు బాస్మతీయేతర తెల్ల బియ్యాన్ని వివిధ పరిమాణాలో ఎగుమతి చేసేందుకు నిర్ణయించింది. ముఖ్యంగా దేశీయంగా ధరలను అదుపు చేసేందుకు, దేశీయ ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకుని జూలై 20వ తేదీ నుండి బాస్మతీయేతర తెల్ల బియ్యాం ఎగుమతి నిషేధించింది. తాజాగా ఈ ఏడు దేశాలకు 10,34,800 టన్నులు బాస్మతీయేతర బియ్యాన్ని ఎగుమతి చేసుకోవచ్చని, నేషనల్ కోపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ కింద వీటిని అనుమతిస్తున్నట్లు తెలిపింది.

## రూ.16,38,350 నగదు సీజ్

### జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ ద్వారా బుధవారం రూ.16,38,350 నగదు సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇప్పటి వరకు 1,00, 08,250 నగదును సీజ్ చేశారన్నారు. పోలీసు అథారిటీగా ద్వారా రూ.4,28,73,433 సీజ్ చేయగా ఇప్పటి వరకు రూ.23,70,08,115 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఎఫ్ఐఆర్‌లు ఇప్పటి వరకు 20 నమోదు కాగా 178 కేసు నమోదు అయినట్లు తెలిపారు. లా అండ్ ఆర్డర్ కింద లైసెన్సు ఆయుధాల బుధవారం 486 సేకరించగా, ఇప్పటి వరకు 3923 ఆయుధాలను సేకరించినట్లు తెలిపారు. సిఆర్‌పిసి కింద బుధవారం 86 కేసులు ఉండగా, ఇప్పటి వరకు 281 కేసులు నమోదు అయ్యాయన్నారు. బుధవారం 246 బైండోవర్లు చేయగా మొత్తం 789 బైండోవర్ చేసినట్లు తెలిపారు. నక్కాస్ 64 నమోదు కాగా ఇప్పటి వరకు 447 నమోదు అయ్యాయి. నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు 82 కాగా మొత్తం 351 కేసులు నమోదు అయ్యాయి. ఎంసిసి ఉల్లంఘన కింద ఒక కేసు నమోదు కాగా, పబ్లిక్ ప్రాపర్టీస్‌లో బుధవారం 63 వాల్ రైటింగ్‌ను తొలగించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా సభలు, సమవేశాలు ఒక నిర్వహించగా, మొత్తం ఏడు నిర్వహించడం జరిగిందన్నారు. ఎఫ్ఐఆర్ 1 నమోదు కాగా ఇప్పటి వరకు ఏడు నమోదు అయ్యాయి. ఎక్సైజ్‌శాఖ ద్వారా బుధవారం 1591 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేయడం జరిగిందన్నారు.

## బోథ్ ఎంఎల్ఎ బాపూరావు రాథోడ్‌పై చీటింగ్ కేసు నమోదు

**హైదరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బోథ్ ఎంఎల్ఎ బాపూరావు రాథోడ్‌పై కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చే శారు. 2012లో బాపూరావు రాథోడ్ విక్రయించిన రెండు ఇళ్ల స్థలాలను ఆయన రెండసారి అమ్మారని ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖ లు చేశారు. దీనిపై విచారించిన కోర్టు బాపూరావు రాథోడ్‌పై చీటింగ్ కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో పో లీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా బిఆర్ఎస్‌కు చెందిన బాపూరావు రాథోడ్‌కు ఆ పార్టీ ఎంఎల్ఎ టికెట్ నిరాకరించడం తెలిసిందే. దీందో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడం విదితమే. ఈ నేపథ్యంలో రాథోడ్‌పై బుధవారం నాడు చీటింగ్ కేసు నమోదవడం సంచలనం రేపింది.

## నల్లగొండ డిసిఎంఎస్ చైర్మన్ జానయ్యకు పదవీ గండం

### ఇప్పటికే సూర్యాపేట్ పీఏసీఎస్ చైర్మన్ నుండి తొలగింపు

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** సహకార మార్కెటింగ్ ఫెడరేషన్ (డీసీఎంఎస్) నల్లగొండ జిల్లా చైర్మన్ జానయ్యకు పదవీ గండం ఏర్పడింది. ఆయన చైర్మన్‌గా కొనసాగుతున్న సూర్యాపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పాలకవర్గాన్ని తెలంగాణ సర్కార్ రద్దు చేసింది. దీంతో డీసీఎంఎస్ చైర్మన్ పదవిపై దాని ప్రభావం పడింది. సూర్యాపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఏడాదిగా పాలకమండలి సమావేశాన్ని నిర్వహిండం లేదన దానిపై సహకార శాఖ అధికారులు పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పీఏసీఎస్ చైర్మన్ పదవి రద్దు కావడంతో డీసీఎంఎస్ పదవి నుండి ఆయన్ను తొలించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. నేడో రేపే దీనికి సంబంధించి సహకార శాఖనుండి నోటీసులుపంపించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. డీసీఎంఎస్ చైర్మన్‌పదవి నుండి ఎందుకు తొలగించకూడతో సమాధానం ఇవ్వాలంటూ నోటీసు ఇవ్వనున్నారు. జానయ్య పదవిని కోల్పోయినట్లయితే సహకార శాఖ కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. లేదంటే ప్రస్తుతం డీసీఎంఎస్ ఉపాధ్యక్ష పదవిలో ఉన్న వారికి చైర్మన్ బాధ్యతలను అప్పగించే అవకాశాలు ఉన్నట్లు సహకారశాఖఅధికారులు చెబుతున్నారు. కాగా ఈ పరిణామాల నేపథ్యంలో జానయ్య కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుత్నుట్లు తెలుస్తోంది.

# రాష్ట్రంలో అద్దంలా మారనున్న రహదారులు

### వర్షాలు, వరదలకు దెబ్బతిన్న 6641 కి.మీ రోడ్లు

### మరమ్మతులకు రూ.2500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

### ఇప్పటికే 50 శాతం పూర్తి, పురోగతిలో రూ.1300 కోట్ల పనులు

### వచ్చే యేడాది జనవరి నాటికి మిగతా పనులు పూర్తి ఆర్అండ్‌బి శాఖ లక్ష్యం

**హైదరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** తెలంగాణలో రోడ్డు ప్రయాణం మరింత సాఫీగా సాగేందుకు రోడ్లు, భవనాల శాఖ విస్తృత చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రాలు, పట్టణాలు, మండల కేంద్రాలను కలిపే రోడ్లపై ఎక్కడా గుంతలు లేకుండా పనులు చేపడు తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 6641 కి.మీ.ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో కల్వర్టులు కూడా దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులకు రూ.1823 కోట్లు, కల్వర్టుల మరమ్మత్తుల కోసం రూ.544 కోట్లు వ్యయం అవుతుందని ఆర్అండ్‌బి శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలు సంబంధిత శాఖ అధికారులు ప్రభుత్వానికి అందజేయగా, అంచనా వ్యయం కంటే అధికంగానే సీఎం కేసీఆర్ ఈ పనుల కోసం రూ.2500 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గత జూలై నుంచే రోడ్లు, భవనాల శాఖ అధికారులు మరమ్మత్తు పనులు చేపట్టారు. వచ్చే ఏడాది జనవరి చివరి నాటికి ఈ పనులన్నింటినీ పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీంతో ఇప్పటికే దాదాపు 50 శాతం మరమ్మత్తు పనులు అంటే రూ.1200 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. మరో రూ.1300 కోట్ల పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. కాగా, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో రోడ్ల మరమ్మత్తుల కోసం ప్రభుత్వం 1170 పనులను మంజూరు చేయగా, వీటిలో దాదాపు 600 పనులు ఇప్పటికే పూర్తి కాగా, మరో 450 పనులు పురోగతిలో ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 174 పనులు, వరంగల్‌లో 162, నల్గొండలో 138, ఖమ్మంలో 134 పనులు చేపట్టగా ఈ నాలుగు జిల్లాలలో కలిపి దాదాపు 60 శాతం, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, రూరల్ రీజియన్‌తో పాటు నిజామాబాద్ తదితర జిల్లాలలో 35 శాతం వరకు పనులు పూర్తయినట్లు ఆర్అండ్‌బి అధికారులు తెలిపారు.

ఇక ఇప్పటికే మరమ్మత్తులు ప్రారంభించిన పనుల్లో 50 శాతానికి పైగా పనులు పూర్తి కాగా, మిగిలిన మరో 450 పనుల్లో చాలా వరకు తుది దశకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో సగానికి పైగా పనులు మరో నెల రోజుల్లో పూర్తవుతా యని పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల 129 పనులు చేపట్టడంలో జాప్యం చోటు చేసుకున్నదనీ, ప్రస్తుతం ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నదని వివరించారు. మొత్తం పనులన్నీ వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు.

## ఐసీఐసీఐ, కోటక్ మహీంద్రాలకు రిజర్వ్ బ్యాంక్ జరిమానా

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** ప్రైవేటు రంగంలోని ఐసీఐసీఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ షాక్ ఇచ్చింది. నిబంధనలను ఉల్లంఘించినందు గాను వాటిపై కొరడా ఝుళిపించింది. రెగ్యులేటరీ నిబంధనలు పాటించనందుకు ఈ రెండు బ్యాంకులకు భారీగా జరిమానా విధించింది. ఐసీఐసీఐ బ్యాంక్‌కు 12.19 కోట్ల రూపాయలు, కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు 3.95 కోట్ల రూపాయలు చొప్పున జరిమానా వేసింది. కమర్షియల్ బ్యాంకుల రిపోర్టింగ్‌కు సంబంధించి తాము జారీ చేసిన నిబంధనలు పాటించనందుకు ఐసీఐసీఐ బ్యాంక్‌కు జరిమానా విధించినట్లు రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. అంతేకాకుండా రుణాల అడ్వాన్సులు, చట్టబద్ధమైన ఇతర నిబంధనలు, మోసాల వర్గీకరణ నిబంధనలు అమలు చేయకపోవడంతో కొరడా ఝుళిపించినట్లు వెల్లడించింది. ఇక ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన, రికవరీ ఏజెంట్లు, కస్టమర్ సేవలకు సంబంధించి నిర్దేశించిన నిబంధనలు పాటించడంలో విఫలం కావడం, ఆర్థిక సేవల అవుట్ సోర్సింగ్‌లో రిస్కులు వంటి వాటిని అమల చేయడంలో వైఫల్యం చెందినందుకు కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు ఈ జరిమానా విధించినట్లు రిజర్వ్ బ్యాంక్ తెలిపింది.



బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అర్శనపల్లి జగన్‌మోహన్ రావు

# హెచ్‌సిఏ తెలంగాణ సొత్తు

## ఎల్లకాలం ఇద్దరు, ముగ్గురేఅంటే కుదరదు

## గ్రామీణ క్రికెటర్లను జాతీయ జట్టుకు ఆడించాలనేది మా తపన: అర్శనపల్లి జగన్‌మోహన్ రావు

**హైదరాబాద్ అక్టోబర్18,ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ) ప్రైవేట్ ఆస్తి కాదు..తెలంగాణ సొత్తు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి దానిపైన హక్కు ఉందని ఆ సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న అర్శనపల్లి జగన్‌మోహన్ రావు అన్నారు. బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో యూనైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సిఏ ప్యానెల్ తరఫున పోటీ చేస్తున్న జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ శుక్రవారం జరగనున్న హెచ్‌సిఏ ఎన్నికల్లో తమ ప్యానెల్ 120 ప్లస్ ఓట్లతో గెలవనుందని ధీమా వ్యక్తం చేశారు. నేను బయట వ్యక్తిని కాదు..తెలంగాణ బిడ్డని స్వతహాగా నేను క్రికెట్ ప్రేమికుడిని 2017లో నిర్వహించిన తెలంగాణ టి20 లీగ్‌లో పాల్గొన్న మెదక్ మేవరిక్స్ జట్టుకు నేను యజమానిని,ఆ జట్టు తరపున ఆడేందుకు ఎందరో యువ క్రికెటర్లకు అవకాశమిచ్చా ఇప్పుడు నేను బయట వ్యక్తినని పిచ్చి కూతలు కూస్తున్న వారికి అప్పుడు నేను లీగ్‌లో భాగమని తెలియదా? అన్నారు. నిజామాబాద్‌లో స్టేడియం నిర్వహణకు ఎమ్మెల్సీ కవిత 30 ఎకరాలు సమీకరించేందుకు సహకరిమందిస్తామన్నారు.మా ప్యానెల్‌కు అవకాశమిస్తే తప్పకుండా మార్పు తీసుకొస్తామని జగన్‌మోహన్ రావు చెప్పారు.ఈ సమావేశంలో యూనైటెడ్ మెంబర్ ఆఫ్ హెచ్‌సిఏ ప్యానెల్ సభ్యులు శ్రీధర్,హరినారాయణ రావు,శ్రీనివాస్‌రావు,నోయెల్‌డేవిడ్,అన్సారఅహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో భార్య భర్తలు మృతి

## మరో నలుగురికి తీవ్ర గాయాలు

**అల్లాదుర్గం, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** అల్లాదుర్గం మండలం గడిపెద్దపూర్ గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారిపై గత రాత్రి కారు అదుపుతప్పి బోల్తా పడింది. అందులో నారాయణ భార్య దేవమని(57) అక్కడికక్కడే మృతి చెందింది. నారాయణ (60)కు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మరో నలుగురికి స్వల్ప గాయాలు కావడంతో సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరు కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బోలక్‌పల్లి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. దసరా షాపింగ్ కోసం హైదరాబాద్‌లో షాపింగ్ చేసి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు పైపై సిబ్బంది తెలిపారు.

# విద్యుత్ బల్బ్‌లో క్రికెట్ కప్పు

## ఓ వీరాభిమాని నైపుణ్యం

**అల్లాదుర్గం, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** ప్రస్తుతం జరుగుతున్న వరల్డ్‌కప్‌లో భారతదేశం ఈకప్పును గెలుపొందా లని ఆశతో ఓ వీరాభిమాని మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన బచ్చలి మోహన్ అనే వ్యక్తి విద్యుత్ బల్బులో క్రికెట్ కప్పును తయారుచేసి తన వీరాభిమానాన్ని చాటుకున్నాడు. తనకు చిన్న నాటినుండి క్రికెట్ అంటే ప్రాణం అని ప్రస్తుతం నిర్వహించే వరల్డ్‌కప్‌లో భారతదేశం వివిధ దేశాలపై విజయం సాధించి కప్పును భారతదేశానికి రావాలన్నా అభిమానంతో స్వయానా విన్నూత్నమైన పద్ధతిలో బల్బులో క్రికెట్ కప్పును తయారుచేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. తాను కూడా క్రికెట్ వీరాభిమానినని అయితే ఈ వరల్డ్ కప్‌ను తయారు చేసి ఈ కప్పు లాంటి వరల్డ్‌కప్‌ను భారతదేశం సొంత చేసుకోవాలని ఆశతో దీన్ని తయారు చేసి తన దేశ అభిమానాన్ని చాటుకున్నాడు. తయారు చేసిన కప్పును చూసి పలువురు బచ్చలి మోహన్‌ను అభినందించారు.


విద్యుత్ బల్బులో వరల్డ్‌కప్ ఆకారాన్ని తయారుచేసిన మోహన్

## అక్కినేని ఇంట విషాదం

# నాగ సరోజ కన్నుమూత

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** అక్కినేని ఇంట్లో విషాదం నెలకొంది. దివంగత అక్కినేని నాగేశ్వరరావు కుమార్తె, నాగార్జున సోదరి అయిన నాగ సరోజ కన్నుమూశారు. సరోజ మంగళవారం కన్ను మూసినట్లు తెలిసింది. ఈ మధ్యనే సరోజ తన తండ్రి స్వర్గీయ నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా అక్కినేని విగ్రహావిష్కరణ అన్నపూర్ణ స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో సరోజ పాల్గొన్నారు. అక్కినేని నాగేశ్వరరావు, అన్నపూర్ణ దంపతులకు ఐదురు సంతానం. వెంకటరత్నం, నాగార్జున, సత్యవతి, నాగసుశీల, నాగ సరోజ. అయితే సరోజ ఎప్పుడూ బయటకి రాదు. ఏదైనా ముఖ్యమైన వేడుక అక్కినేని ఇంట్లో అయితే తప్ప ఆమె స్వతహాగా రారని అభిమానులు పేర్కొంటున్నారు. వెంకట్, నాగ సుశీల, నాగార్జున చిత్ర పరిశ్రమతో సంబంధం వున్నవాళ్లు కాగా, నాగ సుశీల కుమారుడే నటుడు సుశాంత్. అలాగే నాగ సుశీల కొన్ని సినిమాలు కూడా నిర్మించారు. నటుడు సుమంత్, సుప్రియల తల్లి సత్యవతి చాలా ఏళ్ల క్రితమే స్వర్గస్థులయ్యారు. నాగ సరోజ కూడా ఈ మధ్య అనారోగ్యంతో వున్నట్లుగా తెలుస్తోంది.

# హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు రేపే ఎన్నికలు

## హోరాహోరీ పోరుకు సిద్ధం

## ఆరు పోస్టులకు నాలుగు ప్యానళ్ల పోటీ

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** ప్రతిష్టాత్మకంగా జరుగనున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఎన్నికలకు రంగం పూర్తయింది. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్యానెళ్లు హోరాహోరీ పోరుకు తలపడుతున్నాయి. సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ ఎల్ నాగేశ్వర్ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 20వ తేదీన అసోసియేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ప్రధానంగా 6పోస్టుల కోసం పోటీలు జరగనున్నాయి. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్, కౌన్సిలర్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 173 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సాధారణ మెజార్టీ సాధించేందుకు 87 ఓట్లు అవసరం ఉంటుంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఓటర్ల జాబితాలో 48 ఇన్‌స్టిట్యూషన్లు, 6జిల్లాల అసోసియేషన్లు, 15 మంది అంతర్జాతీయ క్రికెటర్లు ఉన్నారు. కాగా ఈ ఎన్నికల్లో మొత్తం నాలుగు ప్యానల్స్ ఈ పోటీల్లో హోరాహోరీగా తలపడుతున్నాయి. ముఖ్యంగాముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని బిఆర్‌ఎస్ పార్టీ అండదండలతో జాతీయ హ్యాండ్ బాల్ సంఘం (హెచ్‌ఏఐ) ప్రధాన కార్యదర్శి అర్శినపల్లి జగన్మోహన్‌రావుకు చెందిన యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ ప్యానల్ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. మరోవైపు భారతీయ జనతాపార్టీకి చెందిన కీలక నేత హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వివేక్ వెంకటస్వామి కూడా తన ప్యానల్‌ను బరిలోకి దింపారు. ఇంకోవైపు మాజీ క్రికెటర్లు శివలాల్‌యాదవ్, అర్షద్ అయూబ్‌లు సంయుక్తంగా తమ ప్యానల్‌ను ఎన్నికల బరిలోకి దించుతున్నారు. క్రికెట్ ఫస్ట్ అనే పేరుతో వీరు నామినేషన్ వేశారు. వీరికి ఇప్పటికే హెచ్‌సీఏలో కీలక పదవులు చేపట్టిన అనుభవం ఉంది. అయితే హైదరాబాద్ క్రికెట్ అభివృద్ధి కోసం పెద్దగా చేసిన పనులు ఏమీ లేవని ప్రత్యర్థులు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. అలాగే గుడ్ గవర్నెన్స్ అనే పేరుతో అనిల్‌కుమార్ ప్యానల్ బరిలోకి దిగుతోంది. అనిల్‌కుమార్ అధ్యక్షునిగా పోటీలో ఉన్నారు.

# అఫ్ఘాన్‌పై న్యూజిలాండ్ భారీ విజయం

## 149 పరుగుల తేడాతో నెగ్గిన కివీస్



**హైదరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** ప్రపంచ కప్‌లో భాగంగా న్యూజిలాండ్ అఫ్ఘనిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 149 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. ఓపెనర్ విల్ యంగ్ 54 అర్ధ శతకంతో రాణించగా, కెప్టెన్ లాథమ్ 68, గ్లెన్ ఫిలిప్స్ 71 కీలక ఇన్నింగ్స్ ఆడారు. డేవాన్ కాన్వే 20, రచిన్ రవీంద్ర 32 భారీ స్కోర్లు చేయడంలో విఫలమయ్యారు. డారిల్ మిచెల్ 1తో కేవలం సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఒక దశలో 110 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన కివీస్‌ను లాథమ్, గ్లెన్ ఫిలిప్స్ ఆదుకున్నారు. దీంతో కివీస్ చెప్పుకోదగ్గ స్కోరును సాధించగలిగింది. మొదట్లో లాథమ్, ఫిలిప్స్ జోడీ నెమ్మదిగా ఆడినా ఆఖరి ఓవర్లలో దూకుడు పెంచింది. ఫిలిప్స్ ముజిబుర్ వేసిన 42వ ఓవర్లో ఓ సిక్స్, ఫారూఖీ వేసి 45 వ ఓవర్‌లో వరుసగా రెండు సిక్సర్లు ఓ ఫోర్ రాబట్టాడు. అయితే నవీనుల్ వీరిద్దరినీ 48వ ఓవర్‌లో పెవిలియన్ బాట పట్టించారు. ఫిలిప్స్ రషీద్‌ఖాన్‌కు క్యాచ్ ఇవ్వగా, లాథమ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. చివర్లో మార్క్ చాప్‌మన్ దూకుడుగా ఆడి 25 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన అఫ్ఘాన్ మొదట్లోనే తడబడింది. ఆరంభంలోనే వికెట్లు కోల్పోయి డిఫెన్స్‌ను ఆశ్రయించింది. 29 ఓవర్లు ముగిసే నాటికి 5 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసిన అఫ్ఘానిస్తాన్ ఆ తరువాత కూడా న్యూజీలాండ్ బౌలర్ల ధాటికి కుప్పకూలింది. 34.4 ఓవర్లలో కేవలం 139 పరుగులకే ఆలౌట్ అయింది.

# బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం సంక్షేమం

## రాహుల్ వస్తాడు.. ప్రియాంక వస్తుంది.. మోసపోకండి..

## బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న మంత్రి కేటీఆర్


బుధవారం కరీంనగర్ ప్రజా ఆశీర్వాదసభలో మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్

**కరీంనగర్ బ్యూరో, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పదేళ్ళలో ఎంత అభివృద్ధి జరిగింది, ఎన్ని మార్పులు వచ్చాయో ప్రజలు గమనించాలని ఆయన సూచించారు. మానేరు నీళ్లకోసం జరిగిన కొట్లాటలు ఇంక కళ్లముందే ఉన్నాయని, నేడు ఆ పరిస్థితి మారిందన్నారు. బుధవారం కరీంనగర్‌లోని పద్మనగర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పాల్గొని ప్రసంగించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో కరీంనగర్ జిల్లా సజీవ జలధారగా మారిందని మంత్రి కేటీఆర్ అన్నారు. అభివృద్ధికి, సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన అని అన్నారు. కరీంనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన గంగుల కమలాకర్‌ని ప్రజలు మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌కి ఎం చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. గంగుల మీద పోటీ అంటే పోషమ్మ గుడి ముందు పొట్టేలు కట్టేసినట్టే అని వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం రాజీనామా చేయకుండా పారిపోయిన బీజేపీ కిషన్ రెడ్డికి, ఓటుకు నోటు కేసులో దొరికిన క్రిమినల్ కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డికి రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు లేదన్నారు. ప్రజా ఆశీర్వాద సభలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ వినోద్ కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ కనుమల్ల విజయ, ఎమ్మెల్సీలు భాను ప్రసారావు, ఎల్.రమణ, ఎమ్మెల్యేలు రసమయి, సుంకే రవిశంకర్, నగర మేయర్ వై.సునీల్‌రావు, జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జివి రామకృష్ణ, సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి తొలి జాబితా సిద్ధం: నేడు సీఈసీ సమావేశంలో ఆమోదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబర్18:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బిజెపి అభ్యర్థుల తొలి జాబితా దాదాపు సిద్ధమైంది. గురువారం ఢిల్లీలో జరిగే బిజెపి సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో ఈ జాబితాకు అధికార ముద్ర పడే అవకాశం ఉంది. సుమారు 40-50 మందితో తొలి జాబితా విడుదల చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. తొలి జాబితాపై తుది కసరత్తులో భాగంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు,కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్,పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ ఢిల్లీ బాట పట్టారు. బిజెపి జాతీయ నాయకత్వంతో గురువారం మంతనాలు సాగించి తొలి జాబితాకు తుది మెరుగులు దిద్దే అవకాశం ఉంది. అలాగే సాయంత్రం జరిగే పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో ఆ జాబితాకు ఆమోదముద్ర వేస్తే అధికారికంగా జాబితాను విడుదల చేయడానికి ఆస్కారం ఉంటుంది. గురు,శుక్రవారాల్లో తొలి జాబితాను బిజెపి హెడ్ క్వార్టర్స్ అధికారికంగా విడుదల చేసే అవకాశం ఉంది. తెలంగాణకు చెందిన బిజెపి నేతల్లో జాతీయ స్థాయిలో పనిచేస్తున్నవారందరినీ అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దించే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఇందులో భాగంగా కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న కిషన్‌రెడ్డితో పాటు బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీగా ఉన్న బండి సంజయ్,ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడితో పాటు రాజ్యసభ సభ్యుడిగా ఉన్న డాక్టర్ కె.లక్ష్మణ్,ఇతర ఎంపీలు ధర్మపురి అరవింద్,సోయం బాపూరావు,జాతీయ స్థాయి రాజకీయాల్లో ఉన్న మురళీధర్‌రావు,పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలుగా ఉన్న డికె అరుణ తదితరులందరినీ అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దించనున్నట్లు ఊహాగానాలు నడుస్తున్నాయి. ఆయా నేతలు తమ నియోజకవర్గంలో పాటు చుట్టుపక్కల నియోజకవర్గాలను కూడా ప్రభావితం చేస్తే బిజెపి గణనీయంగా తన సీట్ల సంఖ్యను పెంచుకునే అవకాశం ఉంటుందని అధినేతల వ్యూహంగా కనిపిస్తోంది. ప్రస్తుతం బిఆర్‌ఎస్,కాంగ్రెస్ మధ్య ముఖాముఃఖి పోరులా కనిపిస్తున్న వాతావరణాన్ని మార్చి ముక్కోణపు పోటీని నెలకొల్పేందుకు బిజెపి యత్నిస్తోంది. ఈ క్రమంలోనే బడా నేతలను బరిలోకి దించడం ఉపకరిస్తుందని ఆ పార్టీ అధినేతలు భావిస్తున్నారు. ఏ పార్టీకి అధికారం దక్కని హంగ్ ఫలితాలు ఏర్పడితే బిజెపి కీలక పాత్ర వేసే అవకాశం ఉంటుందని లెక్కలు వేసుకుంటున్నారు.

# ఓ వైపు ప్రచారహోరు.. మరోవైపు నిష్క్రమణ జోరు..

## కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితి, క్యాడర్‌లో గందరగోళం

**హైదరాబాద్, అక్టోబర్ 18,ప్రభాతవార్త:** కాంగ్రెస్ బస్సు ప్రచారంలో దూసుకుపోతున్నది. తెలంగాణ వ్యాప్తంగా మరోవైపు అసమ్మతి వాదులు టికెట్లు రాలేదని జెండాలు ఫ్లెక్సీలు తగలబెడుతున్నారు. రామప్ప ఆలయంలో ఆరు గ్యారెంటీలకు పూజచేసి కాంగ్రెస్ యువతనేతలు తెలంగాణ శాసనసభ ఎన్నికల ప్రచారహోరుకు శంఖారావం పూరించిన బుధవారం రోజునే మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ నుంచి కీలక నేతలు, కాంగ్రెస్ క్షేత్రస్థాయి కార్యకర్తలు పదులు,వందల సంఖ్యలో నిష్క్రమించారు. తెలంగాణలో బస్సు యాత్రతో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ జైత్రయాత్ర మొదలు పెట్టడానికి హైదారాబాద్‌లో పాదం మోపిని కొద్ది క్షణాలకే కాంగ్రెస్ గద్వాల జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి పార్టీకి రాజీనామచేశారు. గద్వాల నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించినారు. స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో బిఆర్‌ఎస్ పార్టీలో ఆయన చేరడం ఒకింత బస్సు యాత్ర సందర్భంగా కాంగ్రెస్‌కు వచ్చే మైలేజీకి డ్యామేజి అయినట్లే అని రాజకీయ పరిశీలకు అభిప్రాయం. వలస వచ్చిన నేతలకు టికెట్లు విక్రయించారని ఆయన ఆపాదించారు. గద్వాల లో సరిత అభ్యర్థిత్వంను కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోవడంలేదని అన్నారు. ఉప్పల్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పార్టీకి గుడ్‌బై చెప్పారు. బుధవారం సాయంత్రం ఓవైపు ములుగు జిల్లాలో రాహుల్ వేదికపై ప్రసంగిస్తుంటే ఇక్కడ ప్రగతిభవన్‌లో ఆయనను కెసిఆర్ తన పార్టీలోకి ఆహ్వానిస్తూ గులాభి కండువా కప్పినారు.పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సి.సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. కాంగ్రెస్‌ను రేవంత్‌రెడ్డి జేబుసంస్థగా మార్చుకున్నారని సి.సత్యనారాయణరెడ్డి నిందించారు. రేవంత్ రాసిచ్చే స్క్రిప్ట్‌చదివే రాహుల్ మాటలు తెలంగాణ ప్రజలు విశ్వసించడంలేదని ఆరోపించారు.సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్‌లోకి చేరినారు. కాంగ్రెస్ జడ్పీటిసి వినీల,నరేశ్ దంపతులు మంత్రి హరీష్‌రావు సమక్షంలో చేరినారు.ములుగు జిల్లాకు కూతవేటు దూరంలో వున్న జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి బిఆర్‌ఎస్ పార్టీలోకి వలసలు కొనసాగినాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వాసూరి సోమయ్య కాంగ్రెస్ పార్టీమాజీ అధ్యక్షుడు వీరమళ్ళ వెంకటేశ్వర్లు ఎఫ్‌ఎస్‌సిఎస్ మాజీ డైరెక్టర్ రావుల భీమన్న మున్నూరు కాపు సంఘం జిల్లా నేతలు వీరమళ్ళ రామాంజనేయులు ముదిరాజ్,కురుమ సంఘాల నేతలు ఆటో సంఘాల నేతలు కాంగ్రెస్‌పార్టీని వీడి బిఆర్‌ఎస్‌లోచేరినారు.పెద్దవంగర,చిట్యాల కాంగ్రెస్ నాయకులు యాకయ్య గజ్జి అవోక్ ఆవుల నారాయణ బిఆర్‌ఎస్‌లో చేరినారు. ఆందోల్ నియోజకవర్గం చౌటకూర్ మండలంలో కాంగ్రెస్ నుంచి బిఆర్‌ఎస్‌కు స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో పార్టీని మారినారు. మరోవైపు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా ములుగులో పోస్టర్లతో నిరసన తెలిపారు.

గిరిజన యూనివర్సిటీ కోసం పార్లమెంటులో ఎందుకు నిలదీయలేదని రాహుల్‌ను ప్రశ్నిస్తూ పోస్టర్ వెలిశాయి. సమ్మక్కసారలమ్మ జాతరకు జాతీయ హోదా గురిచి మాట్లాడని రాహుల్ ఓట్లకోసం పరిగెత్తుకుంటూ వచ్చారని నిరసనగా పోస్టర్లు వెలిశాయి. రామప్ప ఆలయం అభివృద్ధికి నిధుల కోసం దాని వారసత్వసంపదగా సంరక్షణ కోసం రాహుల్ ఏనాడైనా ప్రయత్నించాడా అని పోస్టర్లు దారి పొడుగునా వెలిశాయి.

# చంద్రబాబు ముందస్తు బెయిలు పిటిషన్ వచ్చే 7కు వాయిదా

## ఐఆర్ఆర్ కేసు

**విజయవాడ,అక్టోబరు18,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఎపి హైకోర్టు బుధవారం విచారించింది.తదుపరి విచారణను నవంబరు7కు వాయిదా వేసింది.ఇదే అంశంపై సుప్రీం కోర్టులో క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్‌లో ఉంది.అందు వలన కేసుని వాయిదా వేసారు. అమరావతి రింగ్‌రోడ్డు కేసులో పిటి వారెంట్‌ను సిఐడి అధికారులు విజయవాడ ఎసిబి కోర్టు దాఖలు చేసారు. పిటి వారెంట్ విచారణపై స్టే విధిస్తూ గతంలోనే ఎపి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.తాజాగా ఆ ఉత్తర్వులను నవంబర్7 వరకు అమలు చేయవద్దని ఆదేశించింది. చంద్రబాబు స్కిల్ స్కామ్ కేసులో నిందితునిగా ఉన్నారు. ఆయన ఈ కేసుకు సంబంధించి 40రోజులుగా రాజమండ్రి సెంట్రల్ జైలురిమాండ్‌లో ఉన్నారు.ఈ క్రమంలో ఆయనపై సిఐడి ఐఆర్ఆర్ కేసులో పిటివారెంటును ఎసిబి కోర్టులోవేసింది. దీనిపై హైకోర్టును చంద్రబాబు న్యాయవాదుల ద్వారా ఆదేశించారు. దాంతో పిటి వారెంట్ విచారణపై స్టే విధిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు తాజా నిర్ణయాన్ని అనుసరించి నవంబరు7వరకు స్టే కొనసాగుతుంది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది.

# ఎపి వ్యాప్తంగా 13,072 గ్రామాల్లో డ్రోన్ ఫ్లైయింగ్ పూర్తి

**విజయవాడ,అక్టోబరు 18,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న భూహక్కు,భూరక్ష పథకం మూడవ దశను 2024 జనవరి నాటికి పూర్తి చేయాలని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. వెలగపూడి లోని సచివాలయంలో మంగళవారం జగనన్న భూహక్కు-భూరక్ష పథకంపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు బొత్స సత్యన్నారాయణ,ధర్మాన ప్రసాదరావు,ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజేయ కల్లాంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరుగుతున్న సమగ్ర సర్వేపై మంత్రుల కమిటీ సమీక్షించింది. దేశం లోనే అత్యంత వేగంగా సమగ్ర సర్వే మన రాష్ట్రం లోనే జరుగుతోందిని ఇప్పటి వరకు రెండు దశల్లో సర్వే పూర్తి చేశామని మంత్రులు తెలిపారు. మొదటి రెండు దశల్లో మొత్తం నాలుగు వేల గ్రామాలో సర్వే ప్రక్రియ పూర్తి చేసి, భూహక్కు పత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మూడోదశ సర్వేను వచ్చే ఏడాది జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాని కనుగుణంగా అన్ని విభాగాల అధికారులు పని చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,072 గ్రామాల్లో డ్రోన్ ఫ్లైయింగ్ పూర్తయ్యిందన్న మంత్రుల కమిటీ తెలిపింది.

# నేడు బంగ్లాదేశ్‌తో తలపడనున్న భారత్

## ఫేవరెట్‌గా బరిలో దిగుతున్న టీం ఇండియా

## తుది జట్టులో స్పిన్నర్ అశ్విన్‌కు చోటు దక్కే అవకాశం

**హైదరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** వన్డే ప్రపంచ కప్ 2023లో వరుస విజయాలతో దూసుకుపోతున్న టీమిండియా మరో కీలక పోరుకు సిద్ధమైంది. వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచి మంచి ఊపు మీద ఉన్న భారత జట్టు బంగ్లాపై మరో విజయాన్ని నమోదు చేసుకుని సెమీస్ రేసులో ముందుండాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ మెగా టోర్నీలో భాగంగా గురువారం పూణే వేదికగా బంగ్లాదేశ్‌తో భారత జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే పూణేకు చేరుకున్న భారత జట్టు ప్రాక్టీస్ సెషన్స్‌లో బిజీబిజీగా గడిపింది. ఈ మ్యాచ్‌లో టీం ఇండియానే ఫేవరెట్ కానీ సంచలనాలకు వేదికగా మారిన వరల్డ్ కప్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. గత మ్యాచుల్లో ఇంగ్లండ్, న్యూజిలాండ్ చేతుల్లో ఘోరంగా ఓటమి చవిచూసిన బంగ్లా ఈసారైనా పుంజుకోవాలని బలంగా కోరుకుంటోంది. ఇక భారత జట్టు అన్ని విభాగాల లోనూ పటిష్టంగా ఉన్నట్లు కనిపిస్తోంది. గత మూడు మ్యాచ్‌లలో టాప్ ఆర్డర్ నుంచి మిడిలార్డర్ వరకు అన్ని పరీక్షలను భారత్ ఎదుర్కొవడంతో పాటు దిగ్విజయంగా టాప్‌గా నిలిచింది. తొలుత ఆసీస్‌పై మిడిలార్డర్ రాణించడం, అఫ్ఘాన్, పాకపై భారత బౌలర్లు టాప్ ఆర్డర్‌తో పాటు విజృంభించడాన్ని కూడా భారత క్రికెట్ అభిమానులు ఆస్వాదించారు. ఇప్పుడు సంచలనాలకు మారు పేరుగా నిలిచే బంగ్లాదేశ్‌ను ఎదుర్కోవడంపై దృష్టి సారించాలి. టీమిండియా కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్లు గిల్,విరాట్, రాహుల్, శ్రేయస్‌తో కూడిన బ్యాటింగ్ విభాగం మంచి ఫామ్‌లో ఉంది.అలాగే,ఆల్‌రౌండర్లు హార్థిక్, రవీంద్ర జడేజా సమయానికి తగ్గట్టుగా వికెట్లు అందిస్తూ గెలుపులో తమ వంతు కృషి చేస్తున్నారు. పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో ఏదో మంత్రం చదివినట్లు బంతిని పఠించి వికెట్ తీసిన హార్థిక్ పాండ్యా ఒక్కసారిగా నెట్టింట వైరల్‌గా మారిపోయాడు. క్రీజ్‌లోపాతుకుపోయిన ఓపెనర్‌ను పెవిలియన్ బాట పట్టించాడు. బంగ్లాదేశ్ జట్టుతోపోలిస్తే ఏ విధంగా చూసినా భారత లైనప్ బలంగానే ఉంది.

# షకీబుల్ కోసం ప్రత్యేకంగా ఎలాంటి వ్యూహాలు లేవు

## భారత బౌలింగ్ కోచ్ మాంబ్రే

**హైదరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు కెప్టెన్ షకీబుల్ హసన్ కోసం ప్రత్యేకంగా ఎలాంటి వ్యూహాలు రచించడం లేదని టీమిండియా బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే వ్యాఖ్యానించారు. నేడు పూణే వేదికగా భారత్ బంగ్లా జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు పరాస్ మాంబ్రే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాగా ప్రస్తుతం బంగ్లా కెప్టెన్ షకీబుల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ముఖ్యంగా టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిపై అతనికి అద్భుతమైన రికార్డు ఉంది. ఇప్పటి వరకు 14 వన్డేల్లో విరాట్ కోహ్లి షకీబుల్‌ను ఎదుర్కోగా అతని బౌలింగ్‌లో 5 సార్లు ఔటయ్యాడు. ప్రతీ ఒక్క బ్యాటర్‌కు బౌలింగ్ మ్యాచ్ అప్‌లు ఉంటాయి, కొన్ని మ్యాచ్‌లలో బ్యాటర్లు వారిపై పై చేయి సాధిస్తే మరికొన్ని మ్యాచ్‌లలో బౌలర్లు ఆధిపత్యం చెలాయిస్తారు. షకీబ్‌కు విరాట్‌పై మంచి రికార్డు ఉందని తెలుసు కానీ, ఆ విషయం గురించి ట్రైనింగ్ సెషన్స్‌లో అస్సలు మేము చర్చించలేదని వివరించారు. షకీబ్ అద్భుతమైన ఆటగాడు, పవర్ ప్లేలో మంచిగా బౌలింగ్ చేయగలిగే సామర్థ్యం ఉంది అతడు బంగ్లాదేశ్‌కు ఛాంపియన్ ప్లేయర్ అని కూడా మాకు తెలుసని పేర్కొన్నారు. అయినప్పటికీ షకీబ్ కోసం ఎలాంటి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయలేదనీ, బంగ్లాతో మ్యాచ్‌లో మేము ఏమి చేయాలో మాకు స్పష్టంగా తెలుసని మాంబ్రే వివరించారు.

# పోలీసుల అదుపులో శివరామ్ రాథోడ్?

**హైదరాబాద్, అక్టోబరు 19 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన నిరుద్యోగ యువతి మర్రి ప్రవళిక ఆత్మహత్య కేసులో ప్రధాన ఇందితుడిగా పోలీసులు తేల్చిన శివరామ్‌రాథోడ్‌ను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి ప్రాంతానికి చెందిన శివరామ్ రాథోడ్‌ను స్థానిక పోలీసులు అదుపు లోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ప్రియుడి మోసం వల్లే మర్రి ప్రవళిక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె తల్లిదండ్రులు కూడా రెండు రోజుల కింద మీడియాముందుకు వచ్చి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇదే అంశంలో చిక్కడపల్లి పోలీసులు కేసులు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిసింది. కాగా మరోవైపు నిందితుడిగా ఉన్న శివరామ్ రాథోడ్ తనను మోసం చేశారని ప్రవళిక తన సోదరుడు ప్రణయ్‌కు వాట్సాప్ సందేశాల ద్వారా తెలపడం, ఈ మేరకు ప్రణయ్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. కాగా 'ప్రభాతవార్త' చిక్కడపల్లి పోలీసుల ముందు ప్రస్తావించగా శివరామ్ రాథోడ్ తాము అదుపులోకి తీసుకోలేదని, అతడు వేరే రాష్ట్రానికి పరారైనట్లు చెబుతున్నారు. ప్రవళిక ఆత్మహత్య కేసు విషయంలో ఇటు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు, రాష్ట్ర మంత్రి కెటిఆర్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం మూలంగా త్వరలోనే ఈ కేసులో పురోగతి సాధించే అవకాశం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# తెలంగాణ, ఎపి నుంచి నలుగురు జడ్జిల బదలీ

≫ పేరన్లను సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల సిఫారసు చేయగా... వారి నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నలుగురితో పాటు దేశ వ్యాప్తంగా పలు హైకోర్టులకు 17 మంది అదనపు న్యాయమూర్తులు, న్యాయమూర్తులను నియమించినట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఎక్స్(ట్విట్టర్)లో వెల్లడించారు. అలాగే,దేశవ్యాప్తంగా పలు హైకోర్టుల్లో 16 మంది జడ్జీలను వేరే హైకోర్టులకు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల తర్వాత రాష్ట్రపతి ఈ ఆదేశాలు వెలువరించినట్లు తెలిపారు.

## కొత్తగా నియమితులైన జడ్జి, అదనపు జడ్జీలు వీళ్లే..

న్యాయవాదులైన హరినాథ్ నూనెపల్లి, కిరణ్మయి మండవ,సుమతి జగడం,న్యాపతి విజయ్ ఏపీ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తులుగా నియామకం అయ్యారు. జ్యుడీషియల్ ఆఫీసర్లుగా ఉన్న అభయ్ జైనారాయంజీ,శ్యామ్ ఛగన్‌లాల్ చందాక్ బాంబే హైకోర్టు అదనపు జడ్జిలుగా నియమితులయ్యారు. జ్యూడిషియల్ ఆఫీసర్లు జాన్సన్ జాన్,గోపీనాథన్ యు.గిరీష్,సి.ప్రతీప్ కుమార్ కేరళ హైకోర్టు అదనపు జడ్జిలుగా నియామకం అయ్యారు. జ్యూడీషియల్ ఆఫీసర్ శైలీందర్ కౌర్ రవీందర్ దుడేజా ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జిలుగా నియామకం అయ్యారు. జ్యూడీషియల్ ఆఫీసర్ శైలీందర్ కౌర్ రవీందర్ దుడేజా ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జిలుగా నియామకం అయ్యారు. న్యాయవాది రవీంద్రకుమార్ అగర్వాల్ చత్తీస్‌గఢ్ అదనపు జడ్జీగా నియామకం అయ్యారు. జ్యుడిషియల్ ఆఫీసర్ విమల్ కన్నయ్యలాల్ వ్యాస్ గుజరాత్ హైకోర్టు జడ్జీగా నియమితులయ్యారు. న్యాయవాది కేవీ అరవింద్ కర్ణాటక హైకోర్టు అదనపు జడ్జిగా నియామకం అయ్యారు. జ్యూడీషియల్ ఆఫీసర్ సవ్యసాచి దత్త పుర్కాయస్థ త్రిపుర హైకోర్టు జడ్జిగా నియామకం అయ్యారు. జ్యూడీషియల్ ఆఫీసర్ విశ్వజిత్ పాలిత్ త్రిపుర హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులయ్యారు.

## బదిలీ అయిన జడ్జీలు వీళ్లే....

జస్టిస్ ఎస్‌పి కేసర్వాని(అలహాబాద్ హైకోర్టు నుంచి కలకత్తా హైకోర్టుకు), జస్టిస్ రాజ్‌మోహన్ సింగ్(పంజాబ్-హరియాణా హైకోర్టు నుంచి మధ్యప్రదేశ్ హైకోర్టుకు), జస్టిస్ నరేందర్ జి(కర్ణాటక హైకోర్టు నుంచి ఏపీ హైకోర్టుకు), జస్టిస్ సుధీర్‌సింగ్(పట్నా హైకోర్టు నుంచి పంజాబ్-హరియాణా హైకోర్టుకు),జస్టిస్ ఎం.వి. మురళీధరన్(మణిపూర్ హైకోర్టు నుంచి కలకత్తా హైకోర్టుకు), జస్టిస్ మధురేష్ ప్రసాద్(పట్నా హైకోర్టు నుంచి కలకత్తా హైకోర్టుకు), జస్టిస్ అర్వింద్‌సింగ్ సంగ్వాన్(పంజాబ్-హరియాణా హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు),జస్టిస్ అవ్నీశ్ జింగాన్(పంజాబ్-హరియాణా హైకోర్టు నుంచి రాజస్థాన్ హైకోర్టుకు), జస్టిస్ అరుణ్ మోంగా(పంజాబ్-హర్యానా హైకోర్టు నుంచి రాజస్థాన్ హైకోర్టుకు), జస్టిస్ రాజేంద్ర కుమార్-వీ(అలహాబాద్ హైకోర్టు నుంచి మధ్యప్రదేశ్ హైకోర్టుకు), జస్టిస్ నాని తగియా(గువాహటి హైకోర్టు నుంచి పట్నా హైకోర్టు), జస్టిస్ సి.మానవేంద్రనాథ్ రాయ్(ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి గుజరాత్ హైకోర్టుకు), జస్టిస్ మున్నూరి లక్ష్మణ్(తెలంగాణ హైకోర్టు నుంచి రాజస్తాన్ హైకోర్టుకు), జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి(తెలంగాణ హైకోర్టు నుంచి పాట్నా హైకోర్టు), జస్టిస్ లపిత బెనర్జీ-అదనపు జడ్జి(కలకత్తా హైకోర్టు నుంచి పంజాబ్-హరియాణా హైకోర్టుకు),జస్టిస్ దుప్పాల వెంకటరమణ-అదనపు జడ్జి(ఏపీ హైకోర్టు నుంచి మధ్యప్రదేశ్ హైకోర్టుకు) బదిలీ అయ్యారు.

## పీపుల్ మీడియా ఫ్యాక్టరీ
# 'తెలుసు కదా' ప్రారంభం

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఇటీవలే స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా తమ ప్రొడక్షన్ నెంబర్ 30ని అనౌన్స్ చేసింది.. తెలుసు కదా.. అనే టైటిల్‌తో సోల్‌ఫుల్ లవ్‌స్టోరీగా రూపొందనున్న ఈచిత్రంతో ప్రముఖ స్టైలిస్ట్, కాస్ట్యూమ్స్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. గ్రాండ్ టైటిల్ గ్లింప్స్‌తో అందరినీ ఆకట్టుకున్నారు.. ఈ గ్లింప్స్ ప్రస్తుతం యూట్యూబ్‌లో






టాప్ ట్రెండింగ్‌లో ఉంది.. బుధవారం హైదరాబాద్‌లో కోర్ టీమ్, పలువురు అతిథుల సమక్షంలో ఈ చిత్రం గ్రాండ్‌గా ప్రారంభమైంది.. ముఖ్యఅతిథిగా నాచురల్‌స్టార్ నాని పాల్గొన్నారు.. తొలి సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. హీరోలు నితిన్, ఆది పినిశెట్టి స్క్రిప్టును మేకర్స్‌కు అందించారు. దర్శకుడు బాబీ కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలిషాట్‌కు హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఆది, నందినిరెడ్డి, కోన వెంకట్, వక్కంతం వంశీ, బొమ్మరిల్లు భాస్కర్, మల్లిక్ రామ్, సితార నాగవంశీ, నిర్మాత విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భారీ బడ్జెటతో టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈచిత్రానికి వివేక్ కూచిభొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు.. రాశిఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు. మరికొద్ది వారాల్లో ఈసినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని మేకర్స్ తెలిపారు.

# 'అలా నిన్ను చేరి' ట్రైలర్


యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ జానర్‌లో వచ్చే చిత్రాలకు ఎక్కువగా క్రేజ్ ఉంటుంది.. అలాంటి ఓ చిత్రమే త్వరలో రాబోతోంది.. యంగ్ హీరో దినేష్‌తేజ్, అందాల తారలు హెబ్బాపటేల్, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అలా నిన్నుచేరి'.. ఈసినిమాతో ఆడియెన్స్‌కు కొత్త అనుభూతిని ఇవ్వాలని మేకర్స్ ప్రయత్నిస్తున్నారు.. విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ మూవీతో మారేష్ శివన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈచిత్రానికి కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మాతగా



వ్యవహరిస్తున్నారు. సినిమా త్వరలో రిలీజ్ కానున్న తరుణంలో ప్రమోషన్స్ జోరు పెంచారు. ఈచిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది.. ఈసందర్భంగా చిత్ర నిర్మాత కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడు తూ, ఇది ఫుల్‌మీల్స్ లాంటి సినిమా అన్నారు. మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఎపుడూ ఆదరిస్తూనే ఉంటారనానరు.. లవ్‌స్టోరీలు ఎపుడూ సక్సెస్ అవుతాయన్నారు.. ఈసినిమాకు దినేష్ రైట్ ఛాయిస్ అన్పించిందన్నారు. క్యూటల్ లవ్‌స్టోరీకి క్యూట్ హీరోయిన్ పాయల్ కరెక్ట్ అన్పించిందన్నారు. అండర్ కంటెంట్‌గా ఓ మెసేజ్ ఉంటుందన్నారు.. ఆ పాత్రకు హెబ్బాపటేల్ న్యాయంచేసిందన్నారు. ప్రతి పాత్రకు ఇంపార్టెన్స్ ఉంటుందన్నారు. ఈచిత్రంప్రేక్షకులను అలరిస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో బెక్కెం వేణుగోపాల్, త్రినాధరావు నక్కిన, డైరెక్టర్ మారేష్ శివన్, దినేష్ తేజ్, హరి ప్రసాద్, ఆదిత్య మ్యూజిక్ నిరంజన్, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, హీరోయిన్ పాయల్ రాధాకృష్ణ, కెమెరామెన్ ఆండ్రూ తదితరులు మాట్లాడారు.






వైనాట్ స్టూడియోస్, రిలయెన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సగర్వంగా సమర్పిస్తున్న చిత్రం మార్టిన్ లూథర్ కింగ్.. మహాయాన మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈచిత్రానికి పూజ కొల్లూరు దర్శకత్వం వహించారు. ఈసినిమాలో సంపూర్ణేష్‌బాబు, వికె నరేష్, శరణ్య ప్రదీప్ వంటి ప్రతిభావంతులైన నటీనటులు నటించారు.. వెంకటేష్ మహా ఈచిత్రానికి స్క్రీన్‌ప్లే, డైలాగులు అందించటంతోపాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. అంతేకాదు.. ఈసినిమాలో ఆయన ముఖ్యపాత్ర పోషించటం విశేషం. వినోద ప్రధానంగా రూపొందిన ఈ రాజకీయ వ్యంగ్య చిత్రం అక్టోబర్ 27న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ట్రైలర్‌ను బుధవారం సాయంత్రం విడుదల చేశారు. కనీసం తన పేరేంటో కూడ తెలియని చెప్పులు కుట్టే వ్యక్తిగా సంపూర్ణేష్‌బాబు పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. అతనికి మార్టిన్ లూథర్ కింగ్ అనే పేరు పెట్టటం ఆసక్తికరంగా ఉంది.. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లోని పలు నగరాల్లో ముందస్తు ప్రీమియర్ షోలు ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో బుధవారం సీనియర్ నటుడు వికె నరేష్ చిత్ర విశేషాలను పంచుకున్నారు.

**మార్టిన్ లూథర్ కింగ్.. ఎలా ఉండబోతోంది? ఇందులో కింగ్ ఎవరు అవుతారు?**

కింగ్ ఎవరు అవుతారు అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.. వెంకటేష్ మహాతో నా ప్రయాణ ఉమామహేశ్వర ఉగ్రరూపస్య నుంచి మొదలైంది.. ఇది యువ దర్శకుల యుగం. చాలా మంచి సినిమా చేశాం.. మంచి సందేశంతో కూడిన వినోదాత్మకంగా సాగే సినిమా ఇది.. వినోదం, సందేశం కలిసి రావటం చాలా అరుదు.. ఇప్పటికే ఈసినిమా ప్రీమిమర్లు మొదలుపెట్టాం.. సినిమా మీద ఎంతో నమ్మకం ఉంటేనే కానీ, ఇలా ముందు గానే ప్రజలకు చూపించి సినిమాను విడుదల చేయరు.. నేను వరంగల్‌లో చూశాను. మహిళలు, యువత అన్నివర్గాల ప్రేక్షకులతో థియేటర్ నిండిపోయింది. ప్రారంభం నుంచి చివరి వరకు ఎంజాయ్ చేస్తూనే ఉంటారు.



# సినిమా అనేది రాజకీయాలకు బాణం లాంటిది

**మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**

చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకునే తరహా పాత్ర నేను చేశాను.. గ్రామ సర్పంచ్ వారసత్వం కోసం పరితపించే పాత్ర.. నా వయసుకంటే దాదాపు 20 ఏళ్ల తక్కువ వయసున్న పాత్రలో నటించాను.. అలాగే మహా పాత్ర మరో వర్గం. అసలు రాజకీయం గ్రామాల్లోనే జరుగుతుంది.. దాన్ని ఆధారంగా చేసుకుని తీసిన సినిమా ఇది.. నిజంగా ఒక వెనుకబడిన గ్రామానికి వెళ్లి సినిమా చిత్రీకరించాం.. ఈసినిమాకు బలం వెంకటేష్ మహా స్క్రిప్టు, దాన్ని దర్శకురాలు పూజ అద్భుతంగా తెరకెక్కించారు. నాకు, సంపూ, మహాతోపాటు చాలా మందికి ఈసినిమా లైఫ్ అవుతుంది.. ఒక మహిళా దర్శకురాలు (దివంగత విజయనిర్మల) కొడుకుగా పూజ దర్శకత్వంలో నటించటం సంతోషంగా ఉంది.

**మాతృక సినిమా మండేలా చూశారా?**

ఇది రీమేక్ కంటే కూడ స్ఫూర్తిపొంది తీసిన సినిమా.. ఎందుకంటే మన తెలుగు రాజకీయాలు, మన నేటివిటీకి తగ్గట్టుగా తీసిన సినిమా ఇది.. దీన్ని ఓ కొత్త సినిమాగా చూడొచ్చు... సరిగ్గా ఎన్నికల సీజన్‌లో విడుదల అవుతోంది.. యువతను ఈసినిమా బాగా మెప్పిస్తుందని అనుకుంటున్నాను.. ప్రీమియర్స్ సమయంలో ప్రేక్షకులకు కిరీటాలు ఇచ్చి, మీకు మీరు కింగ్ అన్పించినపుడు కిరీటం పెట్టుకోమని చెప్పారు.. ప్రేక్షకులు నిజంగానే సినిమాను ఆస్వాదిస్తూ కిరీటాలు పెట్టుకుంటున్నారు.. అది కొత్తగా అన్పించింది. ప్రస్తుతం స్వార్థం, కక్షలతో రాజకీయాలు నిండిపోయాయి... సినిమా అనేది రాజకీయాలకు బాణం లాంటిది.. సినిమా ద్వారా ఎంతో చెప్పొచ్చు. ఇక నుంచి నేను ఏదైనా మంచి చెప్పాలనుకుంటే సినిమా ద్వారానే చెప్పాలి అనుకుంటున్నాను.. మార్టిన్ లూథర్‌కింగ్ కూడ ప్రస్తుతం రాజకీయ పరిస్థితులను కళ్లకుకట్టినట్టు చూపిస్తుంది. ఈసినిమాలో నేను భాగం కావటం సంతోషంగాఉంది.

**మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు వంశీకృష్ణ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అభిషేక్ అగర్వాల్ క్రేజీ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్‌ఇండియా ప్రాజెక్టు టైగర్ నాగేశ్వరరావు.. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పిస్తున్నారు. మయాంక సింఘానియా సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈచిత్రంలో నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ హీరోయిన్లు.. ఈచిత్రం అక్టోబర్ 20న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత అభిషేక్ అగర్వాల్ మీడియాతో మాట్లాడారు.**

**'టైగర్ నాగేశ్వరరావు' బయోపిక్‌ను దేశవ్యాప్తంగా చూపించాలని అనుకోవటానికి కారణం?**

బయోపిక్స్ జనరల్‌గా నాయకులు, క్రీడాకారులు, ప్రముఖులపై చేస్తారు. అయితే ఒక దొంగకి బయోపిక్ ఎందుకు చేశామో సినిమాచూసినపుడు అర్థమవుతుంది.. ఒక మనిషి దొంగ ఎందుకయ్యాడు? దొంగ అయిన తర్వాత ఏం చేశాడు? వీటన్నిటికీ కారణలు ఉంటాయి... ఇవన్నీ ఈ బయోపిక్‌లో ఉంటాయి.. కంటెంట్ బేస్డ్, అన్‌టోల్డ్ స్టోరీస్ చెప్పాలనేది అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ లక్ష్యం... టైగర్ నాగేశ్వరరావు కూడ పవర్‌ఫుల్ కంటెంట్ ఉన్న సినిమా..

# నా ఆల్ టైం ఫేవరేట్ మూవీగా ఉంటుంది...



**ఈ బయోపిక్ చేయటానికి నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల అనుమతి తీసుకున్నారా?**

ఈ కథ చేసినపుడే దర్శకుడు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను సంప్రదించి, వివరాలు తెలుసుకుని వారి అనుమతి తీసుకున్నారు.

**ఒకేసారి మూడు పెద్దసినిమాలు వస్తున్నాయి కదా.. ఈ పోటీని ఎలా చూస్తారు?**

మేం ముందు అనుకున్నట్టుగా రిలీజ్ ప్లాన్ చేసుకున్నాం.. పండక్కి మూడు పెద్దసినిమాలు రావటం సహజమే.. మా ప్రోడక్ట్, కంటెంట్‌పై చాలా నమ్మకంగా ఉన్నాం.. అలాగే మా ప్రేక్షకులపై నమ్మకం ఉంది.. తప్పకుండా సినిమాగా గొప్పగా ఆదరిస్తారు.. నార్త్‌లో కూడ అద్భుతమైన స్పందన వచ్చింది.

**ఇది మీ బ్యానర్‌లో చాలా భారీ బడ్జెట్ సినిమా కదా.. మొదలుపెట్టినపుడు రిస్క్ అనుకున్నారా?**

కథకు ఏం కావాలో అది వందశాతం ఇస్తాను.. అలా ఇస్తేనే అవుట్ కమ్ ఇంత అద్భుతంగా వస్తుంది.. సినిమా నిర్మాణంలో ఎపుడూ రాజీపడను.

**మీరు ఇప్పటికే పాన్‌ఇండియా సినిమాలు చేశారు. దర్శకుడు వంశీకి ఇదే తొలి పాన్‌ఇండియా మూవీ .ఎలాంటి సూచనలు ఇచ్చారు?**

అన్నీ కలిసి నిర్ణయాలు తీసుకుంటాం.. మా మధ్య డైరెక్టర్, ప్రొడ్యూర్ అనుబంధం కంటే ఒక బ్రదర్స్ రిలేషన్ ఉంది.. ఆ రిలేషన్‌తోనే ముందుకెళ్లాం.. ఇదివరకే చాలా సార్లు చెప్పాను.. ఈసినిమాకు దర్శకుడే కాదు.. నిర్మాతగా కూడ ఆయన బాధ్యత తీసుకుని చేశారు.

**రవితేజ ఈసినిమా కోసం చాలా హార్డ్ రిస్క్ తీసుకున్నారు కదా?**

రవితేజగారు అద్భుతంగా సపోర్ట్‌చేశారు..చాలా హార్డ్‌వర్క్ చేశారు. యాక్షన్ సీక్వెన్సులన్నీ అయనేచేశారు.. ఆయన చేతికి గాయమైనప్పటికీ ప్రొడక్షన్‌కి ఎంతో సపోర్ట్‌చేస్తూ షూటింగ్‌కి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారు. టైగర్ నాగేశ్వరరావు నా ఆల్‌టైం ఫేవరేట్ మూవీగా నిలిచిపోతుంది.. ఈ జర్నీ చాలా డిఫరెంట్.. మెమరబుల్. మంచి ప్రోడక్ట్ తీసుకురావాలని సమిష్టి కృషితోనే ఈసినిమాచేశాం..

**హిందీలో కూడ జోరుగా ప్రచారం చేశారుకదా.?**

టైగర్ నాగేశ్వరరావు మీ డ్రీం ప్రాజెక్టు.. మొదటి నుంచి ఈసినిమా ప్రచారంపై ప్రత్యేక దృష్టిపెట్టాం.. తెలుగులో ఫస్ట్ లుక్ రాజమండ్రిలో గ్రాండ్‌గా లాంచ్ చేశాం.. తర్వాత నార్త్‌లో ట్రైలర్‌ను లాంచ్ చేశాం.,. మీ డ్రీమ్ ప్రాజెక్టుకి ఏం చేయాలో అన్నీ చేశాం.. నార్త్ నుంచి కూడ అద్భుతమైన స్పందన ఉంది.

**నేషనల్ అవార్డు అందుకోవటం ఎలా అన్పించింది?**

ఆనందంతో కన్నీళ్లు వచ్చాయి.. వచ్చిన మూడేళ్లలో నిర్మాతగా జాతీయ అవార్డు అందుకోవటం మా సంస్థకు ఎంతో గౌరవాన్ని తెచ్చింది.. ఇంతకటే నిర్మాత ప్రేక్షకులు, దేవుడు నుంచి ఏం కోరుకోవాలి.

**సోలో సినిమాల జర్నీ మొదలుపెట్టారు.. తర్వాత మీ ప్రయాణం ఇలానే ఉంటుందా?**

ప్రాజెక్టుఎలా కుదిరితే అలా ఉంటుంది.. త్వరలో మరోబయోపిక్ అనౌన్స్ చేస్తున్నాం. ఇది కూడ చాలా సర్‌ప్రైజ్‌గా ఉంటుంది.

# 'కీడా కోలా'ను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు: రానా

తన తొలి రెండు చిత్రాలు పెళ్లిచూపులు, ఈ నగరానికి ఏమంది.. బ్లాక్‌బస్టర్ విజయాలతో అందరి ప్రశంసలు అందుకున్న దర్వకుడు తరుణ్‌భాస్కర్ దాస్యం తన మూడో చిత్రంగా క్రైమ్ కామెడీ మూవీ 'కీడా కోలా'తో వస్తున్నారు.. న్యూ కమ్మర్స్‌తోకలిసి హాస్యబ్రహ్మ బ్రహ్మానందం ప్రధానపాత్రలో ఒకయూనిక్ ఎంటర్‌టైనర్‌ను ఎంచుకున్నారు. ఇప్పటికే విడుదలైన క్యారెక్టర్ పోస్టర్లు, టీజర్‌తో ఈసినిమాపై మంచి ఆసక్తి నెలకొంది.. బుధవారం ట్రైలర్‌ను హీరో రానా దగ్గుబాటి ఆవిష్కరించారు.. ఈసందర భంగా రానా మాట్లాడారు.. తాము అనుకున్న కథను బలంగా నమ్మి, కథకు కథనానికి కట్టుబడి సినిమాలు తీసే ఫిల్మ్ మేకర్స్ చాలా అరుదుగా ఉంటారన్నారు.




తరుణ్‌భాస్కర్ కూడ అలాంటి అరుదైన దర్శకుడు అని అన్నారు. ఒరిజినల్ సినిమాలు చేసే తరుణ్ లాంటి ఫిల్మ్‌మేకర్ తెలుగు పరిశ్రమలో ఉండటం ఒ గౌరవగా భావిస్తానని అన్నారు. కీడాకోలా చిత్రాన్ని తరుణ్ చూపించినపుడు చాలా నవ్వుకున్నానని అన్నారు.. ప్రేక్షకులు కూడ ఎంజాయ్ చేస్తారనే నమ్మకం ఉందన్నారు. నవంబర్ 3న సినిమా వస్తోందని తెలిపారు. తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ, క్రైమ్ కామెడీ జాన్ నాకు ఇష్టమైన జోనర్ అని అన్నారు. ఈజోనర్‌లో సినిమా చేయాలని ఎప్పటి నుంచో ఉండేదని అన్నారు. చిత్రీకరణలో చాలా ఎంజాయ్ చేశామన్నారు. ఇందులో కొత్తదనం ఉంటుందన్నారు. సినిమా అంతా వినూత్నంగా ఉంటుందన్నారు. ఫ్యామిలీ, స్నేహితులతో కలిసి వెళ్లండి కచ్చితంగా ఎంజాయ్ చేస్తారని అన్నారు. ఇందులో పాత్రలన్నీ వియర్డ్‌గా ఉంటాయన్నారు. అందులోనే ఫన్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో చైతన్య రావు మదాడి, రాగ్ మయూర్, నిర్మాతలు తదితరులు మాట్లాడారు.



# మిద్దె తోటల్ని ప్రోత్సహిస్తోన్న జ్యోతి



ఆరోగ్యాన్ని అందించే 'నల్ల బంగారా'న్ని పండిస్తున్నారామె. తనని అనారోగ్యం నుంచి బయటపడేసిన ఆ 'ఆహార మంత్రాన్ని' రైతులకూ, ప్రజలకు పరిచయం చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నారు. 16 ఎకరాల్లో వానపాముల్ని సాగుచేస్తూ.. రైతులు, మిద్దెతోట పెంపకందార్లు సేంద్రియ బాట పట్టేలా చేస్తున్నారు హైదరాబాద్‌కి చెందిన గుత్తా జ్యోతి వెంకటరెడ్డి. ఆ విశేషాలను తెలుసుకుందాం..

మాది వ్యవసాయ కుటుంబం నల్గొండలోని గుద్రపల్లి మా సొంతూరు. టీచర్ కావాలని బిఇడి చదివా. కానీ నాన్న చనిపోవడంతో.. ఆ కల నెరవేరలేదు. హైదరాబాద్‌కి చెందిన వెంకటరెడ్డితో నా వివాహం అయ్యింది. ఆయన వ్యాపారవేత్త. ఇద్దరు పిల్లలు, జీవితం అలాగే సాగిపోయి ఉంటే నేనిలా వ్యవసాయ వ్యాపారవేత్తని అయి ఉండేదాన్ని కాదేమో. మా వారికి వ్యాపారంలో వరుసగా నష్టాలు పలకరించాయి. దాన్నుంచి బయటపడటానికి డెయిరీఫామ్‌ని మొదలుపెట్టారు. సరైన అవగాహన లేక దాంట్లోనూ నష్టాలే. దాంతో నేను చీరల వ్యాపారం మొదలుపెట్టా. కాస్త ఫరవాలేదు అనుకొనే సమయానికి మరో దెబ్బ. నన్ను అనారోగ్యం కుదివేసింది. పెద్ద పేగులో గడ్డ ఏర్పడిందన్నారు వైద్యులు. ఆపరేషన్ చేసి తొలగించారు. కానీ కలుషిత ఆహారానికి దూరంగా ఉండమన్నారు. దాంతో ఆరు నెలలు డాక్టర్లు చెప్పినట్టుగా మందులు వేయకుండా మేం సొంతంగా పండించిన ఆహారమే తిని ఏడాదికల్లా కోలుకున్నా. అంత త్వరగా కోలుకోవడం చూసి డాక్టర్లే ఆశ్చర్యపోయారు. అప్పుడు వచ్చిన ఆలోచనే వర్మీకంపోస్ట్ తయారీ.

**భూమి కలుషితం కాకుండా...** ఒకప్పుడు కేన్సర్ నూటికో కోటికో ఒకరికి వచ్చేది. అలాంటిది ఎవరి నోట విన్నా అదే మాట. దీనికి కలుషిత ఆహారం కూడా కారణమే అనిపించింది. అందుకే సమస్య ఎక్కడుందో మందు అక్కడే వేయాలనుకున్నా. భూమి కలుషితం కాకుండా, సేంద్రియ ఎరువుని తయారు చేసి రైతులకి అందించాలనుకున్నా. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో కొంత అవగాహన ఉంది. దీనికి తోడు కొంత మంది శాస్త్రవేత్తలతోనూ మాట్లాడాను. వర్మీకంపోస్ట్‌తో భూమికీ, పంటకీ కూడా లాభం. అందుకే పెద్ద అంబర్‌పేట్‌లో 3.5 ఎకరాలు లీజుకి తీసుకుని వానపాముల పెంపకం చేపట్టా. మొదట్లో సరైన అవగాహన లేక పక్షులు వాటిని తినేసేవి. వాతావరణ మార్పులకీ వానపాములు చనిపోయేవి. దీనికి తోడు చుట్టాలు, ఇరుగు పొరుగువాళ్లు 'ఇంత చదువుకున్నావ్ పెంటతో వ్యాపారం ఏంటి' అనేవారు. ఇక ఆపేద్దామనుకున్నా. మావారు ధైర్యం చెప్పడంతో మరిన్ని జాగ్రత్తలు తీసుకుని ముందుకెళ్లా. వానపాములు పెరిగే బెడ్స్‌ని పూర్తి నీడలో ఉంచి, పక్షులు రాకుండా షెడ్‌లు, నెట్ వేశా. నల్లబంగారం లాంటి వర్మీకంపోస్ట్ కోసం 60 రోజులు ఓపిగ్గా ఎదురుచూడాలి.

మొదట్లో రైతుల్లో అవగాహన పెంచడానికి చాలా సమయం పట్టింది. కొవిడ్ తర్వాత ప్రజల్లో అవగాహన పెరిగి వాళ్లే మా దగ్గరకు రావడం మొదలుపెట్టారు. రైతులు, మిద్దెతోటలు పెంచేవాళ్లు, గృహిణులు మా ఉత్పత్తులని ప్రత్యేకంగా అడుగుతున్నారు. దాంతో వాళ్ల కోసం వేపపిండి, కోకోపీట్, పాట్‌మిక్స్, ఎర్రమట్టి, జీవామృతం తయారుచేస్తున్నా. వానపాముల్నీ విడిగా అమ్ముతాం. 12 యేళ్ల క్రితం మొదలైన ఈ వ్యాపారం ఇప్పుడు ఆదిభట్ల, పెద్దఅంబర్‌పేట్, తారమతిపేట్, నాదర్‌గుల్ ప్రాంతాలకు విస్తరించింది. 16 ఎకరాల్లో సాగుచేస్తున్నాం. ఈ ఉత్పత్తులను విదేశాలకూ పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. 40 మంది ఉపాధి పొందుతున్నారు. నెలకి అన్ని ఖర్చులు పోను రూ.2 నుంచి 3 లక్షల వరకు ఆదాయం వస్తోంది. నేను చేస్తున్న సేంద్రియ ఎరువుల తయారీని సోషల్ మీడియాలో చూసిన తెలంగాణ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి తన ఇంటికి పిలిచి మరీ ప్రశంసించడం సంతోషంగా అనిపించింది. రైతులందరూ రసాయనాలకు దూరంగా సేంద్రియం బాట పట్టాలన్నదే నా లక్ష్యం.

## నేటి అలంకరణ

# శ్రీ మహా చండీ దేవి



"హ్రీంకారాసన గర్భితా నలశిఖాం సౌఃక్లీం కళాంబిభ్రతీం
సౌవర్ణాంబరధారణీం వరసుధాదౌతాం త్రినేత్రోజ్జ్వలాం
వందే పుస్తకపాశమంకుశ ధరాం స్రగ్భూషితాముజ్జ్వలాం
త్వాం గౌరీం త్రిపురాం పరాత్పర కళాం శ్రీచక్రసంచారిణీం!!"

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో 5వ రోజు శ్రీ మహా చండీదేవిగా బెజవాడ దుర్గమ్మ భక్తులకు దర్శనమీయనుంది. సాధారణంగా అమ్మను పట్టువస్త్రాలతో అలంకరిస్తారు. కానీ ఈ అవతారంలో అమ్మవారి అలంకారం పూర్తిగా వస్త్రాలతో సహా స్వర్ణమయమై ఉంటుంది. విజయవాటిక (ప్రస్తుతం విజయవాడ)ను పరిపాలించిన మాధవవర్మ అనే రాజు ధర్మనిరతికి మెచ్చిన అమ్మవారు విజయవాడలో కనకవర్షం కురిపించింది. అందుకు గుర్తుగా ఆనాటి నుండి దసరా ఉత్సవాలలో మొదటి రోజున అమ్మవారిని స్వర్ణకవచంతో అలంకరించడం ఆనవాయితీగా వచ్చింది. ఈ అవతారంలో అమ్మవారి దర్శనం సకల పాపాలను పోగొట్టి, లౌకిక సంపదలు చేకూరుస్తుంది.

**అలంకారం :** అమ్మవారికి అలంకరించే పట్టుచీర బంగారు వర్ణంతో జరీ అంచు కలిగి స్వర్ణకాంతులతో ధగధగలాడుతుంది.

**మంత్రం :** "ఓం హ్రీం శ్రీం క్లీం మహాచండికాయై నమః" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి. ఎరుపు, పసుపు రంగు పూలతో అమ్మవారిని పూజించాలి.

**నైవేద్యం :** అమ్మవారికి పులిహోర, పొంగలి నివేదన చేయాలి.

-భట్టిప్రోలు నటరాజకుమార్, ప్రభాతవార్త, విజయవాడ

# ఆకట్టుకునే దాండియా స్టిక్స్






బతుకమ్మ, దసరా అంటేనే దాండియా, గర్బా నృత్యాల కోలాహలం! ఈ నవరాత్రులూ యువతులు, మహిళలు 'దాండియా ఆటలు ఆడ.. సరదా పాటలు పాడ..' అంటూ తమ ఆటపాటలతో అమ్మవారిని ప్రసన్నం చేసుకుంటుంటారు. అయితే ఈ సరదా ఆటల్లో దాండియా స్టిక్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంటాయి. ఎందుకంటే చాలామంది అమ్మాయిలు సాధారణ కోలలతో పాటు వివిధ రకాలుగా అలంకరించిన దాండియా స్టిక్స్‌ని ఎంచుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు. వారి అభిరుచులకు తగినట్లుగానే ఏటికేడు ఆకర్షణీయంగా ముస్తాబై అతివల మనసు దోచుకుంటుంటాయివి.













# సగ్గు బియ్యంతో వడలు..

సగ్గు బియ్యంతో స్పెషల్‌గా..

రోజూ బ్రేక్‌ఫాస్ట్‌లో ఉల్లి దోశ, సాంబారు ఇడ్లీ అంటే ఎవర్తికైనా బోర్ కొడుతుంది. అందుకే ఈ సారి సగ్గుబియ్యంతో వడలు వేసుకోండి. సాబుదానా బోండాలను ఒకసారి రుచి చూస్తే మీ బ్రేక్‌ఫాస్ట్ మెనూలో అవి రెగ్యులర్ అయిపోతాయి. ఇంకా సగ్గుబియ్యంతో దోశలు, థాలీ పీట్, పాపడ్ వంటివి చేసుకోవచ్చు. వాటి తయారీ విశేషాలు తెలుసుకుందాం..

**కావలసినవి:** సగ్గుబియ్యం-ఒకటిన్నర కప్పు, బంగాళదుంపలు-రెండు, పంచదార-అర టీస్పూన్, పల్లీలు-ముప్పావు కప్పు, పచ్చిమిర్చి-మూడు, కొత్తిమీర- ఒక కట్ట, నిమ్మరసం-అర టేబుల్‌స్పూన్, ఉప్పు-రుచికితగినంత, నూనె-డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ విధానం :** సగ్గుబియ్యాన్ని కడిగి పావు కప్పు నీళ్లు పోసి మూత పెట్టి రెండు గంటలపాటు పక్కన పెట్టుకోవాలి. బంగాళదుంపలను మెత్తగా ఉడికించుకుని పొట్టు తీసేసి ఒక బౌల్‌లోకి తీసుకోవాలి. పల్లీలు వేయించి పొడి చేసుకోవాలి. ఇప్పుడు బంగాళదుంపల బౌల్‌లో సగ్గుబియ్యం, పల్లీల పొడి, పచ్చిమిర్చి, కొత్తిమీర, నిమ్మరసం, పంచదార, తగినంత ఉప్పువేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ వడలుగా ఒత్తుకోవాలి. తరువాత కొద్దిసేపు వాటిని ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. స్టవ్‌పై కడాయి పెట్టి నూనె పోసి వేడి అయ్యాక వడలు వేసి వేయించాలి. ఏదైనా చట్నీతో సర్వ్ చేసుకోవాలి. ❑

# నేడు అలిగిన బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో ఆరవ రోజు తంగేడు, గునుగు, బంతి, చెమంతి తదితర పూలను ఆరు వరుసఎత్తుల్లో పేర్చి, గౌరమ్మను వాటిపై పెడతారు. అలిగిన బతుకమ్మగా ఆడరు.

# సువాసనల కురులు

చాలా మందిలో తల స్నానం చేసిన మరుసటి రోజే జుట్టు కళావిహీనమవుతుంది. లేదా జిడ్డుగా తయారవుతుంది. దీనికి చుండ్రూ తోడైతే ఒకలాంటి వాసన. ఆరోగ్యంగా కనిపించడంతోపాటు తల సువాసనలూ వెదజల్లాలా? అయితే వీటిని ప్రయత్నించేయండి.



**మల్లె..** అరకప్పు గులాబీ నీటికి నాలుగు చుక్కలు వెనీలా ఎక్స్‌ట్రాక్స్, రెండు టేబుల్ స్పూన్ల గ్రేప్‌సీడ్ ఆయిల్, పది చుక్కలు జాస్మిన్ ఎసెన్షియల్ ఆయిల్ కలపాలి. ఈ మిశ్రమాన్ని సన్నమంట మీద కొద్దిగా వేడిచేయాలి. చల్లారాక స్ప్రే బాటిల్‌లో పోస్తే సరి. తలస్నానం చేసి, జుట్టు ఆరబెట్టుకున్నాక దీన్ని తలంతా స్ప్రే చేసుకోవాలి. తేలిగ్గా మాడుమీద ఇంకడమే కాదు. జిడ్డూ ఉండదు. పైగా వెంట్రుకలకు తేమనందించి మెరిసేలానూ చేస్తుంది.

**గులాబీ...** కప్పున్నర గులాబీ నీటికి కొన్ని చుక్కలు చొప్పున మల్లె, నారింజ నూనెల్నికలపాలి. దీన్నో స్ప్రే బాటిల్‌లో పోసుకుంటే సరి. తలస్నానం చేసి నీరు కారడం ఆగాక తల, వెంట్రుకలకు దీన్ని స్ప్రే చేసుకుంటే చాలు. ఉండ్రు, జిడ్డులను దూరం చేస్తుందిది. చిక్కులు తేలిగ్గా వీడేలా చేయడంతపాటు వెంట్రుకలు మెరవడంలోనూ సాయం చేస్తుంది.

**కలబందతో...** కప్పు నీటికి పావు కప్పు అలొవెరా గురజ్జు, టేబుల్ స్పూను కొబ్బరి నూనె జోడించి బాగా కలపాలి. దీన్ని తలస్నానం చేశాక స్ప్రే చేసుకుంటే. మాడుపై మృతకణాలను తొలగించడంలో సాయపడుతుంది. దురద, అలర్జీలను దూరం చేయడంతోపాటు కురులు వేగంగా పెరిగేలా, మృదువుగానూ ఉండేలా చేస్తుంది. ❑

# వారిలో నైపుణ్యాలను పెంచండి..



చిన్నారుల్లో బాల్యం నుంచి సృజనాత్మకత పెంచడానికి ప్రయత్నించాలంటున్నారు నిపుణులు. ఇదేవారిని వివిధ రంగాల్లో నైపుణ్యాలను పెంచుకునేలా చేస్తుందని చెబుతున్నారు.

పిల్లల గది గోడలకు అంతరిక్షం, రకరకాల జంతువుల బొమ్మల పోస్టర్లు వంటివి ఉండేలా ఏర్పాటు చేయాలి. ఇవి వారిలో అన్వేషణ తరహా ఆలోచన మొదలయ్యేలా చేస్తాయి. తెలియని విషయాలను తెలుసుకోవాలనే ఆత్రుత పెరుగుతుంది. కొత్త విషయాల పట్ల ఆసక్తిని పెరిగేలా చేస్తాయి. క్రమేపీ సృజనాత్మకంగా ఆలోచించడం మొదలు పెడతారు. పిల్లల సందేహాలను తీర్చడానికి పెద్దవాళ్లూ కొత్త విషయాలు తెలుసుకుంటూ ఉండాలి. అప్పుడే చిన్నారుల మెదడుకు కావాల్సిన మేతను అందించగలుగుతారు. **విశ్లేషణ....** హోంవర్క్ చేసే బల్లపై భూగోళం బొమ్మను అమర్చాలి. గది గోడకు అట్లాస్ ఉండాలి. దీంతో భౌగోళికపరంగా వారిలో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. వాటి గురించి తెలుసుకోవా లనే ఆసక్తి వస్తుంది. మనం నివసించే భూమి గురించి అది తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ తిరగడం వింతగా అనిపిస్తుంది. అట్లాస్‌లో ప్రపంచదేశాలు, ఆయా భాషలు, ప్రాంతాల విశేషాలు వంటివన్నీ రోజుకొకటి చెప్పాలి. అవన్నీ వారికి భూగోళం గురించి తెలుసుకోవాలనే ఆసక్తిని పెంచుతాయి. ప్రతి చిన్న విషయంపై విశ్లేషణ ఇవ్వగలిగితే చాలు. వారి మెదడు చురుకుగా, సృజనాత్మకంగా మారుతుంది.

**కానుకలు...** ప్రత్యేక సందర్భాల్లో చిన్నారులకిచ్చే కానుకలు వారిని ఆలోచింపచేసేలా ఉండాలి. తోటిపిల్లలకు ఇచ్చే కానుకలను పిల్లలతోనే తయారు చేయించాలి. అలా వారి మెదడులో కొత్త డిజైన్ల ఆలోచనలొస్తాయి. దుకాణంలో కొన్న బొమ్మలకన్నా తమ చేత్తో తయారు చేసే వాటిపై పిల్లలకు ఎక్కువ ఆసక్తి పెరుగుతుంది. కాగితం అట్ట, క్లే వంటి వాటితో రకరకాల బొమ్మల ఆలోచనలు అందిస్తే చాలు. ఉత్సాహంగా నేర్చుకుంటారు. అలాగే క్విజ్ పూర్తి చేయడం నేర్పాలి చెస్, క్యారమ్స్ వంటివి వారి మెదడును మరింత చురుకుగా పని చేసేలా సృజనాత్మకతను పెంచుతాయి. ❑

# కౌన్సెలింగే సరైన చికిత్స

## వ్యథ



డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి, సైకాలజిస్టు

మావారికి తాగుడు, వాగుడు ఎక్కువ అయ్యింది. పెళ్ళయిన కొత్తలో ఎప్పుడో ఒకప్పుడు తాగిఇంటికి వచ్చేవారు. పార్టీలనో మిత్రుల బలవంతం వల్ల తాగవలసి వచ్చిందని సాకులు చెప్పేవారు. ఇంకెప్పుడు తాగనని ప్రాథేయ పడేవారు పదేళ్ల తరువాత తిరగబడి మాట్లాడటం ప్రారంభించారు. రోజు తాగి ఇంటికి వచ్చేవారు. అడిగితే ఎదురు తిరిగి ఇష్టం ఉంటే కాపురం చెయ్యి లేకపోతే వదిలెయ్యి అంటూ ఈసడించుకునేవారు. అప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్నందువల్ల, వారి మీద ఉన్న వాత్సల్యంతో బాధ్యత గుర్తించి సర్దుకోవడం అలవర్చుకున్నాను. మరో పదేళ్ల గడిచేసరికి ఆయన తీరు అసభ్యకరంగా, అసహ్యంగా మారిపోయింది. తాగి ఇంటికివచ్చి నానా రభస చేస్తారు. భూతులు తిడతారు. ఆయనకు నిద్రవచ్చే వరకు ఏదేదో వాగుతూ ఉంటారు. పిల్లలు పెరిగి పెద్దవారు అయ్యారు. చిన్నప్పుడు భయపడేవారు. ఇప్పుడు ఆయనను పట్టించుకోవడం మానేశారు. మావారి తండ్రి బాగా సంపాదించిపెట్టారు. నెలకు మూడు లక్షలకు పైగా అద్దెలు వస్తాయి. ఊరిలో పొలాలు, మామిడితోటలు ఉన్నాయి. వాటిమీద యేడాదికి ఐదారు లక్షలు వస్తాయి. దీనితో మావారు పనీపాటా లేకుండా తిరిగినా పూటగడుస్తున్నది. సరదాలు తీరుతున్నాయి. అయితే ప్రేమ అనురాగాలు మృగ్యమయ్యాయి. సుఖ సంతోషాలు కరువయ్యాయి. ఈ మధ్యకాలంలో ఆయన తాగి విపరీతంగా ప్రవర్తిస్తున్నారు. నెలక్రితం ఎవరో కారుకు అడ్డం వచ్చాడని, ఆపి కొట్టారు. అతనితో వున్న వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉండవలసి వచ్చింది. వారం క్రితం హైదరాబాదు వెళ్లారు. పేరున్న స్టార్ హోటల్లో దిగారు. హోటల్లోని బారులో ఊటుగా తాగి తన గది బదులు వేరే గది తాళం తీసే ప్రయత్నం చేశారు. తాను ఒకటే అన్న విషయం మరచిపోయి ఎవరో గదిలో ఉన్నారని భావించి కాలింగ్‌బెల్ నొక్కారు. అంతలోనే తలుపు దబా దబా బాదారు. గదిలో ఉన్నావారు బయటికి వచ్చి భూతులు తిట్టి హోటల్ మేనేజరుకు ఫిర్యాదు చేశారు. అదే హోటల్లో దిగిన మా బంధువు ఒకాయన విషయం తెలిసి సర్ది చెప్పారు. తరువాత ఆయన నాకు ఫోన్‌చేసి, మావారికి డి అడిక్షన్ చికిత్స చేయించమని సలహా ఇచ్చారు. ఇప్పుడు ఆయన వయస్సు 48 యేళ్ళు నాకు 45 ఏళ్ళు. పదిమందికి బుద్ధి చెప్పవలసిన వయసులో ఆయనకు చికిత్స అవసరమా అనిపిస్తోంది. సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయిస్తే మార్పు రాదా! అన్న సందిగ్ధం ఏర్పడుతున్నది.

ఇప్పటివరకు ఆయన ప్రవర్తన వల్ల మేము మాత్రమే ఇబ్బంది పడే వాళ్లం. ఇప్పుడు బయట కూడా ఇబ్బందులు ఎదురై పరువు పోతున్నది. నేను కూడా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నాను. ఒక్కోసారి ఎక్కడైనా ఒక అనాథ ఆశ్రమంలో తలదాచుకుందాము అనిపిస్తోంది. అప్పుడప్పుడు ఆత్మహత్య చేసుకుంటే పీడ విరగడవుతుందన్న భావన కలుగుతున్నది. అయితే ఇద్దరు బిడ్డల కోసం బాధలు భరిస్తూ బతుకుసాగిస్తున్నాను. ఈ పరిస్థితులలో మా వారిని మార్చుకోవడానికి మార్గం చెప్పండి.. - ఒక సోదరి



**జవాబు :** అమ్మా, చిరుగు చిన్నదిగా ఉన్నప్పుడే కుట్టాలి అంటారు పెద్దలు. ఏదైనా అంతే రోగం, రుగ్మత, జబ్బు, ప్రవర్తనా లోపం అన్నింటికీ ఈ మాట వర్తిస్తుంది. మొక్కైవంగనిది మానైవంగునా అన్న సామెత కూడా అక్షరాల సరిపోతుంది. వ్యసనం కూడా ఒక మానసిక రుగ్మతే అన్న విషయం గుర్తించాలి. పూర్వం గ్రామాలలో ఒకరో ఇద్దరో తాగుబోతులు ఉండేవారు. అందులోను కూలీ నాలి చేసుకునే వారిలోనే ఇలాంటి అలవాట్లు ఎక్కువగా ఉండేవి. వారు ఒళ్ళు నొప్పుల కోసం, ఇతర కారణాలతో తాగేవారు. ఇప్పుడు జనాభాలో అధిక శాతం పురుషులు వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. కొందరు సరదా కోసం, మరికొందరు స్టేటస్ కోసం ఇంకొందరు మానసిక ప్రశాంతత కోసం తాగుబోతులు అవుతున్నారు. మన సమాజంలో ఇంకా మహిళలు ఆ స్థితికి రానందుకు ఒక విధంగా సంతోష పడాలి. ఇప్పుడిప్పుడు కాలేజీ హాస్టళ్లలో ఉన్న కొందరు అమ్మాయిలు, హైసొసైటీ అన్న భ్రమలో ఉన్నకొందరు మహిళలు మందు వేస్తున్నారు. అతి తక్కువ కుటుంబాలలో భార్యాభర్తలు ఇద్దరు కలిసి తాగుతున్నారు. జీవితాన్ని ఉపయుక్తంగా సాగించలేని కొందరు సంతోషం, సరదాల కోసం అంటూ వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. అక్రమ సంపాదనపరులు, అక్రమ వ్యాపారాలు చేసేవారు తాము పతనం అవుతూ తమ చుట్టూ ఉన్నవారిని పతనం చేస్తున్నారు. ఇప్పటి యువతలో కొందరు మద్యం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. సరైన లక్ష్యం లేని వారు మానసిక దృఢత్వం కోల్పోయిన వారే ఎక్కువగా వ్యసనాలకు బానిసలు అవుతుంటారు. మీ వారికి పెద్దలు సంపాదించిన ఆస్తులు బాగా ఉన్నాయి. కూర్చుని తిన్నా తరగనంత సంపద ఉంది. దానిని ఉత్సాదక శక్తిగా మార్చుకునే లక్ష్యం లేక ఖాళీగా తిరగడం అలవర్చుకున్నారు. పనిలేక, పొద్దుపోక తాగడం అలవాటు చేసుకున్నారు. మీరు కూడా మొదట్లో ఆయనను నియంత్రించలేకపోయారు. తరువాత సాధ్యం కాదని వదిలేశారు. ఇప్పుడు ప్రమాదకర స్థాయికి చేరడంతో మేల్కొన్నారు. ఈ దశలో కౌన్సెలింగ్ చేసి మార్చడం ఒక విధంగా కష్టమనే చెప్పాలి. మీ బంధువు చెప్పినట్టు దీనికి డి-అడిక్షన్ చికిత్సే శరణ్యం ఆయనను అనువయించి లేదా బలవంతంగా అయినా సరే ఒప్పించి డి-అడిక్షన్ కేంద్రంలో చేర్పించి చికిత్స చేయించండి. అక్కడే కౌన్సెలింగ్ కూడా చేస్తారు. బాధలను భరించడం కాకుండా పరిష్కరించుకోవాలి అన్నది గమనించి ఆయనకు చికిత్స చేయించండి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.